నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

మంగళవారం | 27 ఫిబ్రవరి 2018 | విజయవాడ
సంపుటి 11 | సంచిక 123
| పేజీలు 12+12 | వెల: రూ. 5.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్ష తిథి : ద్వాదశి మ.12.52, పుష్యమి రా.2.47, వర్జ్యం ఉ.11.49 నుంచి 1.19 వరకు,
రాహుకాలం: మ.3.00 నుంచి 4.30 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుంచి 9.12 వరకు, తిరిగి రా.10.46 నుంచి 11.36 వరకు సూర్యోదయం : ఉ.6.40 గం; సూర్యాస్తమయం: సా. 6.18 గం.

ఆనంద ఆంధ్ర

• పెట్టుబడిపెడితే భాగస్వామి అయినట్టే • ఏపీలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం • రాష్ట్రానికి కేంద్రసాయం సరిగా రావడంలేదని అసంతృప్తి • ఒకసారి పెట్టుబడిపెడితే ప్రభుత్వంలో భాగస్వామి అయినట్లే • పారదర్శకత, విశ్వసనీయతతో పనిచేస్తాం • ఇప్పుడు తయారీరంగంలో ఏపీబాగా పుంజుకుంది • పరిశ్రమలకు 21 రోజుల్లో అన్ని అనుమతులు ఇస్తాం • ప్రతి సవాల్‌ను ఒక అవకాశంగా మలుచుకుంటున్నాం • సీఐఐ, బిజినెస్ రష్యా మధ్య ఎంవోయూ కుదిరింది • ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



(విశాఖపట్నం నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) రాష్ట్ర విభజన సహేతుకంగా జరగలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విభజన అనంతరం అనేక సమస్యలు ఎదుర్కొన్నామని, తమ దగ్గరున్న అన్ని వనరులను వినియోగించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి కేంద్రసాయం సరిగా రావడంలేదనే అసంతృప్తి ప్రజల్లో ఉందన్నారు. ఏపీ అంటే పవర్ ఆఫ్ ఇన్నోవేషన్ అనే స్థాయిలో పనిచేస్తున్నామన్న బాబు ఆనంద ఆంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి సాంకేతికత ఉపయోగించినా అది ప్రజల కోసమే అని అన్నారు. ఏ పని చేసినా నైతిక విలువలు పాటించాలని, అనైతికంగా ఎంత సంపాదించినా ప్రశాంతత ఉండదని సీఎం చంద్రబాబు తెలిపారు. విశాఖలో గత రెండు సదస్సుల్లో జరిగిన ఎంవోయూల పరిస్థితిని, కోర్ డాష్ బోర్డు పనితీరును ముఖ్యమంత్రి చంద్రబాబు సీఐఐ సదస్సులో వివరించారు. ప్రభుత్వ విశ్వసనీయతను తెలియజేయటానికే ఈ వివరణ ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ఒకసారి పెట్టుబడిపెడితే ప్రభుత్వంలో భాగస్వామి అయినట్టేనని సీఎం అన్నారు. పారదర్శకత, విశ్వసనీయతతో పనిచేస్తామని, ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ ద్వారా దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చునని ఆయన అన్నారు. ఏమైనా సమస్య ఉంటే 1100కు ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందన వస్తుందని చంద్రబాబు స్పష్టం

మిగతా 6లో

భాగస్వామ్య సదస్సులో పెట్టుబడులు రూ. 4,39,765 కోట్లు

• మొత్తం 11,02,125 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు • సదస్సు చివరి రోజే రూ.2,20,951 కోట్ల పెట్టుబడులు • చివరి రోజు మొత్తం 369 ఒప్పందాలు • 7,17,463మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు • 60 దేశాల నుంచి 280మంది ప్రతినిధులు



6లో



శ్రీదేవి మృతిపై అన్నీ అనుమానాలే!

పోస్టుమార్టం రిపోర్టులో విస్తుపోయే వాస్తవాలు

• ఫోరెన్సిక్ నివేదికను వెల్లడించిన యూఏఈ అధికారులు
• గుండెపోటు ఎంతమాత్రం కాదని నిర్ధారణ
• బాత్ టబ్‌లోనే శ్రీదేవి ఊపిరి ఆగిపోయిందని వెల్లడి
• శ్రీదేవి శరీరంలో ఆల్కహాల్ నమూనాలు?
• రెండోసారి శవపరీక్ష అవసరం లేదని అధికారులు స్పష్టం
• ముంబై తిరిగివచ్చిన బోనీ కపూర్ దుబాయ్ ఎందుకు వెళ్లినట్లు?
• శ్రీదేవి మృతి గురించి బోనీ ఎందుకు ఆలస్యంగా చెప్పారు?
• మృతదేహం భారత్‌కు చేరే కచ్చితమైన సమయంపై సందిగ్ధం
• శ్రీదేవి మృతిపై స్పందించన బోనీ కుటుంబ సభ్యులు
• శ్రీదేవి, బోనీ వివాహం తర్వాత కపూర్ కుటుంబంలో విభేదాలు
• ఇమ్మిగ్రేషన్ తదితర లాంఛనాల పూర్తికి మరికొంత సమయం
• శ్రీదేవి పార్థివదేహం తొలుత ఆమె నివాసానికి తరలింపు
• పవన్‌హన్స్ శ్మశానవాటికలో అంత్యక్రియలకు ఏర్పాట్లు
• బోనీకపూర్ పాస్‌పోర్ట్ స్వాధీనం... పోలీసుల విచారణ

హైదరాబాద్: మహానటి శ్రీదేవి భౌతికకాయం భారత్ చేరుకోవడానికి మరింత ఆలస్యం కానుంది. ఫోరెన్సిక్ నివేదిక క్లియరెన్స్ రాగానే శ్రీదేవి మృతదేహాన్ని అప్పగిస్తారు. ఆ తర్వాత ఇండియాకు తీసుకువస్తారు. మరోవైపు శ్రీదేవి మృతిపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. శ్రీదేవి మృతిపై కపూర్ ఫ్యామిలీ ఇంతవరకు స్పందించకపోవడం కూడా ఈ అనుమానాలకు బలం చేకూరుతోంది. మేనల్లుడు మోహిత్ మార్వా వివాహానికి బోనీకపూర్‌తో శ్రీదేవి కలిసి దుబాయ్‌లోని జుమైరా ఎమిరేట్స్ టవర్స్ హోటల్‌కు వెళ్లింది. శుక్రవారం సాయంత్రం రిసెప్షన్ తర్వాత హోటల్‌కు వెళ్లారు. బోనీకపూర్ తిరిగి భారత్‌కు వచ్చారని అంటున్నారు. అయితే తిరిగి బోనీ శనివారం మధ్యాహ్నం దుబాయ్ చేరుకున్నారు. దుబాయ్‌కి తిరిగి

మిగతా 6లో

లోక్‌పాల్ ఏర్పాటులో జాప్యం ఎందుకు?

• సంపన్నులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు • నీరవ్ మోడీ కుంభకోణంపై ఎందుకు నోరు మెదపడం లేదు? • కనీసం ఢిల్లీలో అయినా లోక్‌పాల్‌ను అమలు చేయడం లేదు • జైలుకెళ్లిన ముఖ్యమంత్రికి ఎందుకు మద్దతు పలుకుతున్నారు? • బసవేశ్వర చెప్పినట్లు ఆచరించాలి • మిమ్మల్ని ఎన్నుకున్నది కేవలం ఉపన్యాసాలివ్వడానికి కాదు • రాఫెల్ ఒప్పందంలో మార్పులు అప్పటి రక్షణ మంత్రికీ తెలియదు • మోడీపై నిప్పులు చెరిగిన రాహుల్



6లో

డిజిటల్ హబ్‌గా మారుస్తాం

• ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ రాష్ట్రం • అమరావతిలో చిప్ డిజైన్ యూనివర్సిటీ • ఫిన్‌టెక్ హబ్‌గా విశాఖ • కంపెనీలు త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు అనుమతులు • 2022 నాటికి దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీ • దేశంలో తయారవుతున్న ప్రతి పది ఫోన్లలో 2 ఆంధ్రప్రదేశ్‌లో తయారు • ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టరు • సమస్యలను అధిగమిస్తూ వృద్ధి సాధిస్తున్నాం • సిఐఐ భాగస్వామ్య సదస్సులో ఏపీ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్




(విశాఖపట్నం నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్ ను ఎలక్ట్రానిక్స్ హబ్ గా మార్చేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని ఏపీ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం అభివృద్ధి కి అనేక చర్యలు తీసుకోవడంతోపాటు అనేక పాలసీలు, రాయితీలు కల్పిస్తున్నామన్నారు. కంపెనీలు త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు అనుమతులు, భూములు వేగంగా కేటాయిస్తున్నామని వివరించారు. విశాఖ భాగస్వామ్యసదస్సులో సోమవారం మూడోరోజు ఎలక్ట్రానిక్స్ సెషన్‌లో పాల్గొన్న మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఒక స్టార్ట్ అప్ రాష్ట్రం అని, ఒక స్టార్ట్ అప్ కంపెనీలా అభివృద్ధి చెందడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఇతర దక్షణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం తక్కువగా ఉందని, కేవలం మూడున్నర ఏళ్లలోనే సమస్యలను అధిగమించి అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ 2022 నాటికి దేశంలో అభివృద్ధి చెందిన మొదటి మూడు రాష్ట్రాల్లో ఒక్కటి గానూ, 2029 దేశంలో నెంబర్ వన్ స్థానంలోనూ, 2050 కి ప్రపంచంతోనూ పోటీ పడాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నామన్నారు. లక్ష్యాలు సాధించాలంటే 15 శాతం వృద్ధి సాధించాలని, ప్రస్తుతం 12 శాతం వృద్ధి సాధించామని చెప్పారు. క్లస్టర్ మోడల్‌లో మాత్రమే

మిగతా 6లో

తెలంగాణ ఎంసెట్ షెడ్యూల్ విడుదల

• తొలిసారి ఆన్‌లైన్‌లో ఎంసెట్
• మే 2 నుంచి 7 వరకు పరీక్షలు
• మార్చి 4 నుంచి దరఖాస్తులు ప్రారంభం



వివరాలు 8లో

అంతా ఇంతే!



ఆయన హామీలు అమలు కాకపోతేనే కదా మనకు ఓట్లు పడేవి

హోదాపై చంద్రబాబుది పూటకోమాట

ఇలాంటి నేత పాలనను బంగాళాఖాతంలో కలుపుదాం

• పొదిలి బహిరంగసభలో ప్రజలకు వై.ఎస్.జగన్ పిలుపు
• చంద్రబాబు మాటలు వింటుంటే ఆశ్చర్యమేస్తోంది
• జీడీపీ విషయంలోనూ చంద్రబాబు అబద్ధాలు
• తాను చెప్పిందే కాక గవర్నర్‌తోను అబద్ధాలు చెప్పించారు
• వేల కోట్ల పెట్టుబడులు వస్తే ఆ మేర ఉద్యోగాలు ఎక్కడ బాబు



(పొదిలి నుంచి సూర్య పొలిటికల్‌బ్యూరో ప్రత్యేక ప్రతినిధి) : ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టుకో మాట మాట్లాడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. గతంలో హోదా సంజీవిని అన్న ఆయన తరువాత ప్రత్యేక ప్యాకేజీని స్వాగతించారని పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు మాట మార్చి హోదా గురించి మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రకాశం జిల్లా పొదిలిలో ఆయన బహిరంగ సభకు జనం పెద్ద ఎత్తున పోటెత్తారు. వైఎస్ జగన్ ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మోసపూరిత వైఖరిని తూర్పారబట్టారు. చంద్రబాబు నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్నారని, నాయకుడికి వ్యక్తిత్వం, విశ్వసనీయత, కమిట్‌మెంట్, సిన్సియారిటీ ఉండాలని అన్నారు. కానీ చంద్రబాబుకు అవేమీ లేవని వైఎస్ జగన్ విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం వైసీపీ గల్లీ నుంచి ఢిల్లీ వరకూ పోరాటాలు చేసిందని, హోదా ఆంధ్రుల హక్కు, ప్యాకేజీ పేరుతో మోసం చేయొద్దని నినదించామని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. చంద్రబాబు మాత్రం

మిగతా 6లో

నేడు నాగాలాండ్, మేఘాలయ పోలింగ్



• ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం • 60 అసెంబ్లీ స్థానాల్లో 59 స్థానాలకు ఎన్నిక • 23 స్థానాల్లో మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థుల పోటీ • అధికార ఎన్పీఎఫ్ 58 స్థానాల్లో పోటీ • ఎన్పీఎఫ్‌తో కాంగ్రెస్ పార్టీకి పొత్తు ప్రస్తుతానికి లేదు

వివరాలు 6లో

వరంగల్లో నేడు సర్పంచ్‌ల సమ్మేళనం

హైదరాబాద్,సూర్యప్రధానప్రతినిధి: రాష్ట్రంలో మూడు చోట్ల సర్పంచ్ ల సమ్మేళనాలు నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా మంగళ వారం వరంగల్లో సర్పంచ్‌ల సమ్మేళనాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారం భించనున్నారు. హన్మకొండ హంట్ రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్‌లో భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ (రూరల్), వరంగల్ (అర్బన్), యాదాద్రి భువనగిరి జిల్లాల సర్పంచ్ ల సమ్మేళనం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. అలాగే జోగులాంబ-గద్వాల, మహబూబ్ నగర్, మేడ్చల్ - మల్కాజ్ గిరి, నల్గొండ, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి జిల్లాల సర్పంచ్ ల సమ్మేళనాన్ని, మహబూబ్ నగర్ లో మార్చి 3న నిర్వహించనున్నారు. అలాగే ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, కొమురంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల సర్పంచ్ ల సమ్మేళనాన్ని మార్చి 5న నిజామాబాద్ లో నిర్వహిస్తారు. ప్రతి జిల్లా నుండి 100 మంది సర్పంచ్ లను ఈ సమ్మేళనానికి ఆహ్వానిస్తున్నారు. వీరికి జిల్లాలో ఉత్తమ పంచాయతీలుగా గుర్తింపు పొందిన గ్రామ సర్పంచ్ లతో తమ అనుభవాలను పంచుకొనే విధంగా సమ్మేళనాలను ఏర్పాటు చేస్తున్నారు. వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం, వందశాతం పన్నుల వసూలు, ఎల్ఈడీ లైట్ల వినియోగం, నీటి సంరక్షణ, ఉపాధిహామీ లాంటి కార్యక్రమాల్లో తాము ఎలా ముందు కువెళ్లింది వివరించి, ఇతర సర్పంచ్ లను ఆ దిశగా సన్నద్ధం చేసేలా సర్పంచ్ ల సమ్మేళనాలకు తెలంగాణా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏర్పాట్లు చేసింది.

ములుగు నియోజకవర్గంలో మంత్రి జూపల్లి పర్యటన

వరంగల్లో సర్పంచ్‌ల సమ్మేళనంలో పాల్గొన్న అనంతరం ములుగులో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నారు. నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.



సంస్కరణలకు శ్రీకారం

- పారదర్శక పాలనకు ప్రధాని చర్యలు
- డిజిటల్ ఇండియాగా తయారే లక్ష్యం
- సాంకేతిక పరిజ్ఞానంతో అక్రమార్కులకు చెక్
- ఆధార్ లింగ్‌తో 2.95 కోట్ల బోగస్ రేషన్ కార్డుల తొలగింపు
- ఆన్‌లైన్ సేవల ద్వారా సమయం ఆదా
- పౌరులకు మెరుగైన సేవలు లభ్యం
- కేంద్ర మంత్రి సీఆర్ చౌదరి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: దేశంలో పారదర్శకత పాలన అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ శ్రీకారం చుట్టారు. ఇందుకుగాను పాలనా సంస్కరణతో ప్రజలకు మెరుగైన పాలనతో పాటు సమయం వృధా కాకుండా ఉండేందుకు డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని చేపట్టారని కేంద్ర పౌరసరఫరాలు, వాణిజ్యశాఖ సహాయ మంత్రి సీఆర్ చౌదరి తెలిపారు. సోమవారంనాడు కేంద్ర ప్రభుత్వం-తెలంగాణ సర్కార్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న 21వ ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సదస్సు నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో సహకరించిందని కేంద్ర మంత్రి సీఆర్ చౌదరి తెలిపారు. ఇలాంటి గొప్ప సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ఆయన అభినందనలు చెప్పారు. ప్రజలకు మెరుగైన, పారదర్శక పాలన అందాలన్నారు. ప్రజలకు చేరువయ్యే పథకాలు రావాలని పేర్కొన్నారు. మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా నినాదంతో ముందుకు కేంద్రం వెళ్తున్నామని వెల్లడించారు. లక్షకు పైగా గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించామని స్పష్టం చేశారు. మొబైల్ వాడకంలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నామని తెలిపారు. దేశంలోని నిరుపేదలకు సబ్సిడీపై ఆహార వస్తువులు అందచేస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 23కోట్ల రేషన్‌కార్డుల ద్వారా సరుకులు సరఫరా చేస్తున్నామని, అయితే నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఆధార్ సంఖ్యను అనుసంధానించడంతో దీంతో 2.95 కోట్ల అక్రమ రేషన్ కార్డులు బోగస్‌గా గుర్తించినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి మినిమం గవర్నమెంట్, మాగ్జిమం ఈ-గవర్నెన్స్ పాలన జరగాలన్న అభిమతంతో ముందుకువెళ్తున్నారని వివరించారు. గతంలో కుల ధృవీకరణ పత్రం కోసం, రేషన్‌కార్డుకోసం 15రోజులు సమయం పడుతుండేడిదని, అయితే ఈ-గవర్నెన్స్ ప్రారంభించడంతో త్వరగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు నూతన ఆవిష్కరణలు చేసేందుకు ఈ సదస్సు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నిరుపేదలకు కేంద్ర సర్కార్ అందిస్తున్న సబ్సిడీ పథకాల లబ్ధిదారులను ఆధార్‌సంఖ్యతో అనుసంధానం చేసిన తర్వాత రూ.17వేల కోట్లు సర్కార్‌కు ఆధా అయ్యాయని తెలిపారు. డిజిటల్ ఇండియా నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సమయపాలన భారీగా త గ్గుతుందన్నారు. యువ భారత్‌లో యువతీ, యువకులకు మెరుగైన సేవలుఅ ందించాలన్నారు. ఇందులో భాగంగా ఉద్యోగ నియామక పరీక్షలన్నీ ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో పేపర్‌లెస్ పాలన కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా చర్చించి, నూతన సాంకేతికత అందుబాటులోకి తీసుకరావాలన్నారు.

రాష్ట్రంలో 22 లక్షల టన్నుల సామర్థ్యంతో గోదాములు

మంత్రి హరీశ్ రావు



కరీంనగర్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రతీ మండలానికి మార్కెటింగ్ గోదాములు, సబ్‌యార్డులను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. సోమవారం ఇక్కడ రైతు సమన్వయ సమితుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మినీ మార్కెట్ల ఏర్పాట్ల అంశంపై రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలపై మంత్రి స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలో నాలుగు లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు ఉండేవన్నారు. తెలంగాణ ఏర్పడినతర్వాత రూ.1000 కోట్లతో దేశంలో ఏ రాష్ట్రం లో జరుగనివిధంగా 18 లక్షల టన్నుల సామర్థ్యం కల్గిన గోదాముల నిర్మాణం పూర్తయిందని, మరో మూడు లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం 22లక్షల టన్నుల సామర్థ్యం కల్గిన గోదాములు రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. వీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని మంత్రి చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పత్తి ఎక్కువగా పండిస్తున్నా అక్కడ జిన్నింగ్ మిల్లులు తక్కువగా ఉన్నాయన్నారు. వనపర్తిలో వేరుశనగ అధికంగా పండుతుందని, కానీ అక్కడ ఆయిల్ మిల్లులు లేవని చెప్పారు. స్థానికంగా ఏ పంట ఎక్కువగా పండితే దానికి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నదని తెలిపారు. రైతు సమన్వ య సమితి సూచన మేరకు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. వ్యవసాయాధారిత ప్రాసెసింగ్ యూనిట్లు పెరిగితే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో కొత్తగా 35 మార్కెట్‌యార్డులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 3500 మినీ మార్కెట్ల నిర్మాణానికి బడ్జెట్ కేటాయించిందని, దీనికి సంబంధించిన మార్గదర్శకాల రూపకల్పన జరుగుతున్నదని తెలిపారు.

ప్రజలతో సంబంధాలు మెరుగుపరుచుకోవాలి

ఉపముఖ్యమంత్రి చినరాజప్ప



కాకినాడ,సూర్యబ్యూరో: క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు మెరుగు పరుచుకోవాలని ఉపముఖ్యమంత్రి చినరాజప్ప తెలిపారు. సోమవారం కాకినాడలో సూర్యబ్యూరోతో మాట్లాడుతూ ప్రజల ఆదరణ ,ఆశీస్సుల వల్లే టీడీపీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు.పనిచేసే ప్రజాప్రతినిధులు. ప్రభుత్వాన్ని ప్రజలు మరచిపోరని ఆయన తెలిపారు. ఇదేవిషయాన్ని పరిగణలోకి తీసుకుని ప్రజలతో మమేకం కావాలని సూచిం చారు. ప్రభుత్వ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్య కర్తలకు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కారం చేయకపోతే ప్రజలు ఓటుతో సమాధానం చెప్పుతారని తెలిపారు.

రైతుల బట్టలు విప్పి దారుణంగా హింసిస్తారా?


వైసీపీ నేత పార్థసారథి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాజధాని పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారని వైసీపీ అధికార ప్రతినిధి, మాజీమంత్రి పార్థసారధి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతుల వద్ద నుంచి వేల ఎకరాలు భూములు తీసుకుని ఇంతవరకూ ఎలాంటి నిర్మాణాలు చేయలేదని ఆయన విమర్శించారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్థసారధి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజధాని నిర్మాణానికి భూమి ఇవ్వడానికి నిరాకరించిన రైతుపై టీడీపీ నేతలు, అధికారులు, పోలీసులు దాడి చేయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత ప్రజలతో పాటు ప్రభుత్వంపై కూడా ఉందనే సంగతి మీకు తెలియదా చంద్రబాబూ అని ప్రశ్నించారు. రైతు గద్దె మీరాప్రసాద్ అనే వ్యక్తికి సంబంధించిన భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు ఆదేశాలు ఇచ్చినా అధికారులు దాన్ని ఉల్లంఘించారన్నారు. నిర్మాణాలను అడ్డుకోవడానికి వెళ్లిన రైతు బట్టలు ఊడదీసి దాడి చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఏపీలో ప్రస్తుతం రాక్షస పాలన కళ్లకు కట్టినట్లుగా ఉందన్నారు. ప్రజాస్వామ్య పాలన అయితే ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలన్నారు. రాజధాని నిర్మాణం కోసం చంద్రబాబు సేకరించిన 33 వేల ఎకరాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వాటిల్లో 2,3 వందల్లో మాత్రమే తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ కట్టారన్నారు. మిగిలిన భూముల్లో టీడీపీ ఎమ్మెల్యే లారీల్లో తన గేదెలను తీసుకువచ్చి మేవుకున్న దుస్థితి నెలకొందన్నారు. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన పోలీసులు మంత్రులు అండతో ప్రజలపై హింసకు దిగుతున్నారని పార్థసారధి మండిపడ్డారు. తమ భూమి ఇవ్వనని స్పష్టంగా చెప్పిన రైతుపై దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. అంటే రాష్ట్రంలో ఎలాంటి పాలన రాజ్యమేలుతుందో అర్థం చేసుకోవాలన్నారు. కోర్టు ఆదేశాలు ఉల్లంఘించిన పోలీసులు, నిర్మాణాలు చేపట్టిన అధికారులు, వారి వెనుక ఉన్నవారిపై ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

పెట్టుబడుల పేరుతో మభ్యపెడుతున్నారు

వైసీపీ ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి



కడప, మేజర్‌న్యూస్: నాలుగేళ్లుగా లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చేశాయని, ఆంధ్రప్రదేశ్ వెలిగిపోతుందని చెబుతూ ప్రజల్ని మభ్యపెడుతున్నారని వైసీపీ ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. నేడు సమ్మిట్ కోసం వందల, వేల కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటి వరకూ ఒక్క పరిశ్రమ రాలేదని, అన్ని పెట్టుబడులు వస్తే నిరుద్యోగ సమస్య ఉండేది కాదని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి తప్పిదాల్ని ఎత్తిచూపితే, అది ఇతరులపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 14 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించి, రాయలసీమను నిట్టనిలువునా ముంచారని మండిపడ్డారు. హైకోర్టు అడిగితే సుప్రీంకోర్టు, రాజధాని అడిగితే పార్లమెంటు నిర్మించుకోండంటూ కేబినెట్ మంత్రులు అవహేళన చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. మీ మంత్రులు, ఎంపీలు దేశ సమగ్రతను మరిచి దక్షిణ భారత దేశం వేరే దేశంగా విడిపోవాలంటూ మాట్లాడటం దేశాన్ని కించపరిచే విధానం కాదా అని ప్రశ్నించారు.

కేసీఆర్‌కు థ్యాంక్స్ అంటూ ట్వీట్ చేసిన ఒవైసీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్: పాతబస్తీలో శాంతిభద్రతల పరిస్థితి మెరుగ్గా ఉందని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. నాలుగేళ్లలో జరిగిన హత్యలు, చైన్ స్నాచింగ్‌లు తగ్గడాన్ని పోలీసులు జారీ చేసిన సూచీని జతపరుస్తూ ఆయన ట్వీట్ చేశారు. పాతబస్తీపై తప్పుడు అంచనాలు ఉన్న వారు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. నేరాల అదుపునకు కృషి చేసిన ముఖ్యమంత్రి, డీజీపీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పాతబస్తీవాసులు హుందాతనం ప్రదర్శిస్తున్నారంటూ వారిని అసదుద్దీన్ ఒవైసీ అభినందించారు.

ఏపీలో పెట్టుబడులు పెట్టండి

తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్



విశాఖపట్నం, సూర్య ప్రత్యేక ప్రతినిధి : పరిశ్రమల ఏర్పాటు, వ్యాపార అభివృద్ధికి స్నేహపూర్వకమైన విధానాలు అవలంబిస్తూ ఆంధ్రప్రదేశ్ సులభతర వాణిజ్యంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. రాష్ట్రంలో పెట్టే పెట్టుబడులు పూర్తిగా భద్రమని, సురక్షితమని ఆంధ్రప్రదేశ్ ప్రథమ పౌరుడిగా తాను భరోసా ఇస్తున్నానని పారిశ్రామికవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. పాలనాపరమైన దక్షత, దార్శనికతలతో సీఎం రాష్ట్రాభివృద్ధికోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన రహదారి, రైల్వే, ఓడరేవులు, విమానాశ్రయాల అనుసంధానం ఉందన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 40 ఏళ్ల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పారిశ్రామికవేత్తలు పెట్టుబడికి రక్షణ, పర్యావరణానికి విఘాతం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కృత్రిమ మేధస్సు కన్నా భారత దేశ యువత మేధస్సు శక్తిమంతమైనదని, టెక్నాలజీ అనేది ఒక అదనపు వనరుగానే ఉండాలని అభిప్రాయపడ్డారు.

సింగపూర్‌తో ఏపీ కీలక ఒప్పందం: అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మూడు రోజుల పాటు విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో పెట్టుబడులకు ఉన్న అవకాశాల ను వివరించామని చెప్పారు. వినూత్న రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించ టం ద్వారా ఆంధ్రప్రదేశ్ కొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా ఇన్నోవేషన్ వ్యాలీగా మారిందన్నారు. సింగపూర్, జపాన్ లాంటి దేశాల సహకారంతో ఆకర్షణీయమైన, అత్యుత్తమమైన రాజధానిని నిర్మించుకుంటున్నామని, భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్- సింగపూర్ సంయుక్తంగా బిజినెస్ కౌన్సిల్ ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదిరిందని చెప్పారు. దేశంలో నూతన పారిశ్రామిక ఆవిష్కరణలు ఏవైనా ముందుగా ఏపీలో జరగాలనేది నా ఆకాంక్ష అని చంద్రబాబు అన్నారు. ఈ మూడేళ్లలో జరిగిన భాగస్వామ్య ఒప్పందాల ద్వారా 1946 ఎంఓయూలు కుదుర్చుకుంటే 531కంపెనీలు ఉత్పత్తి ప్రారంభించాయన్నారు. 1143 పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయని, ఈ మూడు రోజుల్లోనూ రూ.4.39 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదిరాయని, వీటిలో 90 శాతం అమల్లోకి వస్తాయని ఆశిస్తున్నామని అన్నారు. ముందస్తు పరిశీలన తర్వాత ఒప్పందాలు చేసుకున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలి

- సాంకేతిక పరిజ్ఞానానికి యువత అలవాటు కారాద్దు
- పరిమిత వినియోగంతోనే సత్ఫలితాలు
- యాంత్రిక జీవితానికి దాసోహమవ్వద్దు
- సీఐఐ సదస్సులో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురూజీ




విశాఖపట్నం, సూర్య ప్రధాన ప్రతినిధి : యువతలో ప్రతిభ, ఆత్మవిశ్వాసం, సమాజంపై నమ్మకం ఉంటే ఆ సమాజ అభివృద్ధిని ఎవరూ ఆపలేరని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ అభిప్రాయపడ్డారు. స్వయంగా ఎదగటంతో పాటు సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలన్న దాతృత్వ గుణం ఉండాలని స్పష్టం చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధిని రెట్టింపు చేయాలని అభిప్రాయపడ్డారు. ప్రతి వ్యక్తి నైతిక విలువలతో కూడిన క్రమశిక్షణను అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక భావన, ధ్యానం, వ్యవస్థలపై విశ్వాసం వంటి అంశాలతో ఇవి ముడిపడి ఉంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విశాఖలో జరుగుతున్న భాగస్వామ్య సదస్సులో మూడో రోజు ప్లీనరీ విత్ సోషల్ ఐకాన్ పేరిట నిర్వహిం చిన సమావేశంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ గురూజీ, ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వివిధ ప్రశ్నలకు సమాధానమిచ్చారు. వ్యక్తితో పాటు సమా జంపై ఒత్తిడి తగ్గినప్పుడే సదరు సమాజం వృద్ధిపథంలో దూసుకు పోతుందని రవిశంకర్ గురూజీ అభిప్రాయం వ్యక్తం చేశారు. పెరిగిన సాంకేతికత కారణంగా సెల్ ఫోన్లు వ్యక్తిగత జీవితాన్ని ఛిద్రం చేస్తున్నాయని, యాంత్రిక జీవ నానికి సమాజం అలవాటు పడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగు తున్న ఒత్తిళ్లను తగ్గించేందుకు ఒంటరితనం కోసమే ఓ ప్రత్యేక శాఖను బ్రిటన్ లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియో గించినా యువత దానికి అలవాటు పడకూడదన్నారు. రాష్ట్ర విభజనపై తానూ ఆవేదన చెందినా హైదరాబాద్‌ను విడిచి పెట్టారు కాబట్టే ముఖ్యమంత్రి చంద్ర బాబు కొత్త రాజధానిని నిర్మించగలుగుతున్నారన్నారు. రాష్ట్రం మరింత అభి వృద్ధి వైపు దూసుకెళుతోందని రవిశంకర్ వ్యాఖ్యానించారు. ఆధ్యాత్మికత, సంతోషం కలయిక సమాజంలో వృద్ధిని తెస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సదస్సులో సంధాన కర్త ప్రశ్నలకు జవాబిచ్చిన సీఎం వ్యక్తిగత జీవితంలోనూ సమాజంలోనూ విలువలు కీలక భూమిక పోషిస్తాయన్నారు. ఒత్తిడి తగ్గించటంతో పాటు విలువలు పెంచేందుకు మంత్రులు, అధికారులకు కూడా ఆర్ట్ ఆఫ్ లివింగ్ తరగతులు నిర్వహించామన్నారు. విలువల ద్వారా అవినీతి దూరమవుతుందని, భారత్‌కే సొంతమైన కుటుంబ విలువలు మరే దేశానికీ లేవని అన్నారు. దేశ ప్రజల్లో క్రమంగా మార్పు వస్తోందని, రాజకీయాలు కూడా అందుకు అనుగుణంగానే మారాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో సాంకేతికత సాయంతో పారదర్శక పాలన అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. 1100 కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదులు తెలుసుకోవటం, పరిష్కరించటంతో పాటు ఓ అడుగు ముందుకు వేసి గూగుల్ తరహాలో ప్రజల సమస్యలను ప్రభుత్వమే తెలుసుకునే ప్రయ త్నం చేస్తోందన్నారు. సమాజానికి చెందిన సంపదను ఒక్కడే అనుభవించాలని చూస్తే అది దోపిడీ అవుతుందని, సంపద సమాజానిది, ఆస్థి వ్యక్తిగతమన్నారు. జీవితంలో తృప్తి అనేది ముఖ్యమని, ఎంత సంపద ఉన్నా తృప్తిలేకపోతే ఆనందం దక్కదని సూచించారు. పనిని ప్రేమిస్తూ ప్రశాంతంగా నిద్రిస్తానని సీఎం వ్యాఖ్యానించారు. సహేతుకంగా విభజన జరక్కపోవటంతో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, ఇప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వం అందించాల్సిన సాయం రాష్ట్రానికి సరిగా రావటం లేదనే అసంతృప్తి ప్రజలందరిలోనూ ఉందని ఆయన చంద్రబాబు ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అంటే పవర్ ఆఫ్ ఇన్నోవేషన్ అనే స్థాయిలో పనిచేస్తున్నామని,అదే సమయంలో ఆనందమయ ఆంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తున్నామన్నారు.

భాగస్వామ్య సదస్సులో శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ

యువతలో ప్రతిభ, ఆత్మవిశ్వాసం, సమాజంపై నమ్మకం ఉంటే ఆ సమాజ అభివృద్ధిని ఎవరూ ఆపలేరని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ అన్నారు. మూడో రోజు సీఐఐ భాగస్వామ్య సదస్సులో జరిగిన 'ప్లీనరీ విత్ సోషల్ ఐకాన్' సమావేశంలో శ్రీశ్రీ రవిశంకర్, సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ ఎదగటంతో పాటు సమాజానికి కొంత ఇవ్వాలన్న దాతృత్వ గుణం ఉండాలని సూచించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధిని రెట్టింపు చేయాలన్నారు. ప్రతి వ్యక్తి నైతిక విలువలతో కూడిన క్రమశిక్షణను అలవర్చుకోవాలని తెలిపారు. వ్యక్తితో పాటు సమాజంపై ఒత్తిడి తగ్గినప్పుడే సమాజం వృద్ధిపథంలో దూసుకుపోతుందని రవిశంకర్ గురూజీ అన్నారు.

ఏపీ వైపు ప్రపంచం చూపు

- జల సంరక్షణ ఉద్యమం ఉత్సాహంగా నిర్వహించాలి
- ఉపాధి హామీ కింద నర్సరీల అభివృద్ధి
- టెలి కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : మన కష్టంతో మన రాష్ట్రాన్ని నిర్మించుకుంటున్నామని, ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. విశాఖ సదస్సు విజయవంతం కావడం శుభపరిణామమని సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం నీరు-ప్రగతి, వ్యవసాయంపై సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జలసంరక్షణ ఉద్యమం సత్ఫలితాలు ఇస్తోందని అన్నారు. ఏపీలో భూగర్భజలాలు 1.6మీ. పెరిగాయని, రెండో దశ జలసంరక్షణ ఉద్యమం ఉత్సాహంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కాలువల్లో నీటి ప్రవాహానికి ఉన్న అవరోధాలు తొలగించాలన్నారు. నరేగా ద్వారా గ్రామాల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాలని బాబు తెలిపారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.745కోట్లు విడుదల చేశామన్న బాబు గతం నిధులు రూ.300కోట్లు పూర్తిగా వ్యయం చేయాలని అధికారులకు సూచించారు. రూ.1,045కోట్లతో గ్రామాల్లో మౌలికవసతులు అభివృద్ధి చేయాలన్నారు. కరవు మండలాలలో అదనంగా మరో 50పనిదినాలు కల్పించాలన్నారు. ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇంటర్ విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సమావేశంలో తెలిపారు. అక్రమాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. పెన్షన్ల పంపిణీకి నగదు కొరత లేకుండా చూడాలన్నారు. వేసవిలో పశుగ్రాస కొరత లేకుండా శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపాధి హామీ కింద నర్సరీలు అభివృద్ధి చేయాలని చంద్రబాబు తెలిపారు.

సత్ఫలితాలు ఇస్తోన్న ఉద్యమం : జలసంరక్షణ ఉద్యమం సత్ఫలితాలు ఇస్తోంది. రాష్ట్రంలో భూగర్భజలాలు 1.6మీ. పెరిగాయని, రాయలసీమలో 4.6అడుగులు పెరిగాయన్నారు. రెండవ దశ జల సంరక్షణ ఉద్యమం మరింత ఉత్సాహంగా నిర్వహించాలని, కాలువల్లో నీటి ప్రవాహానికి ఉన్న అవరోధాలు తొలగించాలని, గుర్రపు డెక్క పూర్తిగా తొలగించాలని కోరారు. నరేగా ద్వారా గ్రామాల్లో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాలని, 24కోట్ల పనిదినాల లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. రోజుకు 15లక్షల పనిదినాల లక్ష్యంలో ప్రస్తుతం 11లక్షల పనిదినాలకు చేరాం,ఇది మరింత మెరుగుపడాలని అన్నారు. 14వ ఆర్థికసంఘం నిధులు రూ.745కోట్లు విడుదలచేశామని, గతంలో ఉన్న నిధులు రూ.300కోట్లు కూడా పూర్తిగా వ్యయం చేయాలని, మొత్తం రూ.1045 కోట్లతో గ్రామాల్లో మౌలికవసతులు అభివృద్ధి చేయాలన్నారు. అన్ని గ్రామాలు టెన్ స్టార్ రేటింగ్‌లో ముందుండాలని, కరవు మండలాలలో అదనంగా మరో 50 పనిదినాలు కల్పించాలన్నారు. రోజు కూలీ రూ.187 చెల్లించి అందరికీ ఉపాధి కల్పించాలని కోరారు. రబీలో వర్షపాతం లోటు అధికంగా ఉన్నప్పటికీ సాగువిస్తీర్ణం 95 శాతానికి చేరుకున్నామని, దిగుబడులు తగ్గకుండా చూడాలన్నారు. రెయిన్ గన్లను సద్వినియోగం చేసుకోవాలని, సమర్థ నీటి నిర్వహణ ద్వారా సాగునీటి కొరతను అధిగమించాలని, కరవును అధిగమించడంలో దావోస్ సదస్సులో చర్చించిన విధానం ప్రయోగాత్మకంగా పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని గ్రామాలలో చేపట్టి ఫలితాలను విశ్లేషించాలన్నారు.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించండి

ఇంటర్ మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఆర్టీసి బస్సులు ప్రత్యేకంగా నడపాలని, అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని, పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ అధికారులకు రెవిన్యూ, పోలీస్ తదితర శాఖలు పూర్తి సహకారాన్ని అందించాలని, పింఛన్ల పంపిణీకి నగదు కొరత లేకుండా చూడాలని కోరారు. గతంలో రూ.500కోట్లు నగదు విడుదల చేయాలని ఆర్బీఐకి లేఖ రాశామంటూ మరో రూ.500కోట్ల నగదును విడుదల చేయాలని కోరుతామని చంద్రబాబు చెప్పారు. వేసవిలో పశుగ్రాస కొరత లేకుండా శ్రద్ధ వహించి ప్రతి పశువుకు పోషకాహారం అందించాలన్నారు. గత ఏడాది ఎంత పశుగ్రాసం ఇచ్చాం. దానిని రెట్టింపుచేస్తే పాల దిగుబడి ఎంత పెరుగుతుందనేది విశ్లేషించాలన్నారు. దానికి తగ్గట్లుగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని కోరారు.

మొక్కలతో రోడ్లకు ఇరువైపులా ప్లాంటేషన్

ఉపాధిహామీ కింద నర్సరీలు అభివృద్ధి చేయాలని, వాటిలో పెంచిన మొక్కలను రహదారులకు ఇరువైపులా ప్లాంటేషన్‌కు వినియోగించుకోవాలని, తద్వారా పర్యావరణం అభివృద్ధికి కూడా నరేగా నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాయు కాలుష్యం నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలని, పీల్చే గాలి నాణ్యత(ఎయిర్ క్వాలిటి) మెరుగుపరచాలని సూచించారు. ఈ సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవేనని, వాటిని పరిష్కరించే శక్తి కూడా మనలోనే ఉంది. మన శక్తి,సామర్థ్యాలు సద్వినియోగం చేసుకోవాలని, సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. మన కష్టంతో మనరాష్ట్రాన్ని నిర్మించుకుంటున్నామని, మన కష్టానికి తగిన గుర్తింపు వస్తోందని, ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూస్తోందని, పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని, విశాఖలో మూడవ సమ్మిట్ విజయవంతం కావడం శుభ పరిణామమన్నారు. మూడు సమ్మిట్‌లలో ఒప్పందాలన్నీ 13జిల్లాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా జరిగాయని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం ముఖ్యకార్యదర్శులు జవహర్ రెడ్డి, రాజశేఖర్, గోపాలకృష్ణ ద్వివేది, పంచాయితీ రాజ్ కమిషనర్ రామాంజనేయులు, రియల్ టైం గవర్నెన్స్ ఎండి అహ్మద్ బాబు, సెర్ఫ్ సీఈవో కృష్ణమోహన్, జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర రావు, ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ ఉదయలక్ష్మి, వివిధ జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీరస్తూ... శుభమస్తూ...



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణ రాష్ట్రం మార్చి 4వ తేదీ ఆదివారంనాడు బాజాభజంత్రీలతో మారుమోగిపోనుంది. ఆ ఒక్కరోజునే దాదాపు ఒక లక్ష పెళ్లిళ్లు ఇక్కడ ఉంటాయని అంచనా. అదే నెల 6, 11 తేదీల్లోనూ అధిక సంఖ్యలో వివాహ మూహూర్తాలు ఉన్నాయి. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని ఫంక్షన్ హాళ్లు ఎప్పుడో బుక్కయిపోయాయి. ఇప్పుడు కాకుంటే మళ్లీ ఏప్రిల్‌లో శ్రీరామనవమి తర్వాత మంచి రోజులు అందుబాటులోకి వస్తాయి. మూఢం, శూన్యమాసం వంటి నమ్మకాలు గల వారు సహజంగానే సరైన రోజుల కోసం ఎదురు చూస్తుంటారు. గత ఏడాది నవంబరు 23, 26 తేదీల తర్వాత మళ్లీ మంచి రోజులంటూ మార్చినెలలోనే వచ్చాయి. ఇంత వ్యవధి తర్వాత వస్తున్న .. మార్చి నాలుగో తేదీ చాలా బలమైన ముహూర్తమనేది పండితుల ఉవాచ. మార్చి 4, 6, 11 తేదీల్లోని అత్యధిక ముహూర్తాలు మధ్యాహ్నం 12 గంటలకు ముందువే కావటం విశేషం.

ఆ మూడు రోజులే ఎందుకంటే..

మార్చి 4వ తేదీ ముహూర్తం ఎందుకు మంచిదంటే.. ఆ రోజు హస్త నక్షత్రం. తిథి తదియ. అటువంటి లగ్నం శుభకరం. మార్చి 6న పంచమి. స్వాతి నక్షత్రం. 11న పూర్వాషాడ నక్షత్రం. మార్చిలో మరికొన్ని మంచిరోజులూ ఉన్నాయి అని కొత్తపేట డాక్టర్స్ కాలనీలోని పండితులు శ్రీనివాస్‌రావు తెలిపారు.

రేషన్‌బియ్యంపై మరింత నిఘా

- **పక్కదారి పట్టకుండా చర్యలు**
- **ప్రతి జిల్లాలోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్**
- **28న సిద్ధిపేటలో ప్రారంభం**
- **171 గోదాముల్లో 1700 సీసీ కెమెరాలు**
- **హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం**
- **పౌరసరఫరాలశాఖ కమీషనర్ సీవీ ఆనంద్**



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: రేషన్ సరుకులను తరలించే లారీలకు జీపీఎస్, వాటి కదలికలను ఎప్పటికప్పుడు ప్రత్యక్ష్యంగా పరిశీలించడానికి కమాండ్ కంట్రోల్ సెంటర్, ఈ-పాస్ విధానం ద్వారా సరుకుల పంపిణీ... ఇలా సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు కళ్లెం వేస్తున్న పౌరసరఫరాలశాఖ ఆ దిశగా మరో అడుగు ముందుకేసింది.

గత ఏడాది హైదరాబాద్ పౌరసరఫరాలభవన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ అత్యుత్తమ ఫలితాలనిస్తుండటంతో క్షేత్రస్థాయిలోనూ నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్న ఉద్దేశంతో ప్రతి జిల్లాల్లోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు పౌరసరఫరాల శాఖ శ్రీకారం చుట్టింది. 31 జిల్లాల్లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు దిశగా కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈ నెల 28వ తేదీన సిద్దిపేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను భారీనీటిపారుదలశాఖ మంత్రి టి. హరీశ్‌రావుగారు ప్రారంభించనున్నారు. అలాగే వచ్చే నెలలో నిజామాబాద్, వనపర్తి, గద్వాల్, కరీంనగర్, మరికొన్ని జిల్లాల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లు అందుబాటులోకి రానున్నాయి. పౌరసరఫరాల సంస్థకు కీలకమైన మండల స్థాయి నిల్వ కేంద్రాలపై నిఘా పెట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సంస్థకు చెందిన 171 గోదాములో 1700 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రక్రియ మరో వారం పది రోజుల్లో పూర్తికానుంది. లోడింగ్, అన్‌లోడింగ్, గోదాం ప్రధాన ద్వారం, వేబ్రిడ్జి, ప్లాట్‌ఫాం, గోదాములో ప్రతి వ్యక్తి కదలికలను గుర్తించేలా ఒక్కో గోదాం వద్ద 5 నుండి 10 కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సి.వి. ఆనంద్ తెలిపారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు గోదాముల పరిధిలో ఏం జరుగుతున్నదో, రేషన్ సరుకులు తరలించే వాహనాల కదలికలను ప్రత్యక్షంగా వీడియో వాల్‌పై వీక్షించడానికి వీలుగా ఈ కెమెరాలను ఆయా జిల్లాల్లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయాలకు అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. 31 జిల్లాలోని కమాండ్ కంట్రోల్ కేంద్రాలను హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తున్నామని, దీనివల్ల రేషన్ సరుకులు తరలించే వాహనాల కదలికలతో పాటు గోదాముల్లో బియ్యం తరలింపును పర్యవేక్షించడానికి మంచి అవకాశం ఉంటుందన్నారు. ముప్పై రోజుల పాటు వాటి రికార్డింగ్‌ను బ్యాకప్ ఉంటుంది. ఈ కెమెరాలు 247 పనిచేయడం, రాత్రిపూట చూసి రికార్డింగ్ చేసే సత్తా గల 2 మెగా పిక్సల్, ఐపి (ఇంటర్న ప్రొటోకాల్) అంటే ఎక్కడి నుండైనా వీక్షించే అవకాశం ఉంటుంది. ఆ కెమెరాలన్నీ కూడా 2 ఎంబి స్పీడ్‌తో గల ఇంటర్నెట్‌కు అనుసంధానం చేయబడతాయి. దీంతో ఆ కార్యకలాపాలు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవచ్చని కమిషనర్ తెలిపారు.

ఆర్.ఆర్.బి. అభ్యర్థులకు టీ-సాట్ చేయూత : సీఈవో శైలేష్ రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్.ఆర్.బి)భర్తీ చేస్తున్న లక్షకు పైగా ఉద్యోగాల్లో సిక్రింద్రాబాద్ సౌత్ సెంట్రల్ జోన్ కు 13,694 పోస్టులు లభించాయని టి-సాట్ సీఈవో ఆర్.శైలేష్ రెడ్డి వెల్లడించారు. ఈ ఉద్యోగాలను పొందేందుకు అధిక అవకాశాలున్న తెలంగాణ నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణ అందించాలని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.టి.రామారావు ఆదేశించారని సీఈవో తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవలే రైల్వే రికట్ మెంట్ బోర్డు లోకో పైలట్, టెక్నిషియన్స్, గ్రూప్-డి విభాగాల్లో సుమారు 1,07,082 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందని, అందులో సికింద్రాబాద్ జోన్ కు 13,694 ఉద్యోగాలున్నాయని శైలేష్ రెడ్డి తెలిపారు. ఇవే కాకుండా రిజర్వేషన్లతో సంబంధం లేకుండా ఓపెన్ కేటగిరిలో ఇతర జోన్లలో 93,388 ఉద్యోగాలు ఉన్నాయన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్ల జీతాలు పెంపు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌ల జీతాలను భారీగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత 16ఏళ్ల నుంచి చైర్మెన్ల జీతాలు పెంచలేదు. గతంలో మాజిద్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ల జీతాలు భారీగా పెంచేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ల జీతాలు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వచ్చే బడ్జెట్‌లో బీసీలకు అధిక నిధులు కేటాయించాలి

- **బీసీల సంక్షేమానికి రూ.10వేల కోట్లు**
- **రూ.20వేల కోట్లతో సబ్-ప్లాన్ ఏర్పాటు చేయాలి**

హైదరాబాద్, మేజర్‌న్యూస్: వచ్చే బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.10వేల కోట్లు, సబ్-ప్లాన్‌కు రూ.20వేల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బీసీ భవన్‌లో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది బీసీల సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయించినా.. అందులో రూ.2వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. మిగిలన బడ్జెట్‌ను వెంటనే ఖర్చు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎంబీసీలకు రూ.1000 కోట్లు, చేనేత సంక్షేమానికి రూ.1200కోట్లు, రజక, నాయీబ్రాహ్మణ ఫెడరేషన్లకు రూ.500కోట్లు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేసి, ఆయా సామాజిక వర్గాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. వచ్చే బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు, ఎంబీసీలకు రూ.2 వేల కోట్లు, గీతా కార్పొరేషన్‌కు వెయ్యికోట్లు, చేనేత రంగానికి రూ.1200కోట్లు, మిగిలన ఫెడరేషన్లకూ రూ.500కోట్ల చొప్పున నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన పారిశ్రామిక విధానంతో చేతి వృత్తులు, కులవృత్తులు అంతరించిపోయే స్థితికి చేరాయని, వాటిని ఆదుకునేందుకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలన్నారు. అందుకోసం 80శాతం సబ్సిడీ రుణాలను అందించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఏర్పాటు చేసిన విధంగా జనాభా దామాషా ప్రకారం బీసీలకు 800రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు



చేయాలని అన్నారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా శిక్షణ ఇప్పించాలని, కాలేజీ, హాస్టల్ భవనాలను నిర్మించాలని ప్రభుత్వాన్ని కృష్ణయ్య కోరారు. బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, కుంచాల ఏడుకొండలు, దేవయ్య, శ్రీధర్, సి.రాజేందర్, నర్సింహాగౌడ్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమల్లో టీఆర్ఎస్ సర్కార్ విఫలం



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో టీఆర్ఎస్ సర్కారు ఘోరంగా విఫలమైందని తెలంగాణ తెలుగుదేశం పార్టీ విమర్శించింది. సోమవారం హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో టీడీపీ మండల స్థాయి నేతల 6వ శిక్షణ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ తెలుగుదేశం అభివృద్ధి విషయంలో నేతలకు దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పల్లెపల్లెకు వెళ్లి తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలునిచ్చారు. పార్టీ ఆవిర్భవించిన 36 ఏళ్లలో ప్రభుత్వంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా తట్టుకుని నిలబడ్డ పార్టీ తెలుగుదేశమేనని ఆయన స్పష్టం చేశారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను టీఆర్ఎస్ సర్కార్ అప్పుల ఊబిలోకి నెట్టుతోందని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.68వేల కోట్లుగా ఉన్న అప్పు ప్రస్తుతానికి రూ.2లక్షల 25వేల కోట్లకు పెరిగిందని చెప్పారు. మిషన్ కాకతీయ, పునరాకృతి, మిషన్ భగీరథ వంటి వాటి పేర్లతో కమీషన్లు దండుకుంటున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో త్రాగునీటి సరఫరా కోసం 70శాతం నీటి ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం గతంలోనే పూర్తి అయి ఉన్నాయని, మిగతా పనులు పూర్తి చేసి అందరికీ త్రాగునీరు అందించడానికి రూ.5 నుంచి 6వేల కోట్లు ఖర్చు చేస్తే సరిపోతుందని, కానీ కమీషన్ల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తూ మళ్లీ పైపులైన్లు వేసుకుంటూ వెళ్తున్నారని ఆయన విమర్శించారు. గ్రామాలల్లో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధే కనబడుతుంది తప్ప..టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేసి ఎలా దోచుకున్నారో.. పునరాకృతి పేరుతో కేసీఆర్ కూడా రూ.కోట్లు దండుకుంటున్నారని రమణ విమర్శించారు. ఇటువంటి పాలనకు చరమగీతం పాడే సామర్థ్యం ఒక్క తెలుగుదేశం పార్టీకే ఉందన్నారు. శిక్షణ తరగతుల ద్వారా సమస్యలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి 2019 ఎన్నికలల్లో టీడీపీని తిరుగులేని శక్తిగా తయారు చేసుకుందామని తెలిపారు. శిక్షణ తరగతులలో పాల్గొంటున్న వారికి అభినందనలు రమణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి అరవింద్ కుమార్ గౌడ్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు బిఎన్ రెడ్డి, ఆజ్మీరా రాజునాయక్, తాజుద్దీన్, బక్కని నర్సింహులు, జి.బుచ్చిలింగం, అట్లూరి రమాదేవి, మేకల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

editpage@suryaa.com

“ ఈశాన్య ప్రాంతంలో మరి రెండు రాష్ట్రాలు- మేఘాలయ, నాగాలాండ్‌లలో మంగళవారం పోలింగ్ జరగనున్నది. ఎన్నికల కమిషన్ ఈశాన్య ప్రాంతంలో ఎన్నికలు ప్రకటించిన మూడు రాష్ట్రాలలో త్రిపురలో ఈ నెల 18న పోలింగ్ ముగిసింది. మేఘాలయ, నాగాలాండ్ మాత్రమే మిగిలాయి. మూడు రాష్ట్రాలలో రాజకీయ పోరాటం స్వభావం మారిన సమయంలో ఈ ఎన్నికలు చోటు చేసుకుంటున్నాయి. తేలికగా తీసిపారేయలేని శక్తిగా భారతీయ జనతా పార్టీ ఉత్థానానికి త్రిపురలో ఎన్నికల ప్రచారం ప్రధాన సంకేతంగా నిలిచింది. కాగా, కొత్తగా ఏర్పాటైన పార్టీలతో సహా ప్రాంతీయ పార్టీల మాటదే తక్కిన రెండు రాష్ట్రాల శాసనసభలకు నిర్వహిస్తున్న ఎన్నికలలో పైచేయి కావచ్చని భావిస్తున్నారు. నాగాలాండ్‌లో కోహిమా జిల్లాలోని ఒక నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ ముఖ్యమంత్రి నైఫియు రియో ఈ ఎన్నికలకు కొత్త రూపు తీసుకువచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) నుంచి రాజీనామా చేసిన రియో కొత్త పార్టీ నేషనలిస్ట్ డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి)లో చేరారు. వాస్తవానికి ఎన్‌డిపిపి స్థాపనకు ఆయన చేయూత ఇచ్చారు. ”

నాగాలాండ్, మేఘాలయ తీర్పు ఏ వైపు?

ఈశాన్య ప్రాంతంలో మరి రెండు రాష్ట్రాలు- మేఘాలయ, నాగాలాండ్‌లలో మంగళవారం పోలింగ్ జరగనున్నది. ఎన్నికల కమిషన్ ఈశాన్య ప్రాంతంలో ఎన్నికలు ప్రకటించిన మూడు రాష్ట్రాలలో త్రిపురలో ఈ నెల 18న పోలింగ్ ముగిసింది. మేఘాలయ, నాగాలాండ్ మాత్రమే మిగిలాయి. మూడు రాష్ట్రాలలో రాజకీయ పోరాటం స్వభావం మారిన సమయంలో ఈ ఎన్నికలు చోటు చేసుకుంటున్నాయి. తేలికగా తీసిపారేయలేని శక్తిగా భారతీయ జనతా పార్టీ ఉత్థానానికి త్రిపురలో ఎన్నికల ప్రచారం ప్రధాన సంకేతంగా నిలిచింది. కాగా, కొత్తగా ఏర్పాటైన పార్టీలతో సహా ప్రాంతీయ పార్టీల మాటదే తక్కిన రెండు రాష్ట్రాల శాసనసభలకు నిర్వహిస్తున్న ఎన్నికలలో పైచేయి కావచ్చని భావిస్తున్నారు. నాగాలాండ్‌లో కోహిమా జిల్లాలోని ఒక నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ ముఖ్యమంత్రి నైఫియు రియో ఈ ఎన్నికలకు కొత్త రూపు తీసుకువచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) నుంచి రాజీనామా చేసిన రియో కొత్త పార్టీ నేషనలిస్ట్ డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి)లో చేరారు. వాస్తవానికి ఎన్‌డిపిపి స్థాపనకు ఆయన చేయూత ఇచ్చారు. ఎన్‌డిపిపి భారతీయ జనతా పార్టీ (బిజెపి)తో ఎన్నికల పొత్తు కుదుర్చుకున్నది. రాష్ట్రంలోని 60 సీట్లలో 20 సీట్లను బిజెపికి ఎన్‌డిపిపి కేటాయించింది. ఈ దృష్ట్యా అధికార ఎన్‌పిఎఫ్‌కు ఎన్‌డిపిపి ప్రధాన ప్రత్యర్థిగా కనిపిస్తోంది. మరొక జాతీయ పార్టీ కాంగ్రెస్ రాష్ట్రంలో బాగా కుంచించుకుపోయింది. ఎన్‌పిఎఫ్ ఇంతకు ముందు అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్, ఇతర పార్టీల శాసనసభ్యులను తన వైపు తిప్పుకున్నది. ఫలితంగా శాసనసభలో ప్రతిపక్షం అనేదే లేకుండా పోయింది. ఎన్‌పిఎఫ్‌లో విభేదాల తలెత్తడానికి ముందు పరిస్థితి అది. ఆ విభేదాలు 2017 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి టిఆర్ జెలియాంగ్ రాజీనామాకు, షుర్హోజెలీ లీజీట్సు నియామకానికి దారి తీసింది. రాష్ట్రంలో మరొకసారి అలజడి రేగిన తరువాత జెలియాంగ్ 2017 జూలైలో తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రియో నిష్క్రమణతో పాటు ఈ విభేదాలు ఎన్‌పిఎఫ్‌కు, ఎన్‌డిపిపి-బిజెపి కూటమికి మధ్య ద్విముఖ పోటీలో ఎన్‌పిఎఫ్‌ను బలహీనపరిచాయి. ఈ సందర్భంగా ఆసక్తికరమైన విషయమేమంటే ఎన్‌పిఎఫ్‌తో తన సంబంధాలు ఏమాత్రం చెక్కుచెదరలేని స్పష్టం చేయడం. ఎన్నికల ఫలితాలు వెలువడేంత వరకు తన వైఖరి ఇదే రీతిలో కొనసాగుతుందని బిజెపి సూచించినట్లు అయింది. ఈ నేపథ్యంలోనాగాలాండ్‌లో పోటీ స్థాయి దిగజారిపోయిందనిపిస్తోంది. ఇది ఇలా ఉండగా, నాగాలాండ్‌లో శాసనసభ ఎన్నికలు ముందు నిర్ణయించిన ప్రకారమే జరగనుండడం ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటున్నది. శాసనసభ ఎన్నికల తేదీలను ఎన్నికల కమిషన్ వెల్లడించిన వెంటనే అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్, బిజెపి, కాంగ్రెస్‌తో సహా 11 పార్టీల ప్రతినిధులు చేసిన ఒక ప్రకటన ఎన్నికల నిర్వహణపై అనుమానాలకు తావు ఇచ్చింది. నాగా శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ముందే ఎన్నికల నిర్వహణ విషయమై కేంద్రం ముందుకు సాగిన పక్షంలో తాము ఎన్నికలలో పాల్గొనబోమన్న ప్రకటనపై ఆ పార్టీలు సంతకాలు చేశాయి. నాగాలాండ్ గిరిజన హోహోస్, పౌర సంఘాల కోర్ కమిటీ చేసిన విజ్ఞప్తిని పురస్కరించుకుని ఆ పార్టీలు అటువంటి ప్రకటన చేశాయి. ఆ తరువాత శాసనసభ ఎన్నికల నిర్వహణ ప్రజాస్వామిక అవసరమని, శాంతి చర్చలతో సంబంధం లేకుండా వాటిని పరిగణనలోకి తీసుకోవాలని అన్ని పార్టీలు గుర్తించినట్లు కనిపించింది. ఈ తేడాను గ్రహించడంతో ప్రధానంగా శాంతి ఒప్పందం గురించే కాకుండా పాలనపై వోటుగా ఈ ఎన్నికలు మారాయి. ఇక ఎన్‌పిఎఫ్ 2003 నుంచి ప్రభుత్వాన్ని నడుపుతోంది. నాగాలాండ్‌లో ప్రభుత్వ వ్యతిరేకత కానవస్తున్నదని గ్రహించిన ప్రధాని నరేంద్ర మోడీ క్రితం గురువారం రాష్ట్రంలో తన తొలి ఎన్నికల ర్యాలీలో ప్రసంగించినప్పుడు మార్పు తీసుకువస్తామని వాగ్దానం చేశారు. ఆ మార్పులో భాగంగా అవినీతిని అంతం చేస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని, ఫలితంగా వైమానిక, రైలు, రోడ్డు సంబంధాలు, విద్యుత్ సరఫరా మెరుగు అవుతాయని, మరిన్ని ఉద్యోగాలు కల్పిస్తామని మోడీ వాగ్దానం చేశారు. నాగా సమస్యకు ప్రభుత్వం రానున్న కొన్ని మాసాలలో పరిష్కారం కనుగొనగలుగుతుందని మోడీ పునరుద్ఘాటించారు. నాగా ప్రజలను గౌరవించేదిగా, వారి రాజకీయ హక్కులను మన్నించేదిగా ఆ పరిష్కారం ఉంటుందని ప్రధాని సూచించారు. సైన్యానికి, ఎన్ఎస్‌సిఎన్ (ఐ-ఎం) మధ్య కాల్పుల విరమణ ఒప్పందం 1997 నుంచి అమలులో ఉన్నప్పటికీ నాగాలాండ్‌లో అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉండడం, ఉద్యోగాల కొరత కూడా తీవ్రంగానే ఉండడం శోచనీయం.

ఇక మేఘాలయలో తీవ్రవాదుల హింసాకాండ నేపథ్యంలో పోలింగ్ జరుగుతోంది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) అభ్యర్థి జోనాథన్ సంగ్మాను తీవ్రవాదులు ఈ నెల 18న హత్య చేశారు. మరొక వైపు అధికార కాంగ్రెస్ పార్టీకి, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి)కి మధ్య పోటీ నువ్వా నేనా అనే రీతిలో ఉన్నట్లు కనిపిస్తోంది. లోక్‌సభ మాజీ స్పీకర్ పిఎ సంగ్మా స్థాపించిన ఎన్‌పిపికి ఇప్పుడు ఆయన కుమారుడు కాన్రాడ్ సంగ్మా సారథ్యం వహిస్తున్నారు. మేఘాలయలోని ఖాసీ- జయంతియా పర్వత శ్రేణులలో కేంద్రీకృతమై ఉన్న గిరిజన తెగల పార్టీల సంకీర్ణం ఆ రెండింటి అవకాశాలను ఒకింత దెబ్బ తీసే అవకాశం కనిపిస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ ప్రజాస్వామ్య కూటమికి సారథ్యం వహిస్తున్న భారతీయ జనతా పార్టీకి కూడా రాష్ట్రంలో కాస్తో కూస్తో ఉనికి ఉన్నది. అయితే, బిజెపి మణిపూర్‌లో ఎన్‌పిపితో పొత్తు పెట్టుకున్నది. చాలా కాలంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇతర పార్టీలతో కలసి ఓడించగలిగితే తదుపరి ప్రభుత్వం ఏర్పాటులో బిజెపి విస్తృత పాత్ర పోషించే అవకాశం ఉన్నది. నిరుద్యోగిత, ఆర్థిక వ్యవస్థ మందగమనం ప్రధాన సమస్యలుగా ఉన్నా రాష్ట్రంలో తిరిగి ప్రశాంత పరిస్థితులు తీసుకువచ్చిన తన రికార్డు ఆధారంగా తిరిగి అధికారంలోకి రావాలని కాంగ్రెస్ ఆశిస్తోంది. అయితే, మేఘాలయ, నాగాలాండ్ రెండు రాష్ట్రాలలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఎన్నికల అనంతరం రాజకీయ పార్టీల మధ్య ఏర్పడే పొత్తులు కొత్త ప్రభుత్వాల తీరును తెలుస్తాయి.

అసెంబ్లీకి హాజరీపై వైసీపిలో సంశయం

సత్య ఎం.వి.ఎస్
హైదరాబాద్ – 833011972

- సిఎం అయ్యేంత వరకు సభకు రానంటున్న జగన్?
- అధినేత నిర్ణయంతో శాసనసభ్యులలో అయోమయం
- ప్రజా సమస్యలపై చర్చకు తావెక్కడని ఆందోళన
- దేశంలో చేరిన వారిపై వేటేస్తేనే సభకొస్తామని భీషణలు
- అసెంబ్లీకి హాజరయ్యేందుకు కొందరు సమాయత్తం?



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తర్వలో ప్రారంభం కాబోతున్న అసెంబ్లీ సమావేశాలకు విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ హాజరుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. తాము వెళ్లడం లేదని, పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోనందుకు నిరసనగా అసెంబ్లీ సమావేశాలను శాశ్వతంగా బహిష్కరిస్తున్నామని గతంలో వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ అధినేత జగన్ తీసుకున్న నిర్ణయం తాజా సమావేశాల నాటకి మారబోతోందా? అంటే అవుననే అంటున్నాయి పార్టీ వర్గాలు. స్పీకర్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, 21 మంది ఎమ్మెల్యేలపై వేటు వేయాలని తాము చేసిన ఫిర్యాదులను నేటికీ పట్టించుకోవటం లేదని సభలో తాము ప్రశ్నలు అడిగితే.. తమ పార్టీ నుంచి గెలిచి మంత్రులుగా ఉన్నవారు సమాధానం చెప్పడం ఏంటని ఇందుకు నిరసనగానే బహిష్కరణ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించుకున్నారు. అసెంబ్లీ బహిష్కరణ విషయంలో తమకుఎన్టీఆరే ఆదర్శమని, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోని పక్షంలో అన్ని సమావేశాలను బహిష్కరిస్తామని ఆ పార్టీ నేతలు మీడియా ముఖంగా ఎప్పటికప్పుడు ప్రకటనలు గుప్పిస్తునే ఉన్నారు.

నిజానికి జగన్ పాదయాత్ర ప్రారంభించే సమయానికి ముందే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రకటించారు. అయితే అసంబ్లీ హాజరు విషయంలో జరిపిన శాసనసభ్యుల సమావేశంలో ప్రజా సమస్యలను తెలుసుకోవడం కోసం తను తలపెట్టిన పాదయాత్రకే అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, తనతో పాటుగా శాసనసబ్యులంతా పదం కదపాలంటూ అధినేత ఆదేశాలు జారీ చేసారు. ఇందుకు కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చి చేరిన మరి కొంత మంది సీనియర్లుకూడా సైకొట్టడంతో ఆ పార్టీ ప్రజాప్రతినిధులలు తలూపాల్సిన పరిస్థితి వచ్చిందన్నదన్ని ఆంతరంగిక వర్గాల కథనం. శాసనసభలో తమ ప్రాంత అభివృద్ధి, వెనుకబాటు తనంపై ప్రశ్నించి, ప్రభుత్వం నుంచి తగిన సమాధానంతో పాటు నిధులను రాబట్టుకోవాలన్న అభిప్రాయపడటంతో ఉన్న చాలా మంది శాసనసబ్యుల ఆశలపై శాసనసబను బహిష్కరించాలని తీసుకున్న నిర్ణయం నీళ్లు చిలకరించిందన్నది సుస్పష్టం.

వైఎస్సార్సీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో నలుగురు మంత్రి పదవులు చేపట్టిన వారి పేర్లు అసెంబ్లీ రిజిస్టర్‌లలో చూపుతున్నారన్నది వైసీపీ పెద్ద అభ్యంతరం, అలాగే ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలను ఏకపక్షంగా నిర్వహిస్తోందని, సభలో ప్రతిపక్ష నేతను తిట్టే కార్యక్రమాన్నే నిర్వహిస్తున్నారని.. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఐదేళ్లలో 156 రోజులు అసెంబ్లీ సమావేశాలు జరిగితే.. గత నాలుగేళ్లలో చంద్రబాబు కేవలం 80 రోజులు సభ నడిపారని ఎద్దేవా. ఫిరాయింపు ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్‌ను అడ్డుపెట్టుకొంటున్నారని ఆరోఎణ.నిజమే! వైఎస్ హయాంలోనూ విపక్షం మీద రంకెలేయటం సర్వ సాధారణంగా మారిపోయింది. చివరకి తల్లికడుపులో ఎందుకు పుట్టానా? నువ్వ నుకోవాలి. అనేంత వరకు సభలో దూషణ భూషణల కొనసాగింపులకు పరాకాష్ట అనే చెప్పాలి. విపక్షం నుంచి అధికార పక్షంలోనికి శాసనసభ్యులను, పార్లమెంటు సభ్యులను తీసుకువచ్చిన ఘనత నాటి ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్‌ది కీలక పాత్ర అనటంలో సందేహం లేదు. తెలంగాణ రాష్ట్ర సమితిని చీల్చినా, ఆ పార్టీ సభ్యులపై వేటు వేయాలని చేసిన ఫిర్యాదులను నాటి స్పీకర్లు కిరణ్ కుమార్ రెడ్డితో సహా అందరిపైనా వత్తిడి తెచ్చి నిలుపుదల చేయించినా దాని వెనక ఉన్న హస్తం ఎవరిదన్నది ఇప్పుడు జగన్ పార్టీలో ఉన్నతులుగా చెలా మని అవుతున్న నేతలకు, మాజీ మంత్రులకు తెలియదనుకోవటం పొరపా టన్నది నిజం.

ఇప్పటికే ఈ విషయంలో రాష్ట్రపతి మొదలుకుని ప్రధానమంత్రి, గవర్నర్లను కలిసి చంద్రబాబు నాయుడు అప్రజాస్వామిక విధానాలపై ఫిర్యాదు చేసింది ఆ పార్టీ. అయితే శాసనసభ్యుల వ్యవహారంలో తుది నిర్ణయం స్పీకర్‌దే అన్న అభిప్రాయంతోనే నేటి వరకు ఇద్దరు రాష్ట్రపతులు మారినా, ప్రధాని, గవర్నర్లు ఎందుకు చర్యలు తీసుకులేకపోతున్నారన్నది ఆ పార్టీ అధినేత గమనించాలి.

వాస్తవానికి కాల్ మనీ సెక్స్ రాకెట్ అంశానికి సంబంధించి 344 కింద వాయిదా తీర్మానానికి నోటీసు ఇచ్చి చర్చించాలని చూసినా, ప్రభుత్వం చేస్తున్న అరాక విధానాలను ఎలుగెత్తి చాటాలనుకున్నా విపక్షాలకు శాసనసబ చక్కని వేదిక అనటంలో సందేహం లేదు. ప్రజల ఇబ్బందులను, సమస్యలను ప్రధానంగా ప్రభుత్వ దృష్టికి తీసుకురావటానికి యత్నించడం, ప్రభుత్వ స్పందనలను ఎండగట్టడం, చర్యలు లేకపోతే పత్రికా ముఖంగా కూడా నిలదీయటం అవసరమైన పక్షంలో సభ సంప్రదాయాలకు అనుగునంగా వ్యవహరించి తమ నిరసనలు జనం దృష్టికి తీసుకవచ్చేలా చూడాల్సిన బాధ్యత విపక్షానిది.

గతాన్ని ఓ సారి పరిశీలిస్తే, విపక్ష పార్టీల అధినేతలు (ఎన్టీఆర్, జయలలిత) అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన సందర్భాలు ఉమ్మడి ఆంధ్రాలో, తమిళనాడులో జరిగాయి. కాని అధినేతతో సహా మొత్తంమంది ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా అసెంబ్లీ సమావేశాలకు హాజ రుకాకపోవడం సంచలనమే. కానీ వైసీపీ నేతలు భావిస్తున్న పాదయాత్రకు ప్రజల్లో సానుకూలత వచ్చిందని అనుకున్నా, పదే పదే అసెంబ్లీ సమావేశాల బహిష్కరణ నిర్ణయంపై ప్రజలు వ్యతిరేకంగా స్పందించే ప్రమాదముందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.అయితే శీతాకాల అసెంబ్లీ సమావేశాలను ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ ఫిరాయింపులకు నిరసనగా సభను బహిష్కరిస్తున్నాం అని ప్రకటించు కున్న అనంతరం ప్రభుత్వానికి వచ్చే నష్టమే కనిపించలేదు. దీంతో తన 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రధాన ప్రతిపక్షం ఇంత బాధ్యతా రహితంగా వ్యవహరించడం తాను ఎప్పుడూ చూడలేదని.. విపక్షమే లేని అసెంబ్లీని చూడ టం ఇదే మొదటిసారని పేర్కొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్ష బాధ్యతను తమే తీసుకొని ప్రజల పక్షాన నిలుస్తామని పేర్కొన్నారు.అధికార విపక్షాల రెండు పాత్రలనీ టిడిపి, బిజెపి సభ్యులే పోషించి, చివరకి వాళ్లకు కావాల్సిన బిల్లులు ఆమోదించేసుకుని వెళ్లిపోయారు. దీంతో సభలో జనం సమస్యలపై ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం దూరంగా ఉండిపోవడంతో విమర్శల పాలయ్యింది. అసెంబ్లీ సమావేశాలలో అధికాపక్షాన్ని నిలదీసి, నిగ్గుదేల్చాల్సి ఉండగా ఎదురొ నే దమ్ములేక ప్రతిపక్షం పలాయనవాదం అందుకుందని అపప్రదని మూట గట్టుకుంది. అసెంబ్లీ సమావేశాలకు బహిష్కరించడమంటే సభను అవమానిం చడమేనని.. వైసీపీ తీరు ప్రజా సమస్యలను పరిష్కరించే పవిత్ర వేదికైన అసెం బ్లీని కించపరిచడమేనన్న టిడిపి వాదనకు బలం చేకూరేలా... సమావేశా లు బహిష్కరించి పాదయాత్రలో ఉన్నప్పుడే మరో ఇద్దరు ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకోవటం గమనార్హం. అంటే అంతిమంగా ఈ నిర్ణయం వల్ల నష్టం వైసీపీకే జరిగిందన్నది తేలుతోంది.

మరోవైపు గమనిస్తే... జగన్ పాదయాత్ర నిర్ణయం, అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయం రెండూ పథకం ప్రకారం వేసిన ఎత్తుగడలేనని నవంబర్‌లో అసెంబ్లీ శీతాకాల సమావేశాలపై సిబిఐ కోర్టులో కేసుల పెండింగ్ గురించి ముందే తెలుసు.. తెలిసి కూడా ఈ రెండింటినీ ఎగ్గొట్టేందుకే జగన్మోహనరెడ్డి ఈ ఎత్తుగడ వేశారన్న తెలుగుదేశం వాదనకు తగ్గట్టే అసెంబ్లీ సమావేశాలను ఎగ్గొట్టేందుకు నిర్ణయించి, పాదయాత్ర కోసం కోర్టు హాజరి మినహాయింపులు కోరుతూ న్యాయమూర్తులను అభ్యర్థించారు. కానీ ఫలితం దక్కక ప్రతి శుక్రవారం పాదయాత్రకి కామా పెట్టి హైదరాబాద్ రావాల్సి వస్తోంది.

అయితే ఇప్పటికి జగన్ కు అసెంబ్లీకు వెళ్ళే ఉద్దేశం కనిపించడంలేదని అనిపిస్తోంది. ఇదే అంశంపై కనిగిరిలో ఆయన పాదయాత్రలో ఉన్నప్పుడు పాత్రికేయులతో మాట్లాడుతూ అసెంబ్లీకి వెళ్లాలంటే మనసు రావడం లేదని చట్టసభలు చేసిన చట్టాలు చంద్రబాబు పాలనలో అమలు కావడం లేదని ఆరోపించారు. చట్టాలను అవహేళన చేస్తున్న పరిస్థితి ప్రస్తుతం ఉందనీ, కొనుగోలు చేసిన ఎమ్మెల్యేలకి పదవులు ఇవ్వడం గతంలో ఎక్కడా చూడలేదని. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి, ఎన్నికలకు వెళ్లే ధైర్యం అధికార పార్టీకి లేదన్నారు. దీనిబట్టి జగన్ తన పాత పాటే పాడుతున్నట్టుగా కనిపిస్తుంది. ఆయనకు అసెంబ్లీకి వెళ్లే ఉద్దేశమే లేన్నట్టు ఉంది.

నిజానికి ఆయనకు నెల రోజులు పాదయాత్రకు బ్రేక్ ఇస్తే పాదయాత్ర ఎఫెక్ట్ పోతుందని, అదే సమయంలో పార్టీని సభలో లీడ్ చేసే అవకాశం వేరేవారికి ఇవ్వడానికి ఆతనికి ఇష్టం లేదని కాబట్టే సభకు వెళ్లడం లేదని సొంత పార్టీ వారే అంటున్నారు. అయితే విపక్షనేత జగన్‌కు తన పక్ష నేతలపైనా నమ్మకం ఉన్నట్లు కనిపిం చదు. అందుకే ఆయన ప్రతి సభలోనూ ఎప్పుడూ నాయకుల్ని నమ్ముకోలేదని, ప్రజలు..దేవుడ్ని మాత్రమే నమ్ముకొన్నానని చెప్పుకోవటం మనకి వినిపిస్తుంది. ఒకవేళ సమావేశాలలో పాల్గొనేందుకు ఎవరకైనా అవకాశం ఇస్తే, వారి బాగా వ్యవహరించినా, ప్రభుత్వానికి సహకరించి సమా వేశాలు జరిగి, చర్చలతో రక్తి కట్టినా తనను వారు మించిపోతారన్న అభద్రతా భావం లోనే ఎవరికీ అవకాశం ఇవ్వటం లేదన్నది మరోవాదన. అయితే తాజా అసెంబ్లీ సమావేశాలలో పార్టీ ఆదేశాలను ధిక్కరించి హాజరు కావాలన్న భావన వైసిపి సభ్యులలో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. అయితే పాదయాత్ర పూర్తయ్యి, ఎన్నికలు జరిగాక తను ఏకంగా సీఎం సీట్లో కూర్చొన్నాకనే సభలో అడుగు పెట్టాలని జగన్ అనుకుంటున్నారని చెబుతున్నారు. ఈ నిర్ణయం నియోజక వర్గాలలో తమ కొంప ముంచేదిలా ఉందన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. మరి త్వరలో ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలపై ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

మళ్లీ ఏపిని ముక్కలు చేసే పనిలో కమలనాథులు?



ఎమ్.కృష్ణమూర్తి, ఏపి స్టేట్ బ్యూరో

- సీమ సెంటిమెంట్ వాడుకునేందుకు ప్రయత్నం
- వెనుకబాటుకు చంద్రబాబు కారణమని ఆరోపణలు
- అవసరమైతే ప్రత్యేక రాష్ట్రం చేయిస్తామంటున్న నేతలు
- తక్షణమే 20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్‌లు
- మరో విభజన నినాదంతో బెంబేలెత్తుతున్న ప్రజలు



రాయలసీమ విషయం సెంటిమెంటు బీజేపీ నేతలు తెరపైకి తేవడంతో ఏపీ రాజకియాల్లో ప్రకంపనలు మొదలవుతున్నాయి. కేంద్రం ఏమీ చేయలేదు అని టీడీపీ కేంద్రంపై దాడి పెంచడంతో కమలం నేతలు సైతం కౌంటర్ మొదపెట్టారు. రాయలసీమ సెంటిమెంటుతో ఆయా ప్రాంతాలలో సైకిల్‌ను ఇరకాటంలోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ముళ్లను ముళ్లతోనే తీయాలన్న సామెతను బీజేపీ నాయకత్వం అనుసరిస్తున్నట్లు సమాచారం. వాస్తవాన్ని ఓ సారి పరిశీలిస్తే, రాష్ట్రవిభజన జరిగిన వెంటనే రాష్ట్ర రాజధాని కర్నూలులో ఏర్పాటు చేయాలని, మద్రాసు నుంచి ఆంధ్రా రాష్ట్రం వేరుపడ్డాక కర్నూలులోనే రాజధాని ఉండేదని నాడు ఉద్యమాలు సాగాయి. తెలంగాణ, ఆంధ్రా కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు అయ్యాక రాజధానిని కర్నూలు నుంచి హైదరాబాదుకు మారింది. అప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని హైదరా బాద్ అయింది. మళ్లీ తెలంగాణ ఉద్యమం రావడంతో ప్రత్యేక తెలంగాణ కావా లని డిమాండ్ రావడంతో ఆంధ్రప్రదేశ్‌నే ముక్కలు అయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఏర్పాటు అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాజధానిని రాయల సీమలో పాత తరహాలో పెట్టాలని డిమాండ్ వచ్చింది. కాని రాజధానిని రాయల సీమలో కాకుండా అమరావతిలో ఏర్పాటు చేశారు.

ఈనేపథ్యంలో కనీసం రాష్ట్ర హైకోర్టును రాయల సీమ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని న్యాయవాదు లు దీక్షలు చేయడం మొదలు పెట్టారు. దానికి తోడు సీమ బీజేపీ రాజకీయ నాయకులు తీర్మానాలు చేశారు. అయితే తాజా పరిణామాల క్రమంలో తెలుగుదేశం పార్టీ నుంచి దూరం కావాలని చూస్తున్న బిజెపి రాయలసీమకు భారీ నిధులు కేటాయించాలని లేదంటే తమ కేంద్ర అధిష్టానానికి చెప్పి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు జరిగేలా చూస్తామంటూ బెదిరింపులకు గురిచేయడంతో సీమ లోని రాజకీయం వేడిక్కింది. ప్రత్యేక రాష్ట్ర నినాదాన్ని బిజెపి తీసుకు వస్తున్నా, చాలా మంది మాత్రం రాయలసీమ అభివృద్ధి విషయంలో సీమ రాజకీయ నాయకులు కలిసి కట్టుగా సీమకు న్యాయం జరిగేలా పోరాటం చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

మరోవైపు బిజెపి స్థానిక నేతలతో సహా అంతా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విమర్శల పరంపరని పెంచారు. రాయలసీమ బిడ్డ అని గొప్పలు చెప్పుకుంటున్నాడేకాని, గతంలో ముఖ్యమంత్రిగా 9సంవత్సరాలు ఉండి రాయలసీమకు ఏంచేశాడు? అని రాయల సీమ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రతి సారి రాయల సీమకు అన్యాయం జరుగుతునే ఉందని విద్యార్థి లోకం వాపోతున్నారు.

కానీ అందరి అంచనాలను భిన్నంగా అమరావతిలో చంద్రబాబు రాజధానికి శ్రీకారం చుట్టారు. తాజాగా హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేయాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ ఉద్యమం కూడా టీడీపీ సర్కార్‌కు సవాల్‌గా మారింది. ఈ తరుణంలో రాయలసీమ అభివృద్ధి, ఇతరత్రా సమస్యలను తీసుకొని బీజేపీ ఓ తీర్మానాన్ని ఆమోదిస్తూ టీడీపీ సర్కార్‌పై విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. అయితే అనివార్యంగా బీజేపీ నేతల డిమాండ్‌ను కొందరు టీడీపీ నేతలు సమర్థించాల్సి వస్తోంది. గతంలో టీడీపీ నేతలు కూడా ఇలాంటి డిమాండ్లనే నాడు చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ నేతల తీర్మానాన్ని అనివార్యంగా సీమ టీడీపీ నేతలు సమర్థిం చాల్సి వస్తోంది.

ఆంధ్రప్రదేశ్ కు తాము చేసిన అన్యాయం నుండి ప్రజల దృష్టి మరల్చడానికి బీజేపీ కొత్త ఎత్తులు వేస్తుంది. దీనిలో భాగంగా రాష్ట్రంలో ప్రాంతీయ బేధాలు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుంది ఆ పార్టీ. నిన్న ఉన్న ఫలంగా రాయలసీమ డిక్లరేషన్ అని ఒకటి విడుదల చేసి అక్కడ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసింది. రాయలసీమలో రెండో రాజధాని, హైకోర్టు ఏర్పాటు చేయడంతో పాటు నాలుగు జిల్లాలను ఎనిమిదికి పెంచాలని ఈ డిక్లరేషన్లో సూచించారు. అలాగే రాయలసీమ అభివృద్ధి బోర్డును పునరుద్ధరించి రాజ్యాంగబద్ధత కల్పించడంతో పాటుగా రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరారు. రాయలసీమలో ఆరునెలలకు ఒకసారి అసెంబ్లీ సమావేశాలు నడపాలని కూడా కోరారు. వచ్చే బడ్జెట్లో రాయలసీమకు రూ.20వేల కోట్లు కేటాయించాలని పేర్కొన్నారు.

అసలు అమరావతి నిర్మాణానికే నిధులు ఇవ్వని బీజేపీ రెండో రాజధాని డిమాండ్ చెయ్యడం హాస్యాస్పదంగా కనిపిస్తోంది రెండో రాజధానికి కేంద్రం నుండి నిధులు తెస్తారా రాష్ట్ర బీజేపీ నేతలు అని ఎవరైనా ప్రశ్నిస్తే, సమాధానం ఇచ్చేందుకు కూడా ఆ నేతలు సిద్ధంగా లేరని, విమర్శలు చేయాలు కనుక చేస్తున్న విమర్శలా ఉందన్న వాదన ఉంది. ఇక ఆరు నెలలకు ఒకసారి సీమలో అసెంబ్లీ సమావేశాలు పెట్టాలన్నదీ వారి డిమాండ్ ఒక వేళ ఇలా నడిపితే ఆ ప్రాంతానికి ఏమి దక్కుతుందో వారికే తెలియాలి. మరి అదే విధంగా దక్షిణ భారత దేశంలో 6 నెలల పాటు పార్లమెంట్ సమావేశాలు జరపొచ్చు కదా. నిర్లక్షానికి గురవుతున్నాం అన్న భావన దక్షిణాది ప్రజలలో కూడా ఉందిగా ఆంటే ముందు ఇది జరగనీయండి తదుపరి మేం చూస్తాం అని ప్రశ్నించే వారిపై ఎదురుదాడి చేయటం ఆ పార్టీ నేతలకు సర్వసాధారణం అయిపోయింది. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం ప్రతిపాదించే బడ్జెట్‌లో రాయలసీమకు ప్రత్యేక అవసరాల నిమిత్తం 20వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేసారు సరే. అసలు రాయలసీమకు ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలని విభజన చట్టంలో ఉన్నా దేశంలోని అన్ని వెనుకబడిన జిల్లాలతో సమానంగా ఏడాది కేవలం ఒక్కో జిల్లాకు 50 కోట్లు మాత్రమే ఇచ్చిన ఘనత మీదే కదా? రెండూ వేర్వేరని అంటారు 50 కోట్లతోనే అభివృద్ధి అయిపోతాది అంటే ఇంక ఏ మొహం పెట్టుకుని 20000 కోట్లు డిమాండ్ చేస్తారు. ఆంధ్రప్రదేశ్ ను మరోసారి విభజిస్తాం అని బెదిరిస్తున్నారా? ఇటువంటి చీప్ రాజకీయం వారిని ప్రజలకు దగ్గర చేస్తుంది అనుకుంటే అది వారి అపోహే!

(తరువాయి రేపు)

చరిత్రలో ఈరోజు

ఫిబ్రవరి 27

జననాలు
1932: వేగె నాగేశ్వరరావు, సుప్రసిద్ధ కవి
1943: బి.ఎస్.యడ్యూరప్ప, కర్ణాటక ముఖ్యమంత్రి.
1972: శివాజీ రాజా, ప్రముఖ తెలుగు నటుడు.
మరణాలు
1712: మొదటి బహదూర్‌షా, మొఘల్ చక్రవర్తి.
1931: చంద్రశేఖర్ ఆజాద్, భారత స్వాతంత్ర్యోద్యమ నాయకుడు.
1956: జి.వి.మావలాంకర్, లోక్‌సభ మొదటి అధ్యక్షుడు.
1985: ఆకురాతి చలమయ్య, ప్రముఖ తెలుగు రచయిత.
2017: పి.శివశంకర్ తెలంగాణ రాష్ట్ర రాజకీయ నాయకుడు

వేగె నాగేశ్వర రావు

వేగె నాగేశ్వరరావ్ (ఫిబ్రవరి 27, 1932 – 1997) సుప్రసిద్ధ కవి, ఆర్థిక, వైద్య శాస్త్ర నిపుణులు, బహుభాషావేత్త. వీరు కృష్ణా జిల్లా గన్నవరం తాలూకా పెద అవుటుపల్లి గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య పూర్తిచేసి గన్నవరం హైస్కూలులో చదివారు. ఇటలీలోని పాదువా యూనివర్సిటీలో మెడిసిన్ అండ్ సర్జరీలో ఎం.డి. చేశారు. వీరు విదేశాలలో మంచి కవిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. బహుభాషా వైదుష్యంతో ఇంగ్లీషు, ఇటాలియన్ భాషలలో చదువరుల హృదయాలకు హత్తుకునే ఎన్నో చక్కని కవితాకళాఖండాలను సృష్టించారు. వీరి రచనలు న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ పత్రికలో ప్రచురితమై యూరోపియన్ పాఠకులకు పరిచయమయ్యారు. వీరి 'పీస్ అండ్ లవ్' అనే ఆంగ్ల పద్యాల పుస్తకానికి బెర్ట్రాండ్ రస్సెల్ ముందు మాటగా కవితల్ని ప్రశంశించాడు.

చంద్రశేఖర్ ఆజాద్



చంద్రశేఖర్ ఆజాద్ (జూలై 23, 1906 ఫిబ్రవరి 27, 1931) భారతీయ ఉద్యమకారుడు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్‌కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లాఖాన్‌ల సహచరుడు. 1931 ఫిబ్రవరి 27 ఉదయం సుఖదేవ్ రాజ్‌తో ఒక ముఖ్య విషయం మాట్లా డుతూ ఆల్‌ఫ్రెడ్ పార్క్‌లో ఓ చెట్టుకింద అజాద్ కూర్చుని ఉన్నాడన్న సంగతి డబ్బుకు గడ్డితిన్న ఓ యువకుడు ఉప్పందించాడు. పోలీసులు ఆల్‌ఫ్రెడ్ పార్క్‌కు చేరారు. పోలీసులు గుళ్ల వర్షం కురిపిస్తుండగా అజాద్ తన రివాల్వర్‌తో శత్రువులను చెండాడుతూ పోరాటం సాగిస్తున్నాడు. చివరకు రివాల్వర్‌లో ఒక గుండు మాత్రమే మిగిలింది. సుఖదేవ్‌రాజ్ సురక్షితంగా అక్కడనుంచి తప్పించుకు పోయేందుకు సహకరించాడు. నా చావు నా చేతుల్లోనే ఉంది, శత్రువుల చేతుల్లో చావను అంటూ చిన్ననాడు చేసిన శపథం నిజంచేస్తూ పిస్తోలు తన కణతకు గురిపెట్టి పేల్చుకున్నాడు.

బహదూర్ షా



బహదూర్ షా (జననం బుర్హన్‌పూర్ వద్ద అక్టోబర్ 14, 1643- మరణం లాహోర్ వద్ద ఫిబ్రవరి 27, 1712) ముఘల్ చక్రవర్తులలో ఒకరు. భారత ఉపఖండాన్ని పాలించిన మొఘల్ చక్రవర్తులలో ఆయన 7వ చక్రవర్తి. ఆయన మొఘల్ సామ్రాజ్యాన్ని 1707-1712 వరకు పాలించాడు. ఆయన అసలు పేరు కుతుబ్ ఉద్-దీన్ ముహమ్మద్ మూ'ఆజం తరువాత ఆయన తండ్రి షా ఆలం బిరుదు ఇచ్చాడు. 1707లో ఆయన సింహాసం అధిష్టించిన తరువాత బహదూర్ షా బిరుదును స్వీకరించాడు.

టర్కీ మంగోలు భాషలో బహదూర్ అంటే సాహసవంతుడు అని అర్థం. ఆయన 5 సంవత్సరాల కాలం మొఘల్ సామ్రాజ్యాన్ని పాలించాడు. ఆయన 63 సంవత్సరాల వయసులో సింహాసనాన్ని అధిష్టించాడు. ఆయన మరాఠీ మరియు రాజవుతల మధ్య సయోధ్య కుదిరించాడు. ఆయన సిక్కులతో మైత్రీబంధాలను కలిగి ఉన్నాడు. ఆయన తన రాజ్యమంతా ప్రయాణించి చివరిగా లాహోర్‌లో కొన్ని మాసాల కాలం విశ్రాంతి తీసుకున్నాడు.



మార్చి 15న బ్యాంకు ఉద్యోగుల సమ్మె లేదు

న్యూఢిల్లీ : మార్చి 15న ప్రకటించిన ఉద్యోగుల సమ్మెను పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు ద యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్స్ (యుఎఫ్‌బిఇయు) తెలియజేసింది. ప్రస్తుత గందరగోళ పరిస్థితుల్లో సమ్మె నిర్వహించడం భావ్యం కాదని నిశ్చయించుకొన్నట్లు ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి వెంకటాచలం తెలిపారు. ఆదివారం యూనియన్ నాయకులు నిర్వహించిన సమీక్షలో చర్చించిన అంశాలను ఆయన వివరించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం పట్ల యూనియన్ సభ్యులంతా తీవ్ర విచారం వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరూ ఊహించని రీతిలో జరిగిన ఇటువంటి మోసాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బ్యాంకు లావాదేవీలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టే బదులు నేరానికి కారకులుగా భావిస్తున్న వ్యక్తులపై మాత్రమే దృష్టి సారిస్తే బాగుంటుందని వెంకటాచలం సూచించారు. బ్యాంకుల పని తీరును పర్యవేక్షించే సంస్థలు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించాయని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో సంబంధిత బ్యాంక్ ఉన్నతాధికారుల పాత్రను కూడా బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బ్యాంకులను ఒక కంట కనిపెడుతూ ఉండవలసిన రిజర్వ్ బ్యాంక్‌లో కొందరు వ్యక్తులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని వెంకటాచలం ఆరోపించారు.

ఎగవేతదారునికే అప్పు

- ముునిగిన ఓరియంటల్ బ్యాంక్
- పంజాబ్ సిఎం అల్లుడిపై సిబిఐ కేసు

న్యూఢిల్లీ : దేశాన్ని కుదిపివేస్తున్న నీరవ్ మోడీ మోసం మరువక ముందే మన బ్యాంకులు చేస్తున్న తప్పులు మరొక సారి బయటపడ్డాయి. ఒక అవసరం కోసం తీసుకున్న అప్పును ఇతర పనులకు మళ్లించి బ్యాంకుకు చెల్లించకుండా ఎగవేసిన వారికే మళ్లీ అప్పును బ్యాంకులు మంజూరు చేశాయి. దీనితో సదరు ఎగవేతదారుడు ఆ రుణాన్ని కూడా ఎగవేశాడు. పర్యవసానంగా ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఒబిసి)కి రూ. 109 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. సింభోలి షుగర్స్ లిమిటెడ్ చేసిన ఈ స్కామ్‌లోని పాత్రధారుల జాబితాలో పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ అల్లుడు గురుపాల్ సింగ్ కూడా ఉన్నాడు. దీనితో సిబిఐ నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఆదివారం ఈ కంపెనీ డైరెక్టర్ల ఇళ్లలో సోదాలు నిర్వహించింది. ఈ విషయాన్ని సిబిఐ అధికార ప్రతినిధి అభిషేక్ దయాల్ తెలిపారు. గురుపాల్ సింగ్ షుగర్స్ సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్. కెప్టెన్ అమరీందర్ సింగ్ కుమార్తె జై ఇందర్ కౌర్‌ను గురుపాల్ సింగ్ వివాహం చేసుకున్నారు. ఆయన ఎనిమిది కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నారు.

మోసం జరిగింది ఇలా

దేశంలోని అతిపెద్ద షుగర్ కంపెనీల్లో పంజాబ్‌కు చెందిన సింభోలి షుగర్స్ లిమిటెడ్ కూడా ఒకటి. దీనికి గుర్మిత్ సింగ్ మాన్ ఛైర్మన్. 2011లో ఈ కంపెనీ చెరకు రైతులకు ఫైనాన్స్ చేసేందుకు ఒబిసి వద్ద రూ. 148.60 కోట్లను రుణంగా తీసుకుంది. కానీ సంస్థ ఈ మొత్తాన్ని రైతులకు అందజేయకుండా ఇతర అవసరాలకు వాడుకున్నది. సంస్థ కొంత భాగం మాత్రమే రైతులకు అందజేసింది. ఈ రుణంలో రూ. 97.85 కోట్లు మొండిబకాయిగా మారింది. 2015 మార్చిలో దీనిని మోసంగా బ్యాంక్ ప్రకటించింది. బ్యాంక్ అదే ఏడాది మేలో దీనిని మొండి బకాయిల జాబితాలో చేర్చింది.

అప్పు తీర్చేందుకు మళ్లీ అప్పు

ఎన్‌పిఎలను తగ్గించుకోవాలని బ్యాంక్ భావించింది. దీనితో పాత మొండి బకాయి రూ. 97.85 కోట్లను తీర్చేందుకు సింభోలి షుగర్స్‌కు 2015 జనవరి 28న అదనంగా రూ. 110 కోట్లను కార్పొరేట్ రుణంగా అందజేసింది. దీనిని పుస్తక సర్దుబాటు చేసి మొత్తం రుణం రూ. 112.94 కోట్లుగా తేల్చింది. కానీ కొత్త రుణాన్ని కూడా సింభోలీ షుగర్స్ ఎగవేసింది. పెద్ద నోట్ల చలామణీని రద్దు చేసిన 20 రోజుల తరువాత 2016 నవంబర్ 29న ఈ రుణాన్ని కూడా ఒబిసి ఎన్‌పిఎగా ప్రకటించింది. దీనిపై ఒబిసి గత ఏడాది నవంబర్ 17న సిబిఐని



ఆశ్రయించింది. దీనిపై నేరపూరిత కుట్ర, మోసాల నిరోధక చట్టం కింద ఈ నెల 22న సిబిఐ కేసు నమోదు చేసింది.

నిందితులు వీరే

కంపెనీ ఛైర్మన్ గుర్మిత్ సింగ్ మాన్, డిప్యూటీ ఎండి గురుపాల్ సింగ్, కంపెనీ సిఇఒ జిఎస్‌సి రావ్, సిఎఫ్ఒ సంజేయ్ టఫారియా, ఎగ్జిక్యూటివ్ గురుసిమ్రన్ కౌర్ మాన్, మరి ఐదుగురు నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లపై సిబిఐ కేసు నమోదు చేసింది.

భారీగా పతనమైన ఒబిసి షేరు

సింభోలీ స్కామ్ బయటపడడంతో ఒబిసి షేర్ స్టాక్ మార్కెట్లలో భారీగా పతనమైంది. సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో 10 గంటల సమయంలో షేరు విలువ 9 శాతం కోల్పోయింది. మరొక పక్క సింభోలీ షుగర్స్ షేర్ ఏకంగా 20 శాతం విలువ కోల్పోయింది.



వృద్ధి రేటు పెరిగే అవకాశం



న్యూఢిల్లీ : పారిశ్రామిక సేవల రంగంలో జరిగిన అభివృద్ధితో డిసెంబర్‌తో ముగిసిన 2017-18 సంవత్సరం మూడవ త్రైమాసిక వ్యవధిలో స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) 7 శాతానికి చేరుకోవచ్చని అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జిడిపి వృద్ధి రేటు 5.7 శాతం నమోదు కాగా, సెప్టెంబర్‌తో ముగిసిన రెండవ త్రైమాసికంలో 6.3 శాతానికి పెరిగింది. వ్యవసాయ రంగంలో ప్రస్తుతం ప్రతికూల పరిణామాలు కొనసాగుతున్నా డిసెంబర్‌తో ముగిసే త్రైమాసికంలో జిడిపి 7 శాతానికి చేరుకోవచ్చని తెలిపింది. కార్పొరేట్ ఆదాయాలు కూడా పెరగగలవని అంచనా వేసిన మోర్గాన్ స్టాన్లీ ఎగుమతుల వృద్ధి రేటు రెండు అంకెలను చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆటోమొబైల్, ద్విచక్ర వాహనాల అమ్మకాలు పెరుగుతాయని సూచించింది.

ఇంట్లో బొమ్మ ఆడాలంటే భారీగా వ్యయం చేయాల్సిందే




న్యూఢిల్లీ : టెలివిజన్ (టివి) సెట్ కొనుగోలు చేయాలనుకుంటున్నారా? అయితే, ఆలస్యం చేస్తే మీ జేబు నుంచి మరికాస్త అదనంగా విదిలించక తప్పదు. ఎందుకంటే టివిల ధరలు పెరగబోతున్నాయి. బడ్జెట్‌లో కస్టమ్స్ సుంకం పెంచడమే దీనికి కారణం. ప్యానెళ్లపై సుంకం 7.5 శాతం ఉండగా, దానిని 15 శాతానికి పెంచారు. అలాగే విడిభాగాలపై 10 శాతం సుంకం ఉండగా దాన్ని సైతం 15 శాతం చేస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన విషయం గుర్తుండే ఉంటుంది. దీనితో సోనీ, శామ్‌సంగ్, ఎల్జీ, పానాసోనిక్ తదితర కంపెనీలు టివిల ధరలను 7 శాతం వరకు పెంచాలనుకుంటున్నాయి. అయితే, కచ్చితంగా ఎంత పెంచాలన్న స్పష్టతకు ఇంకా రాలేదు. కస్టమ్స్ సుంకం పెంపు భారం ఎంత పడుతుందో అంచనా వేసి ఆ మేరకు దానిని వినియోగదారులకు బదలీ చేయాలని ఆ సంస్థలు అనుకుంటున్నాయి. కస్టమ్స్ సుంకం ప్రభావం అంచనా వేసిన తరువాత ధరలు ఎంత పెంచాలన్నది నిర్ణయిస్తామని సోనీ ప్రకటించింది.

గెలాక్సీ 9, గెలాక్సీ 9 ప్లస్‌లను లాంచ్ చేసిన శామ్‌సంగ్


- బార్సిలోనాలో జరుగుతున్న ఎండబ్ల్యూసి 2018 ప్రదర్శనలో లాంచ్
- 2 నుంచి ప్రి ఆర్డర్స్, 16 నుంచి విక్రయానికి అందుబాటు
- మిడ్నైట్ బ్లాక్, టైటానియం గ్రే, కోరల్ బ్లూ, పర్పుల్ రంగులలో లభ్యం

బార్సిలోనా : శామ్‌సంగ్ కంపెనీ తన నూతన స్మార్ట్ ఫోన్ గెలాక్సీ 9, గెలాక్సీ 9 ప్లస్‌లను బార్సిలోనాలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ (ఎండబ్ల్యూసి) 2018 ప్రదర్శనలో ఆదివారం లాంచ్ చేసింది. వచ్చే నెల 2 నుంచి ప్రీ ఆర్డర్స్ ప్రారంభం కానుండగా, అదే నెల 16 నుంచి విక్రయానికి అందుబాటులోకి వస్తాయి. ఈ స్మార్ట్ ఫోన్‌లలో ఫేస్ రికగ్నిషన్, (ఆగ్‌మెంటెట్ రియాలిటీ) ఎమోజీ ఫీచర్స్ కూడా ఉన్నాయి. కాగా, ఈ స్మార్ట్ ఫోన్‌లు మిడ్నైట్ బ్లాక్, టైటానియం గ్రే, కోరల్ బ్లూ, పర్పుల్ రంగులలో అందుబాటులోకి రానున్నాయి. గెలాక్సీ 9 ఫీచర్లు: 68 సర్టిఫైడ్ వాటర్, డస్ట్ రెసిస్టన్స్, 5.8 కర్వ్‌డ్ సూపర్ ఎమోలెడ్ డిస్‌ప్లే, ఆండ్రాయిడ్ 8 ఓరియో ఆపరేటింగ్ సిస్టమ్, 4జిబి ర్యామ్, 64జిబి /128జిబి /256జిబి స్టోరేజ్ (మైక్రో ఎస్‌డి కార్డ్ ద్వారా 400జిబికి పెంచుకోవచ్చు), 12ఎంపి బ్యాక్ కెమెరా, 8ఎంపి ఫ్రంట్ కెమెరా, సింగల్ రేర్ కెమెరా, బ్లూ టూత్, యుఎస్‌బి పోర్ట్స్, వైఫై, 3000 ఎంఏహెచ్ బ్యాటరీ. గెలాక్సీ 9 ప్లస్ ఫీచర్లు: 68 సర్టిఫైడ్ వాటర్, డస్ట్ రెసిస్టన్స్, 6.2 కర్వ్‌డ్ సూపర్




ఎమోలెడ్ డిస్‌ప్లే, ఆండ్రాయిడ్ 8 ఓరియో ఆపరేటింగ్ సిస్టమ్, 6జిబి ర్యామ్, 64జిబి /128జిబి /256జిబి స్టోరేజ్ (మైక్రో ఎస్‌డి కార్డ్ ద్వారా 400జిబికి పెంచుకోవచ్చు), 12ఎంపి బ్యాక్ కెమెరా, 8ఎంపి ఫ్రంట్ కెమెరా, డ్యూయల్ రేర్ కెమెరా, బ్లూ టూత్, యుఎస్‌బి పోర్ట్స్, వైఫై, 3500 ఎంఏహెచ్ బ్యాటరీ.

ఆపిల్ ఐఫోన్ భారీ డిస్కౌంట్స్



న్యూఢిల్లీ : ఆపిల్ ఐఫోన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు భారీ డిస్కౌంట్స్ ప్రకటించింది. సంస్థ ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు హోల్డర్‌లకు రూ. 10 వేల క్యాష్ బ్యాక్ ఆఫర్ చేసింది. ఐఫోన్ ఎక్స్‌ను కొన్న ఆరు నెలల తరువాత ఉచితంగా స్క్రీన్‌ను రీప్లేస్‌మెంట్ చేసుకునే అవకాశం కూడా సంస్థ కల్పించింది. అంతే కాదు. పాత ఫోన్ ఇచ్చి కొత్త ఫోన్ కొనుగోలు చేస్తే వారికి సంస్థ రూ. 20 వేల బైబ్యాక్ ఇస్తోంది. అదనంగా రూ. 7 వేల డిస్కౌంట్ కూడా పొందవచ్చు. ఐఫోన్ 7, ఐఫోన్ 7ప్లస్, ఐఫోన్ 6ఎస్, ఐఫోన్ 6ఎస్ ప్లస్, గూగుల్ పిక్సెల్, శాంసంగ్ గెలాక్సీ ఎస్8, శాంసంగ్ గెలాక్సీ ఎస్8 ప్లస్, శాంసంగ్ గెలాక్సీ ఎస్7 ఎడ్జ్ వంటి ఫోన్లకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది. కానీ ఈ ఫోన్‌లలో ఎలాంటి డ్యామేజులూ ఉండరాదు. అప్పడే ఈ డిస్కౌంట్‌లు వర్తిస్తాయి. ఆపిల్ ప్రీమియం రీసెల్లర్‌లతో పాటు ఎంపిక చేసిన స్టోర్లలో మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

ప్రపంచంలో అత్యధిక జీతాలు ముంబయిలోనే



న్యూఢిల్లీ : హెచ్‌ఎస్‌బిసి ఎక్స్‌పాట్ ఎక్స్‌ప్లోరర్ సర్వేలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. వలసదారులకు జీతాలు ఇవ్వడంలో ముంబయికి అగ్రస్థానం దక్కింది. అంతర్జాతీయ సగటు వార్షిక జీతం రూ. 64 లక్షలు కాగా, ముంబయిలో పని చేసే వలసదారులు ఏడాదికి సగటున రూ. 1.40 కోట్లు పొందుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల్లో పనిచేస్తున్న 27,587 మంది వలసదారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ముంబయి తరువాత స్థానంలో శాన్‌ఫ్రాన్సిస్కో నిలిచింది. గోల్డెన్ సిటీ అనే పేరు ఉన్న ఈ నగరంలో ఉద్యోగాలు చేసే విదేశీయులకు సగటు వార్షిక జీతం రూ. 1.34 కోట్లు అందుతున్నట్లు వెల్లడైంది. ప్రపంచం మొత్తం మీద 31 నగరాల్లో వలసదారులు పొందుతున్న సగటు వార్షిక జీతం రూ. 64.75 లక్షలు అని ఈ నివేదిక తెలిపింది. ఎడిన్‌బరోలో పని చేస్తున్న విదేశీయులు అతి తక్కువ జీతం పొందుతున్నారు. వారి సగటు వార్షిక జీతం రూ. 36.42 లక్షలు మాత్రమే. ఇది ఇలా ఉండగా, విదేశీయులకు ఉద్యోగాల కల్పనలో ముంబయితో సహా ఆసియాలోని నగరాలు బ్రిటన్, అమెరికాల్లోని నగరాల కన్నా వెనుకబడి ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది.

బ్యాంకుల మోసకారులకు మార్కెట్ శిక్ష



న్యూఢిల్లీ : చట్టంలో లొసుగులను ఉపయోగించుకొని బ్యాంకులను మోసం చేసేవారిని ప్రభుత్వం శిక్షించడం మాట ఎలా ఉన్నా మార్కెట్లు మాత్రం కఠినంగా శిక్షిస్తాయన్నది నిజం. వివిధ కుంభకోణాలతో సంబంధం ఉన్న దాదాపు డజను కంపెనీలు తమ అత్యధిక విలువతో పోల్చుకుంటే ఇప్పుడు దాదాపు 90 శాతం షేర్ విలువను కోల్పోయాయి. దీనికి కేతన్ పరేఖ్ ట్రేడింగ్ చేసిన కె-10 కంపెనీలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఆయన కుంభకోణం బయటపడిన తరువాత కె-10 కంపెనీలుగా పేరు పడిన సంస్థలు ప్రస్తుతం 99 శాతం మార్కెట్ విలువను కోల్పోయాయి. అప్పట్లో కేతన్ ఈ కంపెనీల వాటాల విలువను పెంచి వీటి ఆధారంగా కొన్ని బ్యాంకుల నుంచి భారీగా అప్పులు చేసి ముంచేశాడు. దీనితో తరువాత ఆ కంపెనీలు కోలు కోలేదు. 2009లో యూనిటెక్, డిబి రియల్టీ సంస్థల పేర్లు 2జి స్పెక్ట్రమ్ కుంభకోణంలో ఇరుక్కున్నాయి. 2017లో ఈ కేసు తీర్పు వెలువడిన తరువాతే డిబి రియల్టీ షేర్లు రూ. 36 నుంచి రూ. 83కు చేరాయి. అవి ప్రస్తుతం రూ. 58 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ సంస్థ హవా నడిచిన 2010 మార్చిలో షేరు ధర రూ. 540. ఇటీవల వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ వ్యవహారం బయటకు రావడంతో గీతాంజలీ జ్యుయెలర్స్, డి.ఎస్. కులకర్ణి డెవలపర్స్ మార్కెట్ విలువ 96 శాతం కోల్పోయాయి.

సన్‌రైజ్‌కు శ్రీకారం

- ఏపీలో పెట్టుబడుల ప్రవాహం
- విశాఖ భాగస్వామ్య సదస్సులో పారిశ్రామికోత్సాహం
- పలు కీలక రంగాలపై సమావేశాలు, చర్చాగోష్ఠులు
- పలువురు విదేశీ ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశాలు
- రూ.55 వేల కోట్ల రిలయన్స్ పెట్టుబడులు
- తిరుపతిలో ఎలక్ట్రానిక్ పార్కు, అమరావతిలో క్యాంపస్
- కృష్ణా-గోదావరి బేసిన్‌లోమూడు ప్రాజెక్టులు
- మూడు రోజుల్లో 734 ఒప్పందాలు
- మొత్తం పెట్టుబడులు రూ,4,39,765 కోట్లు


(విశాఖపట్నం నుంచి 'సూర్య ప్రత్యేక ప్రతినిధి) : విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. మొత్తం మూడు రోజులపాటు కుదిరిన ఒప్పందాలు 734 కాగా మొత్తం పెట్టుబడుల విలువ రూ.4,39,765 కోట్లు. ఈ పెట్టుబడులతో మొత్తం 11,02,125 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. పరిశ్రమలశాఖలో 129 ఒప్పందాలు, పెట్టుబడులు రూ.58,337 కోట్లు, 1,31,682 మందికి ఉద్యోగ ఉపాధి కల్పన జరగనుంది. గనుల శాఖలో 31 ఒప్పందాలు, పెట్టుబడులు రూ.12,227 కోట్లు, 16,225 మందికి ఉపాధి, ఐటీ, ఈ అండ్ సీ శాఖలో 75 ఒప్పందాలతో పెట్టుబడులు రూ.30,050 కోట్లు, మందికి ఉపాధి, ఈడీబీలో 144 ఒప్పందాల ద్వారా రూ.1,51,400 కోట్ల పెట్టుబడులు, 1,52,496 మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. ఆహారశుద్ధి రంగంలో 165 ఒప్పందాల ద్వారా రూ.3,100 కోట్ల పెట్టుబడులు, 47 వేల మందికి ఉద్యోగ ఉపాధి జరగనుంది. నెడ్ క్యాప్‌లో 38 ఒప్పందాల ద్వారా రూ.78,935 కోట్ల పెట్టుబడులతో 24,411 మందికి ఉద్యోగవకాశాలు లభించనున్నాయి. సీఆర్‌డీఏలో 37 ఒప్పందాల ద్వారా రూ.4964 కోట్ల పెట్టుబడులు, 78,680 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఐఅండ్ఐ శాఖలో 4 ఒప్పందాలు, రూ.5,968 కోట్ల పెట్టుబడులు, 5,450 ఉద్యోగాలు, పర్యాటక రంగంలో 49 ఒప్పందాలు, రూ.5.002 కోట్లు పెట్టుబడులు, 30,338 మందికి ఉద్యోగాల రానున్నాయి. ఏపీఎస్‌డీసీ కుదుర్చుకున్న ఒప్పందాలు 19, లక్షమందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఏపీ టిడ్కో 18 ఎంవోయూలు, రూ.40.013 కోట్ల పెట్టుబడులు, 3,80,750 మందికి ఉపాధి, వైద్యారోగ్య శాఖలో 25 ఎంవోయూలు, రూ.5090 కోట్ల పెట్టుబడులు, 4750 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయి.

రిలయన్స్ రూ.55వేల కోట్ల ఒప్పందాలు...

రిలయెన్స్ ఇండస్ట్రీస్ సంస్థ అత్యధికంగా రూ.55 వేల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకుంది. శని, ఆదివారాల్లో మొత్తం రూ.2,18,814 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. ఇవన్నీ ఆచరణలోకి వస్తే 3,84,662 మందికి ఉపాధి లభిస్తుంది. శనివారం రూ.44,246 కోట్ల విలువైన 79 ఒప్పందాలు జరగ్గా, ఆదివారం రెండో రోజు రూ.1,74,569 కోట్ల విలువైన 285 ఒప్పందాలు జరిగాయి. పెట్టుబడులు ఆకర్షించడంలో ఇంధన రంగం ముందంజలో ఉంది. ఆ రంగంలో ఏకంగా రూ.1,11,921 కోట్ల విలువైన ఒప్పందాలు జరిగాయి. రెండో రోజు వైమానిక, రక్షణ, జౌళి, ఇంధన, ఆహార శుద్ధి, ఆరోగ్యం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో కీలక ఒప్పందాలు జరిగాయి. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు టాటా ట్రస్ట్ వంటి ప్రముఖ ప్రైవేటు సంస్థలు, పలు ప్రభుత్వ సంస్థలు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థతో ఒప్పందాలు చేసుకున్నాయి. పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పరిస్థితి పరిశీలిస్తే ఒప్పందాలు 7 నుంచి 15 శాతం కార్యరూపం దాలుస్తుంటే ఏపీలో మాత్రం 38 నుంచి 40 శాతం ఫలితాలు వస్తున్నాయన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చి ఉంటే పరిశ్రమలకు ఇచ్చే రాయితీల భారం రాష్ట్ర ప్రభుత్వంపై తగ్గేదని, ఇంతకంటే మూడురెట్లు అదనంగా పరిశ్రమలకు ప్రోత్సాహం ఉండేదని అన్నారు. రెండో రోజు భాగస్వామ్య సదస్సులో భాగంగా అనేక రంగాలపై కీలక సమావేశాలు జరిగాయి. దేశ, విదేశాలకు చెందిన వాణిజ్య ప్రముఖులు, ఆయా రంగాల నిపుణులు పాల్గొన్నారు. చాలా సమావేశాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభు కొన్ని సమావేశాల్లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాల్లో సేవలందించేందుకు, పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్న సింగపూర్, జపాన్, దక్షిణ కొరియాల ప్రతినిధులతో ప్రత్యేక వాణిజ్య సమావేశాలు నిర్వహించారు. రెండో రోజు భాగసామ్య సదస్సుకు రాష్ట్ర మంత్రులు పలువురు హాజరయ్యారు.

ద్వైపాక్షిక సమావేశాలు...

వివిధ దేశాలకు చెందిన వాణిజ్య, విదేశాంగ ప్రముఖులతో ముఖ్యమంత్రి ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఆయా దేశాల్లో అభివృద్ధి చేసిన



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయడం, రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వారితో చర్చించారు. అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక అధ్యక్షుడు ముకేశ్ అఘీ సారథ్యంలో అమెరికా వ్యాపారవేత్తల బృందం ముఖ్యమంత్రిని కలిసింది. కొత్త సాంకేతిక పరిజ్ఞానాల్ని రాష్ట్రంలో వినియోగిస్తున్న తీరుని పీఎల్‌ఆర్ ఛాంబర్స్‌కి చెందిన సుహాన్ ముఖర్జీ కొనియాడారు. మరింతగా పెట్టుబడుల్ని ఆకర్షించేలా నిబంధనల్ని సరళతరం చేయాలని ఆయన సూచించారు. చెక్ రిపబ్లిక్ రాయబారి మిలాన్ హొవోర్కా సారథ్యంలో ఆ దేశ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసింది. రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నామని వారు పేర్కొన్నారు. పోర్టబుల్ పెట్రోలు పంపులు ఏర్పాటు చేస్తామని ఒకరు ప్రతిపాదించారు. భారత్‌లో కాగితం, కాగితపు గుజ్జుకి చాలా డిమాండ్ ఉందని, ఈ రగంలో రూ.95 వేల కోట్ల వరకు పెట్టుబడులకు అవకాశం ఉందని ఒక ప్రతినిధి తెలిపారు. రాష్ట్రంలో ఈ రంగంలో రూ.3 వేల కోట్ల పెట్టుబడులకు తాము సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. తమ దేశ వాణిజ్య, పారిశ్రామిక మంత్రిత్వ శాఖ ప్రతినిధులు త్వరలో ఆంధ్రప్రదేశ్‌ను సందర్శిస్తారని మిలాన్ హొవోర్కా తెలిపారు. ఆటోగ్రిడ్ సంస్థ సీఈఓ అమిత్ నారాయణ్ కొత్త తరహా వ్యవసాయ పంపుసెట్ల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. రైతుల ఆదాయం అనేకరెట్లు పెంచేందుకు ఇవి తోడ్పడతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10 లక్షల చోట్ల ఈ పంపుసెట్‌లు అమర్చాలని భావిస్తున్నామని తెలిపారు. వ్యవసాయం, పట్టణ ప్రణాళిక, మౌలిక వసతుల రంగాల్లో వీటిని వినియోగిస్తామన్నారు. తిరుపతిని ఆకర్షణీయ నగరంగా అభివృద్ధి చేయడంలో పాలు పంచుకుంటామని స్పెయిన్‌కు చెందిన అంతర్జాతీయ వాణిజ్య, పెట్టుబడుల విభాగం డైరెక్టర్ జనరల్ జోస్ లూయిస్ కైజర్ మొరియారస్, రాయబార కార్యాలయానికిచెందిన రెజినా సంచా ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలో థర్మల్ బ్యాటరీ తయారీ ప్లాంటు, పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని భారత్ ఎనర్జీ స్టోరేజి టెక్నాలజీ ప్రతినిధులు ప్రతిపాదించారు. స్మార్ట్ గ్రిడ్‌లు, స్మార్ట్ సిటీలు, ఆటోమొబైల్ తదితర రంగాల్లో రూ.650 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనల్ని వెస్ట్ ఎనర్జీ సిస్టమ్స్ ఛైర్మన్ ప్యాట్రిక్ గ్లిన్ అందజేశారు.

రైల్వేలో ఉద్యోగ జాతర

- 89,500 మంది నియామకానికి సన్నాహాలు
- లోకో పైలట్లు, టెక్నీషియన్లు, గ్యాంగుమన్‌ల భర్తీ
- ఏటా 40 వేల మంది పదవీ విరమణ
- భద్రత విభాగంలోనే భారీగా ఖాళీలు
- తాజా నియామకాలతో కొంత మేర ఉపశమనం



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే వ్యవస్థ అయిన భారతీయ రైల్వే ఏకంగా 89,500 మంది సిబ్బంది నియామకంపై దృష్టి పెట్టింది. వారిలో లోకో పైలట్లు, టెక్నీషియన్లు, గ్యాంగ్‌మన్‌లు, స్విచ్‌మన్‌లు, ట్రాక్‌మన్‌లు, క్యాబిన్‌మన్‌లు, వెల్డర్లు, హెల్పర్లు, పోర్టర్లు ఉన్నారు. హైస్కూల్ విద్యార్హత నుంచి ఇంజనీరింగ్ విద్యార్హతల వరకు వివిధ వర్గాల వారికి ఏకంగా లక్ష ఉద్యోగాలను రైల్వే శాఖ కల్పించనున్నది. వచ్చే ఏడాది మొదట్లో ఎన్నికలు రానుండడంతో కేంద్రం వ్యూహాత్మకంగా ఉద్యోగ నియామకాలపై దృష్టి పెట్టిందంటున్నారు విశ్లేషకులు. రైల్వేలో సుమారు 1.2 లక్షల ఉద్యోగ ఖాళీలు భద్రత విభాగంలోనే ఉన్నాయి. ఏటా రైల్వేలో సుమారు 40 వేల మంది నుంచి 45 వేల మంది వరకు రిటైర్ అవుతున్నారని ఒక ఉద్యోగి తెలిపారు. తాజా నియామకాలతో రైల్వేపై ఏటా రూ. 4,000 కోట్ల మేర భారం పడుతుందని అంచనా. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రైల్వే శాఖ ఉద్యోగుల వేతనాలకు రూ. 69,713 కోట్లు ఖర్చు చేయగా, అది 2017-18లో రూ. 72,705 కోట్లకు చేరుకోనున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ బడ్జెట్ రూ. 76,451 కోట్లకు పెరుగుతుందని అంచనా. రైళ్లలో బెర్త్‌ల రిజర్వేషన్లలో మహిళలకే పెద్ద పీట ఇది ఇలా ఉండగా, రైళ్లలో మహిళల కోసం నిర్దేశించిన బెర్తులు ఖాళీగా ఉంటే, వాటిని ఇతరులకు కేటాయించడంలో మొదటి ప్రాధాన్యం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న మహిళలకు, ఆ తరువాతి ప్రాధాన్యం వయో వృద్ధులకు ఇవ్వాలని రైల్వే శాఖ నిర్ణయించింది.

పవన్‌తో కలిసి చంద్రబాబు నాటకాలు

కర్నూలు, మేజర్‌న్యూస్‌: ప్రత్యేక హోదా విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని వైసీపీ నాయకుడు శిల్పా చక్రపాణి రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఆయన సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ మొదటి నుంచి ప్రత్యేక హోదా సాధించడం కోసం అనేక కార్యక్రమాలు చేసిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేనని, ప్రత్యేక హోదాపై జగన్‌కు క్రెడిట్ దక్కకూడదనే పవన్‌తో కలిసి బాబు నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని, రాజకీయలంటే సినిమాలు తీసినంత ఈజీ కాదంటు విమర్శించారు. మార్చి ఒకటో తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టదల్చిన కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయాలని శిల్పా చక్రపాణిరెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మార్చి మూడో తేదీన పార్టీ ఎమ్మెల్యేలు, ఇంచార్జ్‌లు, ముఖ్యనాయకులంతా జగన్ మోహన్ రెడ్డిని కలిసి, అయిదో తేదీన ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మహాధర్నాలో పాల్గొంటామని తెలిపారు. తెలుగు ప్రజల మనోభావాలు, ఆకాంక్షలు ఢిల్లీలో వినిపిద్దాం ప్రత్యేక హోదా సాధిద్దాం అంటు ఆయన నినాదం ఇచ్చారు.

ప్రజా సంకల్ప యాత్ర 98వ రోజు సాగిందిలా

ఒంగోలు, మేజర్‌న్యూస్‌: వైసీపీ అధ్యక్షుడు, జననేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర ప్రకాశం జిల్లాలో విజయ వంతంగా కొనసాగుతోంది. సోమ వారం ఉదయం చిన్నారికట్ల శివారు నుంచి ఆయన 98వ రోజు పాద యాత్రను ఆరంభించారు. దారిపొడవునా ప్రజలు జననేతకు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి చిన్నారికట్ల, చిన్నారికట్ల జంక్షన్, కంభాలపాడు మీదు గా పోతవరం చేరుకొని పార్టీ జెండా ఆవిష్కరించారు. మధ్యాహ్నం 12 గంట లకు భోజన విరామం తీసుకున్నారు. అనంతరం 2.45 గంటలకు వైఎస్ జగన్ తిరిగి పాదయాత్ర ప్రారంభించారు. మూడు గంటలకు పొదిలి చేరుకొని అక్క డి ప్రజలతో జగన్ మమేకమవుతూ అక్కడ జరిగిన బహిరంగసభలో మాట్లాడారు.

లోక్‌పాల్ ఏర్పాటులో జాప్యం ఎందుకు?

- సంపన్నులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు
- నీరవ్ మోడీ కుంభకోణంపై ఎందుకు నోరు మెదపడం లేదు?
- కనీసం ఢిల్లీలో అయినా లోక్‌పాల్‌ను అమలు చేయడం లేదు
- జైలుకెళ్లిన ముఖ్యమంత్రికి ఎందుకు మద్దతు పలుకుతున్నారు?
- బసవేశ్వర చెప్పినట్లు చెప్పేదాన్ని ఆచరించాలి
- మిమ్మల్ని ఎన్నుకున్నది కేవలం ఉపన్యాసాలివ్వడానికి కాదు
- రాఫెల్ ఒప్పందంలో మార్పులు అప్పటి రక్షణ మంత్రికీ తెలియదు
- మోడీపై నిప్పులు చెరిగిన రాహుల్

బెంగళూరు : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారం ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శలతో విరుచుకుపడ్డారు. సంపన్నులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అవినీతిపై పోరాడేందుకు లోక్‌పాల్‌ను ఎందుకు నియమించడం లేదని నిలదీశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ - నీరవ్ మోడీ కుంభకోణంపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. రాయదుర్గలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడుతూ మోదీ గుజరాత్‌లో లోకాయుక్తను అమలు చేయలేదన్నారు. ఆయన ప్రధాన మంత్రి పదవిని చేపట్టి నాలుగేళ్ళవుతోందని, కనీసం ఢిల్లీలో అయినా లోక్‌పాల్‌ను అమలు చేయడం లేదని అన్నారు. అటువంటి మోడీ కర్ణాటక వచ్చి, బీజేపీ అధికారంలో ఉన్నవుడు జైలుకెళ్ళిన ముఖ్యమంత్రిని, నలుగురు మంత్రులను పక్కన పెట్టుకుని, అవినీతి గురించి మాట్లాడతారన్నారు. కర్ణాటకకు చెందిన 12వ శతాబ్దినాటి సాంఘిక సంస్కర్త బసవేశ్వర చెప్పినట్లుగా , చెప్పేదాన్ని ఆచరించాలని ఈసందర్భంగా రాహుల్ డిమాండ్ చేశారు. దేశ ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నది కేవలం ఉపన్యాసాలివ్వడానికి కాదన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా రాహుల్ ఉత్తర కర్ణాటక వచ్చారు. సోమవారం ఆయన రాయదుర్గలో పర్యటించారు. కర్ణాటక శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయన తరచూ రాష్ట్రానికి వస్తున్నారు. రాఫెల్ ఒప్పందంలో మార్పు చేస్తున్న విషయం అప్పుడు రక్షణశాఖ మంత్రిగా ఉన్న మనోహర్ పారికర్‌కు కూడా తెలియదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. పారికర్‌కు తెలియకుండానే ప్రధాని నరేంద్రమోడీ ఈ పనిచేశారని చెప్పారు. ఆ సమయంలో గోవాలో పారికర్ చేపలు కొనుగోలు చేస్తున్నారంటూ చమత్కరించారు. మాజీ రక్షణ శాఖమంత్రి గోవాలోని ఫిష్ మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేస్తున్నారు. ప్రధాని మోడీ రాఫెల్ కాంట్రాక్టును పూర్తిగా మార్చేసిన విషయం ఆయనకు తెలియదు అని రాహుల్ అన్నారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి మూడు ప్రశ్నలు ప్రధాని



మోడీకి మీడియా ప్రతినిధులు సంధించాలని విజ్ఞప్తి చేశారు. అసలు రాఫెల్ జెట్ల ఖరీదు ఎంత? ఆ కాంట్రాక్టును ఎందుకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) నుంచి తొలగించారు? ఎందుకు ఓ వ్యాపార వేత్తకు ఆ కాంట్రాక్టు అప్పగించారు? ఈ ప్రశ్నలు నేను గతంలో కూడా ప్రధానికి వేశాను. కానీ, ఒక్క సమాధానం లభించలేదు. మీకు దొరుకుతుందేమో ప్రశ్నించండి?' అని రాహుల్ ప్రశ్నించారు.

నేడు నాగాలాండ్, మేఘాలయ పోలింగ్



న్యూఢిల్లీ: నాగాలాండ్, మేఘాలాయలో మంగళవారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగియనుంది. నాగాలాం డ్‌లోని కొన్ని జిల్లాల్లో మధ్యాహ్నం 3 గంటలకే పూర్తి కానుంది. ఇక నాగాలాండ్, మేఘాలాయ మొత్తం అసెంబ్లీ స్థానాలు 60 ఉండగా, 59 స్థానాలకు మాత్రమే ఎన్నిక జరగనుంది. మిగిలిన ఒక స్థానానికి తర్వాత ఎన్నిక నిర్వహించనున్నారు. 60 స్థానాల నాగాలాండ్ అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో వివిధ కారణాల రీత్యా కాంగ్రెస్ పార్టీ 23 స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను నిలుపనున్నట్లు ప్రకటిం చింది. కానీ నామినేషన్ల ఉపసంహరణ నాటికి మరో ఐదుగురు సభ్యులు పక్కకు తప్పుకున్నారు. నాగాలాండ్‌లో మాజీ సీఎం రియో ఆధ్వర్యంలో స్థాపించిన నేషనల్ డెమొక్రటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ (ఎన్డీపీపీ), బీజేపీలతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా నిలువరించేందుకు కసరత్తు చేపట్టిందని తెలుస్తోంది.

మొదటి పేజీ తరువాయి

ఆనంద ఆంధ్ర




చేశారు. టెక్నాలజీ ద్వారా పథకా లను సమర్థంగా అమలు చేస్తున్నామని, మూడేళ్ల క్రితం ఏపీలో తయారీరంగం బలహీనంగా ఉండేదని, ఇప్పుడు తయారీరంగం పుంజుకుందని చంద్రబాబు తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో ఇప్పుడు పరిస్థితి మారిందని ఆయన అన్నారు. కాగా సోమవారం తో సీఐఐ సదస్సు ముగిసింది. మూడురోజుల పాటు మొత్తం 734 ఎంవోయూలు ప్రభుత్వం కుదుర్చుకుంది. వాటి పెట్టుబ డుల విలువ రూ. 4,39,765 కోట్లు. దీంతో రాష్ట్రంలో 11,02, 125 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు అభించే అవకాశం ఉన్నట్లు చంద్రబాబు వ్యాఖ్యానించారు. సీఐఐ సదస్సులో వెల్లువెత్తిన ఎంవోయూలు...

విశాఖ నగరంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో పెట్టుబడి ఒప్పందాలు (ఎంవోయూ) వెల్లువెత్తాయి. ఏపీలో పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు 21 రోజుల్లో అన్ని అనుమతులు ఇస్తామని స్పష్టం చేశారు. పెట్టుబడుల పురోగతి వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచామని చెప్పారు. భావనపాడులో పోర్టుకు ఆదానీ గ్రూప్‌తో ఒప్పందం కుదిరినట్లు సీఎం తెలిపారు. ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు అన్నారు. ఎప్పుడూ కొత్తగా ఆలోచిస్తామని, కొత్త సాంకేతికను అందిపుచ్చుకుంటామని చంద్రబాబు తెలిపారు. ప్రతి సవాల్‌ను ఒక అవకాశంగా మలుచు కుంటున్నామని, వచ్చే ఏడాది మళ్లీ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. సీఐఐ-బిజినెస్ రష్యా మధ్య ఎంవోయూ కుదిరినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే సీఐఐ, సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ మధ్య ఎంవోయూ జరిగిందని, ఏపీ, సింగపూర్ మధ్య వ్యాపార సంబంధాలు మెరుగు పడనున్నాయని, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఇండస్ కాఫీల మధ్య ఎంవో యూ కుదిరిందన్నారు. నెల్లూరులో కాఫీ ప్లాంట్ ఏర్పాటుకానుందని చంద్రబాబు తెలిపారు.

భాగస్వామ్య సదస్సులో పెట్టుబడులు రూ. 4,39,765 కోట్లు

- మొత్తం 11,02,125 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు
- సదస్సు చివరి రోజే రూ. 2,20,951 కోట్ల పెట్టుబడులు
- చివరి రోజు మొత్తం 369 ఒప్పందాలు
- 7,17,463 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు
- 60 దేశాల నుంచి 280 మంది ప్రతినిధులు

విశాఖపట్నం, సూర్య ప్రత్యేక ప్రతినిధి : సీఐఐ భాగస్వామ్య సదస్సు-2018లో మొత్తం మూడురోజుల పాటు 734 ఒప్పందాలు కుదిరాయి. సీఐఐ భాగస్వామ్య సదస్సు-2018 ముగింపు కార్యక్రమంలో సింగపూర్ మంత్రి ఈశ్వరన్, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు సురేశ్ ప్రభు, అశోక్ గజపతిరాజు పాల్గొన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు-2018 ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న అత్యుత్తమ విధానాలను పరస్పరం తెలుసుకోవడానికి, వాణిజ్య బంధాలను ధృఢం చేసుకోవడానికి ఈ 3 రోజుల భాగస్వామ్య సదస్సు ఎంతగానో దోహదపడిందన్నారు. 60 దేశాల నుంచి 280 మంది ప్రతినిధులు, 3673 మంది భారతీయ పారిశ్రామికవేత్తలు, 500 మంది బిజినెస్ స్కూల్ విద్యార్థులు, మొత్తం కలిపి 4453 మంది ఈ సదస్సులో పాల్గొన్నారు. అందరూ ఆశించినట్టే రాజధాని అమరావతి నిర్మాణానికి సింగపూర్ అత్యుత్తమ మాస్టర్ ప్లాన్ అందించింది. సింగపూర్ కన్సార్టియం అమరావతి అభివృద్ధిలో పాలు పంచుకుంటోంది. రానున్న కాలంలో అమరావతి ప్రపంచంలోని 5 అత్యుత్తమ నగరాలలో ఒకటిగా రూపుదాల్చనుంది. ప్రస్తుతం అమరావతి శరవేగంగా నిర్మాణం జరుపుకుంటోంది. ఇక్కడికి వచ్చిన పారిశ్రామిక, వ్యాపారవేత్తలందరూ అమరావతి అభివృద్ధిలో పాలు పంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది ఇక్కడ బ్రహ్మాండమైన కన్వెన్షన్ సెంటర్ సిద్ధమవుతుందని, భాగస్వామ్య సదస్సులో 55 ద్వైపాక్షిక సమావేశాలు జరిపామని, గూగుల్, అదాని, రిలయెన్స్ వంటి సంస్థలతో ఎంవోయూలు చేసుకున్నట్లు సీఐఐ భాగస్వామ్య సదస్సు-2018 ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. వచ్చే ఏడాది కియా తొలి కారు బయటికి రానుందని, కియా కారు భారత్ నుంచి అంతర్జాతీయ మార్కెట్‌లోకి వెళ్లబోతోందని వివరించారు.



పెట్టుబడుల విలువ రూ. 4,39,765 కోట్లు...


ఈ పెట్టుబడులతో మొత్తం 11,02,125 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పరిశ్రమలశాఖలో 129 ఒప్పందాలు, పెట్టుబడులు రూ. 58,337 కోట్లు, 1,31,682 మందికి ఉద్యోగ ఉపాధి కల్పన జరగనుంది. గనుల శాఖలో 31 ఒప్పందాలు, పెట్టుబడులు రూ. 12,227 కోట్లు, 16,225 మందికి ఉపాధి. ఐటీ, ఈ అండ్ సీ శాఖలో 75 ఒప్పందాలు, పెట్టుబడులు రూ. 30,050 కోట్లు, మందికి ఉపాధి కలుగుతుందిన ఈడీబీలో 144 ఒప్పందాలు, రూ. 1,51,400 కోట్ల పెట్టుబడులు, 1,52,496 మందికి ఉపాధి, ఆహారశుద్ధి రంగంలో 165 ఒప్పందాలు, రూ. 3,100 కోట్ల పెట్టుబడులు, 47 వేల మందికి ఉద్యోగ ఉపాధి, నెడ్ క్యాప్‌లో 38 ఒప్పందాలు. రూ. 78,935 కోట్ల పెట్టుబడులు, 24,411 మందికి ఉద్యోగవకాశాలు లభించనున్నాయి. సీఆర్‌డీఏలో 37 ఒప్పందాలు, రూ. 4964 కోట్ల పెట్టుబడులు, 78,680 మందికి ఉద్యోగాలు, ఐఅండ్ఐ శాఖలో 4 ఒప్పందాలు, రూ. 5,968 కోట్ల పెట్టుబడులు, 5,450 ఉద్యోగాలు, పర్యాటక రంగంలో 49 ఒప్పందాలు, రూ. 5.002 కోట్లు పెట్టుబడులు, 30,338 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏపీఎస్‌డీసీ కుదుర్చుకున్న ఒప్పందాలు 19, లక్షమందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఏపీ టిడ్కో 18 ఎంవోయూలు, రూ. 40.013 కోట్ల పెట్టుబడులు, 3,80,750 మందికి ఉపాధి, వైద్యారోగ్య శాఖలో 25 ఎంవోయూలు, రూ. 5090 కోట్ల పెట్టుబడులు, 4750 మందికి ఉద్యోగ ఉపాధి కల్పన జరగనుంది.

మొదటి పేజీ తరువాయి

హోదాపై చంద్రబాబుది పూటకోమాట

పూటకో మాట మాట్లాడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదాను సంజీవని అన్నారని, నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా సంజీవనా అని ప్రశ్నించిన చంద్రబాబు ఇప్పుడు మళ్లీ మాట మార్చారని ధ్వజమెత్తారు. హోదాపై ఆయనవన్నీ మొసలి కన్నీళ్లే అని వైఎస్ జగన్ మండిపడ్డారు. "విశాఖలో జరుగుతున్న భాగస్వామ్య సదస్సులో చంద్రబాబు మాటలు వింటుంటే చాలా ఆశ్చర్యం వేస్తోంది. జీడీపీ విషయంలో కూడా ఆయన అబద్ధాలు ఆడుతూ, ప్రజలను మభ్యపెడుతున్నారు. గవర్నర్‌తో కూడా అబద్ధాలు ఆడిస్తున్నారు. లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షల ఉద్యోగాలు ఎప్పుడు వచ్చాయి. రూ.4 లక్షల 39వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గవర్నర్‌తో చెప్పించారు. గతంలో నిర్వహించిన సదస్సుల ద్వారా రూ.15లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని బుకాయించారు. మరి ఆ రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం గత రెండేళ్లలో రాష్ట్రానికి ఏటా రూ.5 వేలకోట్ల పెట్టుబడులు కూడా రాలేదు. అయినా రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ఊదరగొడుతున్నారు. అలా చెప్పడం అన్యాయం కాదా,. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి వాస్తవాలు చెప్పాలా, లేనిది ఉన్నట్లు చెబుతారా, మార్కాపురం నియోజకవర్గంలోకి అడుగుపెట్టగానే అడుగడుగునా నాకు కనిపించింది ఏంటో తెలుసా. అన్నా నీళ్లు లేవన్నా అంటున్నారు. బాధనిపించింది. పక్కనే వెలుగొండ ప్రాజెక్టు కనిపిస్తోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన గుర్తుకు వస్తోంది. నాలుగేళ్లుగా వరుస కరువుతో రైతులు అల్లాడుతున్నారు. చంద్రబాబు జాబు వస్తే జాబు వస్తుందని ఎన్నికల్లో చెప్పారు. కానీ బాబు వచ్చిన తరువాత నాలుగేళ్లు కరువు వచ్చింది. రబీ, ఖరీఫ్‌లో మైనస్ 34 శాతం వర్షపాతం నమోదైంది. అక్టోబర్‌లో మైనస్ 70 శాతం వర్షపాతం. ఇంత జరుగుతున్నా కూడా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడి ఇ వ్వాలని కానీ, కరువు మండలంగా ప్రకటించాలని ఈ పాలనకు రావడం లేదు.

ఏదైనా కరువు వస్తే ఖరీఫ్ నుంచి రైతులను ఆదుకునేందుకు వెంటనే కరువు మండలాలుగా ప్రకటించి ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ సొమ్ము ఇచ్చి ఆదుకోవాలని ముఖ్యమంత్రి ఆలోచన చేస్తారు. ఈ ముఖ్యమంత్రి రైతు శ్రేయోభిలాషి కాదు. ఖరీఫ్, రబీలో కరువు వచ్చి దారుణంగా రైతుల పరిస్థితి ఉన్నా కూడా ఇన్సూరెన్స్‌డబ్బులు కట్టడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ వాట ఇంతవరకు చంద్రబాబు చెల్లించడం లేదు. ప్రజా సంకల్ప యాత్రలో నేను నిలదీయడంతో నామ్‌కే వాస్తిగా రెండు, మూడు కరువు మండలాలను ప్రకటించారు. కేబినెట్లో మంత్రులు రైతుల గురించి మాట్లడటం లేదు. కేబినెట్‌లో ఎవరి భూములు దోచుకోవాలి, ఏ కాంట్రాక్టర్‌కు అంచనాలు పెంచి డబ్బులు దోచిపెట్టాలని ఆలోచిస్తున్నారు. నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో ఒక్కరన్నా సంతోషంగా ఉన్నారా, రాష్ట్రంలో రైతన్నల పరిస్థితి దారుణంగా



ఉంది. ఈ నాలుగేళ్లుగా వెలుగొండకు మోక్షం లేదు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తయితే 48 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చు. లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి. ప్రకాశం జిల్లాకు నాగార్జున సాగర్ నీళ్లను వైఎస్ఆర్ తెస్తారని ఊహించలేదు. వెలిగొండ ప్రాజెక్ట్ పనులు వైఎస్ఆర్ హయాంలోనే పరుగులు పెట్టాయి. ఇక పెట్రోల్, డీజిల్ ధరలు మన రాష్ట్రంలోనే ఎక్కువ. చంద్రబాబు పాలనలో మద్యం ఏరులై పారుతోంది. హైటెక్ పాలనలో ఒక్క ఫోన్ కాల్ కొడితే మద్యం ఇంటికి వస్తోంది. అందరూ కలిసికట్టుగా ఒక్కటై చంద్రబాబు అన్యాయమైన, అబద్ధాల పాలనను బంగాళాఖాతంలో కలిపాలి." అని వైఎస్ జగన్ ప్రజలను కోరారు.

డిజిటల్ హబ్‌గా మారుస్తాం



ఎలక్ట్రానిక్ తయారీ రంగం అభివృద్ధి సాధ్యమవుతుందని, చెన్నై, బెంగుళూరు కారిడార్‌ని వినియోగించుకుంటూ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలతో నిరంతరం మాట్లాడుతూ వారికి కావాల్సిన విధంగా పాలసీలు రూపొందించామని, రాష్ట విభజన సమయంలో ఒక్క మొబైల్ ఫోన్ కూడా ఇక్కడ తయారు కాలేదన్నారు. ప్రస్తుతం దేశంలో తయారవుతున్న ప్రతి పది ఫోన్లలో 2 ఆంధ్రప్రదేశ్ లో తయారు అవుతున్నాయని, దేశంలో తయారయ్యే ప్రతి 10 ఫోన్లలో 5 ఆంధ్రప్రదేశ్‌లో తయారయ్యేలా చర్యలు తీసుకోవాలని టార్గెట్ పెట్టుకున్నామని వెల్లడించారు. కానీ దేశంలో తయారయ్యే పది ఫోన్లలో 8 ఆంధ్రప్రదేశ్‌లో తయారయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మాకు టార్గెట్ ఇచ్చారన్నారు. అమరావతిలో చిప్ డిజైన్ యూనివర్సిటీ త్వరలోనే ఏర్పాటు చేస్తున్నామని, చిప్ డిజైన్ దగ్గర నుండి పూర్తి స్థాయి ఎలక్ట్రానిక్స్ తయారీ వరకూ ఆంధ్ర ప్రదేశ్‌లో జరిగేలా మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. డిజైన్, తయారీ, సరఫరాలో లీడర్‌గా ఎదిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ప్రపంచంతో పోటీ పడాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నూతన ఎయిర్ పోర్టులు,పోర్టులు నిర్మిస్తున్నామని చెప్పారు. కేవలం మొబైల్ ఫోన్లు మాత్రమే కాకుండా ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు తయారీ ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చేందుకు అనేక కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నామని ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీల అధినేతలు, సిఈఓ లతో భేటీలో మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన మీ అందరికి కృతజ్ఞతలు అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసి క్లస్టర్ మోడల్ ను అభివృద్ధి చేస్తున్నామని, చిప్ డిజైన్, బ్యాటరీ తయారీ దగ్గర నుండి పూర్తి స్థాయి వస్తువుల తయారీ ఆంధ్రప్రదేశ్ లో జరిగేలా పూర్తి స్థాయి ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నామన్నారు.

సింగపూర్ మంత్రితో భేటీ...

సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి ఈశ్వరన్, పలువురు సింగపూర్ పారిశ్రామికవేత్తలతో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్ హబ్ గా మార్చేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం అభివృద్ధి కి అనేక చర్యలు తీసుకున్నామన్నారు. అనేక పాలసీలు, రాయితీలు కల్పిస్తున్నామని, కంపెనీలు త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు అనుమతులు, భూములు వేగంగా కేటాయిస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ చిన్న రాష్ట్రంగా ఏర్పడిందని, ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నపుడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన రాజధాని హైదరాబాద్‌ను కోల్పోయామని, విభజన సమయంలో ఐటి రంగం అంతా హైదరాబాద్ లోనే ఉండిపోయిందన్నారు. మూడున్నర ఏళ్ల పసి పాపలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని, సమస్యలను అధిగమిస్తూ వృద్ధి సాధిస్తున్నామన్నారు.

శ్రీదేవి మృతిపై అన్నీ అనుమానాలే!



వస్తున్న సంగతి శ్రీదేవికి బోనీకపూర్ చెప్పలేదు. నేరుగా ఆమె బస చేసిన జుమైరా ఎమిరేట్స్ టవర్స్ హోటల్‌కు వెళ్లారు. ఆమెను ఆశ్చర్యపరిచిన బోనీకపూర్... నిద్రపోతున్న శ్రీదేవిని సాయంత్రం 5:30 గంటల సమయంలో నిద్రలేపారు. ఎప్పుడొచ్చారు అని ఆశ్చర్చపోయిన శ్రీదేవి దాదాపు ఆయనతో 15 నిమిషాలు మాట్లాడారు. ఇద్దరు కలిసి డిన్నర్‌కు వెళ్లాలని నిర్ణయించుకోవడంతో స్నానం చేసి వస్తానని చెప్పి శ్రీదేవి బాత్‌రూంలోకి వెళ్లారు. దాదాపు పావుగంటైనా ఆమె బాత్ రూం నుంచి బయటకు రాలేదు. దాంతో అనుమానం వచ్చిన బోనీ కపూర్ తలుపుతట్టారు. లోపల నుంచి మాట వినిపించలేదు. అలకిడి లేదు... స్నానం చేస్తున్న శబ్దం లేదు. దాంతో హోటల్ సిబ్బంది సాయంతో బోనీ కపూర్ తలుపు పగలకొట్టి చూశారు. బాత్ టబ్‌లో శ్రీదేవి అచేతనంగా పడి ఉండటం కనిపించింది. బోనీకపూర్ ఆమెను బతికించుకోవడానికి ప్రయత్నం చేశారని ఖలీజ్ టైమ్స్ కథనం. పారామెడికల్ సిబ్బంది రంగంలోకి దిగారు. శ్రీదేవి చనిపోయినట్లు ధృవీకరించారు. ఆమె భౌతికకాయాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. బాత్ టబ్‌లోనే శ్రీదేవి ఊపిరి ఆగిపోయిందని ప్రాథమిక నిర్ణయానికి వచ్చారు. శ్రీదేవి శనివారం రాత్రి 11:30 నిమిషాలకు చనిపోలేదని, అంతకు ముందే చనిపోయిందని దుబాయ్ పత్రిక ఖలీజ్ టైమ్స్ కథనం. అయితే దుబాయ్‌కి శ్రీదేవితో వెళ్లిన బోనీ కపూర్ తిరిగి ముంబైకి ఎందుకు వచ్చారు. శనివారం దుబాయ్ తిరిగి ఎందుకు వెళ్లారు. వెళితే ఆ సాయంత్రం శ్రీదేవితో గడిపారా.. లేక మధ్యలో హోటల్ నుంచి బయటకు వచ్చారా? శ్రీదేవి మృతి గురించి ఆయన ఆలస్యంగా చెప్పారనే సందేహాలు చుట్టుముడుతున్నాయి. శ్రీదేవి మృతిపై బోనీ కుటుంబంలోని సభ్యులు ఎవరూ ఇప్పటి వరకు నోరు మెదపలేదు. శ్రీదేవి, బోనీ వివాహం తర్వాత కపూర్ కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. అయితే ఆ కుటుంబంలో చిన్నవాడైన సంజయ్ కపూర్ మొత్తం కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నించారు. శ్రీదేవిని పెళ్లి చేసుకున్న తర్వాత బోనీ మొదటి భార్య కుమారుడు అర్జున్ కపూర్‌ను సంజయ్ ఎక్కువగా చూసుకున్నారు. అంతేకాదు అటు అనిల్ కపూర్ కుటుంబ సభ్యులతో, ఇటు శ్రీదేవితో కలిసిపోయి అందరినీ ఒకే తాటిపైకి తెచ్చేందుకు యత్నించారు. వీటితోపాటుగా ప్రొడక్షన్, కోర్టు వ్యవహారాలను సంజయ్ చూసుకునేవారు. ఇలా కుటుంబ వ్యవహారాలకు పరిమితం కావడంతో సంజయ్ సినీ కెరీర్ దెబ్బతినడానికి కారణమని చెబుతారు. అలాంటి సంజయ్ కపూర్ కూడా మౌనంగా ఉండడం శ్రీదేవి మృతిపై అనుమానాలు కలగడానికి మరో కారణం అవుతోందని పలువురు చర్చించుకుంటున్నారు. దుబాయ్‌లో కన్నుమూసిన వెండితెర అతిలోక సుందరి శ్రీదేవి మృతికి సంబంధించిన ఫోరెన్సిక్ నివేదిక విడుదలైంది. ఈ నివేదికలోని అంశాలను యూఏఈ ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. ఆమె మరణం వెనుక ఎలాంటి నేరపూరిత ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. శ్రీదేవి ప్రమాదవశాత్తూ బాత్‌టబ్‌లో పడి చనిపోయినట్టు ఫోరెన్సిక్ నివేదిక నిర్ధారించింది. ఈ నివేదిక ప్రకారం.. ఆమె శరీరంలో ఆల్కహాల్ నమూనాలు కూడా ఉన్నట్లు గల్ఫ్‌న్యూస్ తెలిపింది. శ్రీదేవి మరణం వెనుక ఎలాంటి నేరపూరిత కోణం లేదని స్పష్టం చేసింది. మరోపక్క పార్థివదేహం భారత్‌కు అప్పగించడంపై చేయాల్సిన ప్రక్రియ నెమ్మదిగా కొలిక్కి వస్తోంది. తదుపరి కార్యక్రమాలు పూర్తిచేయడానికి మరికొన్ని గంటలు పట్టే అవకాశం ఉండటంతో మృతదేహం భారత్‌కు చేరే కచ్చితమైన సమయంపై సందిగ్ధత నెలకొంది. శ్రీదేవి ఇకలేరన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతున్న సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు తుది వీడ్కోలు పలికేందుకు బాధాతప్త హృదయాలతో వేచి చూస్తున్నారు. వివిధ భాషలకు చెందిన సినీ ప్రముఖులు ముంబయి చేరుకుంటున్నారు. కోట్లాది అభిమానుల్ని శోకసంద్రంలో ముంచి నింగికేగిన అందాల తార శ్రీదేవి శవపరీక్ష, ఫోరెన్సిక్ నివేదికలను దుబాయ్ పోలీసులు బయటపెట్టారు. ఆమె భౌతిక కాయాన్ని ఇంకా కుటుంబ సభ్యులకు అప్పగించలేదు. ఆమె పార్థివదేహం ఇంకా దుబాయ్‌లోని ఆల్‌హుస్సేనీ పోలీసు శవాగారంలో ఉండగా.. భారత దౌత్యఅధికారులతో కలిసి ఆమె కుటుంబ సభ్యుల్ని దుబాయ్ ప్రభుత్వ వర్గాలు లోపలికి అనుమతించాయి. రెండోసారి శవపరీక్ష అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. శనివారం రాత్రి దుబాయ్‌లోని ఓ హోటల్‌లో స్నానవు గదిలో శ్రీదేవి అకాల మరణం చెందడంపై తుది నివేదిక రూపొందించడం సహా ఇతర న్యాయ పరమైన ప్రక్రియల్ని పోలీసులు ఇంకా పూర్తిచేయాల్సి ఉంది. ఈ తతంగమంతా ముగిశాక ఆమె పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. ఆ తర్వాత ఇమ్మిగ్రేషన్ సహా ఇతర లాంఛనాలు పూర్తిచేసేందుకు మరికొంత సమయం పడుతుందని భారత రాయభార కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో శ్రీదేవి భౌతికకాయం ఈ అర్ధరాత్రి లేదా ఆ తర్వాతే ముంబయి చేరుకొనే అవకాశాలు కనబడుతున్నాయి. శ్రీదేవి పార్థివదేహాన్ని తొలుత ముంబయిలోని లోఖండ్‌వాల్‌లోని ఆమె నివాసానికి తరలిస్తారు. ఆ తర్వాత అక్కడి నుంచి మహబూబ్ స్టూడియోకి తరలిస్తారు. సినీ ప్రముఖులు, అభిమానుల నివాళుల అనంతరం అంతిమయాత్ర ప్రారంభం కానుంది. పవన్‌హన్స్ స్మశానవాటికలో అంత్యక్రియల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. తమ అభిమాన నటికి నివాళులర్పించేందుకు ఇప్పటికే వేర్వేరు రాష్ట్రాలకు చెందిన సినీ ప్రముఖులు ముంబయి చేరుకున్నారు. టబు, పరాఖాన్, మాధురీ దీక్షిత్, వెంకటేశ్, సహా సినీ పరిశ్రమకు చెందిన పలువురు అనిల్‌కపూర్ నివాసానికి వెళ్లి శ్రీదేవి మృతిపట్ల తమ సంతాపాన్ని తెలియజేశారు. మరోపక్క శ్రీదేవి అంత్యక్రియలను నిర్వహించేందుకు ముంబయిలోని ఆమె కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీదేవికి చెందిన భాగ్య బంగ్లాలో అభిమానుల సందర్శనార్థం ఆమె పార్థివదేహాన్ని ఉంచనున్నారు.



సీఎంని కలిసిన 13 జిల్లాల గిరిజన ప్రతినిధులు

విజయవాడ, సూర్య బ్యూరో : ఏపి గిరిజన సంఘాల జెఏసి రాష్ట్ర కమిటీ, 13 జిల్లాల గిరిజనుల యొక్క ప్రతినిధులు సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబును కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంద జేశారు. ఏపి జిఏస్ జెఏసి రాష్ట్ర అధ్యక్షులు పాలకీర్తి రవి మాట్లాడుతూ ఏపిలో 13 జిల్లాలో వున్నటువంటి గిరిజనుల స్థితిగతులపై వారికి వున్న సమస్యలపై, ఇతర కులాలను తెగలలో (బోయ, మత్స్యకార) వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలనే ప్రతిపాదనను విరమించుకొని రాష్ట్రంలో వున్న గిరి జనుల యొక్క సమస్యలను పరిగణలోనికి తీసుకోవాలని జెఏసి తరవున సీఎంని కోరినట్లు తెలిపారు. గిరిజనులకు ఆర్ధికంగా, రాజకీయంగా ఎదుగుదలలో జాప్యం జరుగుతుందని తెలిపారు.

కొన్ని కులాలకు కార్పొరేషన్లు, ఛైర్మన్లను నియమించి వారి అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారు కానీ ఈ రాష్ట్రంలో 35 తెగల 40 లక్షల గిరిజనులకు మాత్రం కార్పొరేషన్ లేకుండా ఛైర్మన్ను నియమించకుండా అధికార పరిపాలన నియమించడం వలన గిరిజనులకు సంక్షేమ ఫలాలలో పూర్తిగా అన్యాయం జరుగుతుందన్నారు. ఏజన్సీ, నాన్ ఏజన్సీ ప్రాంతాలలో కనీస వసతులు, మౌళిక సదుపాయాలు విద్య, వైద్యం తదితర సౌకర్యాలు లేక దుర్భరమైన జీవితాలను ఇప్పటికి గడుపుతున్నారన్నారు. న్యాయపరమైన కమిటీలు వేసి గిరిజనుల స్థితిగతులను అధ్యయనం చేసి గిరిజనులకు న్యాయం చేయడంతోపాటు గిరిజన భవనాల నిర్మాణం, బ్యాక్‌లాగ్‌పోస్ట్‌ల భర్తీ, పక్కాగృహాలు తదితర డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్సీ ఉయ్యాల శ్యామల, నాయకులు ఐ.బాబూరావు, ఎం.పేల్, కె.లక్ష్మణ్ తదితరులు సీఎంను కలిసిన వారిలో వున్నారు.

వ్యవసాయానికి 'ఉపాధి' అనుసంధానం

- రైతులందరిని సంఘటిత శక్తిగా రూపుదిద్దాలి
- ఉపాధి హామి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి
- పార్లమెంటులో ఎంపిలు రైతుల పక్షాన పోరాడాలి
- రైతాంగానికి తెలంగాణ రైతు సమన్వయ సమితిలే నాయకత్వం వహించాలి
- రైతు ఆత్మహత్యల దుస్థితికి బిజెపి, కాంగ్రెస్ పార్టీలే కారణం
- సమైక్య పాలనలో 75 వేల చెరువులు ధ్వంసం
- కాళేశ్వరం నీళ్లు వస్తే వర్షాల కోసం చూడాల్సిన అవసరం లేదు
- అన్నదాతల పెట్టుబడి పథకానికి రూ. 12 వేల కోట్లు మంజూరు
- రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు



కరీంనగర్, సూర్యప్రతినిధి : రైతు అవసరాలు తీర్చడమే రైతు సమన్వయ సమితుల ప్రధాన విదులని, రైతును రాజు చేయడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్య మని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. సోమవారం అంబేద్కర్ స్టేడియంలో జరిగిన రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సులో ముఖ్యమంత్రి కీలక ఉపన్యాసం చేశారు. ఈ సంద ర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వ్యక్తిగత ఏమీ సాధించలేమని, సమిష్టిగా ఉంటేనే కఠిన ప్రయత్నాలు కూడా సులభతరం అవుతాయని అన్నారు. బంగారు తెలంగాణ సాధనకు పాడిపంట సమృద్దిగా ఉండాలని, కూడు, గుడ్డ, పాడి పంటలతో తెలంగాణ అన్నదాత కష్టంతో అందరు సుభిక్షంగా ఉండడమే బంగారు తెలంగాణ తొలి మెట్టు అని ముఖ్యమంత్రి అన్నారు. రైతుల అప్పులు చేయకుండా ఉండాలని, నకిలి విత్తనాల భారినపడవద్దని, వరి పంటలకు కనీస మద్దతు ధర కల్పించే విధంగా అసంఘిటిత రైతాంగాన్ని సంఘటిత పర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు సమన్వయ సమితుల పక్రియకు శ్రీకారం చుట్టిందని అన్నారు. రైతాంగాన్ని అన్ని రంగలలో అభివృద్ధి పరచడానికి నియంత్రిత పద్దితిలో పని చేయాల్సిన అవసరముదని అన్నారు. దేశ రైతాంగానికి జరుగు తున్న నష్టాన్ని తెలంగాణ ప్రభుత్వం సహించబోదని భవిష్యత్తులో తెలంగాణ రైతు సమన్వయ సమితులే నాయకత్వ భాధ్యతలు చేపట్టనున్నాయని సిఎం కెసిఆర్ అన్నారు. సమైక్య రాష్ట్రంలో సాగునీటి రంగంలో రాష్ట్రం ఎంతగానో నష్టపోయిందని, సమైక్యపాలనలో తెలంగాణలోని 75వేల చెరువులు ధ్వంసం అయ్యాయమిన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంతో పాటు రాష్ట్రంలో రైతు ఆత్మహత్యల దుస్థితికి బిజెపి, కాంగ్రెస్ పార్టీలే కారణం అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో జల వనరులను అభివృద్ది పరిచే క్రమంలో చిన్న, మధ్యతరహా, భారీ నీటి ప్రాజెక్టులను చేపట్టామని ముఖ్యమంత్రి తెలి పారు. నిజాంకాలంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులను, జలశయాలను జల కళలతో సంతరించుకునే విధంగా మిషన్‌కాకతీయ ద్వారా బృహత్తర పథకాన్ని చేపట్టామన్నారు. ఈ పథకం ద్వారా చెరువులలో పూడిక తీసిన మట్టిని రైతులు స్వయంగా తమ పొలాలకు తరలిస్తున్నారు. రాష్ట్రంలో భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలలో భాగంగా కాళేశ్వరం, సీతా రామ, దేవాదుల, నెట్టెంపాడు, ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగు తున్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కరీంనగర్ జిల్లాతో పాటు వరంగల్ జిల్లాలో 95 శాతం 365 రోజులు రెండు పంటలకు సాగునీటి సౌకర్యం కలుగుతుందని సీఎం తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ సంవత్సరమే మిడ్‌మానేరు నీళ్లు రావాలని, మిడ్‌మానేరు,లోయర్ మానేరు కింద 90 కి.మి వరకు చెక్ డ్యాంలను మంజురు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. భవిష్య త్తులో తెలంగాణాలో ఒక్క సెకను విద్యుతు కోత ఉందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హామి ఇచ్చారు. జాతీయ ఉపాధి హామి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని నేడు జరిగిన ఉత్తర తెలంగాణ 17 జిల్లాల ప్రాంతీయ సమావేశంలో ముఖ్యమంత్రి ఏకగ్రీవంగా చేసిన తీర్మానాన్ని ఆమోదించారు. దీనిపై పలు మార్లు ప్రధానమంత్రి తోపాటు సంబంధిత కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అయినప్పటికి కేంద్ర ప్రభుత్వం మెండివైఖరి అవలంభిస్తుందని ముఖ్యమంత్రి కెసిఆర్ తెలిపారు.

రాష్ట్ర ఆహార అనుగుణంగా మనమే ఉత్పత్తి చేసుకనే విధంగా శాస్త్రవేత్తల నిర్ణయం ప్రకారం వ్యవసాయం, వాతావరణ పరిస్థితుల ఆధారంగా, నేల స్వభావం ఆధారంగా క్రాప్ కాలనీల ద్వారా సాగు చేసుకునేందుకు ప్రణాళిక లను రూపొందిస్తున్నట్లు తెలిపారు. రైతాంగాన్ని సంఘటిత పరిచే దిశలో రైతులు నియంత్రిత పద్దతిని అవర్చుకోవాలని, పత్తి, వరి, మొక్కజొన్న పంటలు మన ప్రధాన పంటలని, దీనితోపాటు 12 లక్షల ఎకరాలలో పండ్ల తోటలో సాగు జరుగుతుందని అన్నారు.

దీనితోపాటు మ్యుటేషన్ అధికారం కూడా తహసిల్దార్లకే కల్పిస్తున్నామన్నారు. కేవలం గంట వ్యవధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి ధరణి వెబ్‌సైట్‌లో ఉండే విధంగా విప్లవాత్మకమైన పక్రియను చేపడుతున్నామన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో శరవేగంగా ముందుకు తీసుకు వెళ్లెందుకు ప్రభుత్వం అధికారులు, ఉద్యోగులు అహర్నిశలు అంకిత భావంలో అత్యంత వేగంతో పనిచేస్తున్నారని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. రైతులకు ఎకరానికి రూ.8వేలు అందించడం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని అన్నారు. రైతులను సంఘటిత పరిచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి లో సమితులను ఏర్పాటు చేసి వారి ద్వారా గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రాంతీయ అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ అవగాహన సదస్సులో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, శాసన సభాపతి సిరికొండ మధుసుద నాచారి, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటెల రాజేందర్, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇందకరణరెడ్డి, రాష్ట్రరోడ్డు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, సీఎం కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి స్మితాసబర్వాల్, జిల్లా కలెక్టర్ సర్పరాజ్ ఆహ్మద్, ట్రైని కలెక్టర్ ప్రావీణ్య, నగరపాలక సంస్థ కమిషనర్ శశాంక, జాయింట్ కలెక్టర్ బద్రి శ్రీనివాస్, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్య క్షులు గుత్తా సుఖేందర్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్‌కుమార్, కవిత, ఏ. సీతారంనాయక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జి. నగేష్, జడ్పి ఛైర్‌పర్సన్ తుల ఉమ, ప్రభుత్వ చిఫ్ విఫ్ కొప్పుల ఈశ్వర్, సాంస్కృతిక సారధి ఛైర్మేన్ రసమయి బాలకిషన్, ఐడిసి ఛైర్మన్ ఈదశంకర్‌రెడ్డి, రాష్ట్ర విత్తనా భివృద్ధి సంస్థ ఛైర్మేన్ కె. కోటేశ్వర్‌రావు, రాష్ట్ర కెడిసిసి బ్యాంకు కొండురి రవిందర్‌రావు, శాసన మండలి ఛైర్మేన్ సభ్యులు భాను ప్రసాద్, సుధాకర్, నారదాసు లక్ష్మణ్ రావు, కరీంనగర్, చొప్ప దండి శాసన సభ్యులు గంగుల కమలాకర్, బిడిగె శోభ, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి సి. పార్ధసారధి, వ్యవసాయ పరిశోధన యూనివర్సిటి వైస్ చాన్సలర్ ప్రవిణ్, వ్యవసాయశాఖ కమీషనర్ జగన్మోహన్, నగరమేయర్ రవీందర్‌సింగ్, 17 జిల్లాలకు సంబంధించిన శాసన మండలి శాసన సభ్యులు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్లు, మార్కేట్ కమిటి ఛైర్మేన్లు, సమన్వయ సమితి సమన్వయ కర్తలు పాల్గోన్నారు.

విజయవాడలో అక్షరాభ్యాస మహోత్సవం



విజయవాడ, సూర్య బ్యూరో : లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ వారి ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు లయన్ ఎ. బాల సుబ్రహ్మణ్యం పర్య వేక్షణలో సోమవారం నగరం లోని భారతీ విద్యా నికేతన్ పాఠశాల నందు సుమారు 50 మంది పేద విద్యార్థినీ విద్యా ర్థులకు అక్షరాభ్యాస మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా అధ్యక్షులు మాట్లాడుతూ గత 10 సంవత్స రాలుగా తమ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పాల్గొన్న విద్యార్ధులకు పలకలు, పుస్తకాలతోపాటు రెండు జతల యూనిఫామ్స్ కూడా ఉచితంగా అందజేస్తున్నా మన్నారు. అక్షరాభ్యాసమునకు కుల, మత, ప్రాంత, వర్గ భేదాలు లేవని, ఇది భారతీయ సాంప్రదాయమనీ, విద్యార్థి జ్ఞాన సముపార్జనకు తొలిమెట్టు కాబట్టి, తల్లిదండ్రులు, గురువులు, దైవం యొక్క అనుగ్రహం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. విద్యార్థు లందరూ చక్కని విద్యాభ్యాసం కావించి మంచి పౌరులుగా సమాజానికి సేవ చేస్తూ, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చేలా ఎదగాలని అభిలషిం చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ఈశ్వరరావు మాట్లాడుతూ తండ్రి చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయాలని భారతీయ ధర్మం ప్రభోదిస్తుందని, క్రమశిక్షణ, రుజువర్తన విద్యార్ధి దశ నుండే తల్లి దండ్రులు, గురువులు విద్యార్థులకు నేర్పించాలని దానికి మానవునికి జరిపే షోడశ కర్మలతో విద్యా భ్యాసం ముఖ్యమైన దన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ వెంపటావు శంకర్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు తెలుగు యువశక్తి శ్రీదేవి మృతికి సంతాపం



విజయవాడ, సూర్య బ్యూరో : సినీ నిర్మాత, తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి శ్రీదేవి మరణానికి తన ప్రగాఢ సంతాపంను వారి కుటుంబ సభ్యులకు తెలువుతూ శ్రీదేవి కుటుంబ సభ్యులతో తన కున్న పరిచయంను ఒక ప్రకటనలో తెలి పారు. శ్రీదేవి కాంగ్రెస్ వాది అన్నారు. శ్రీదేవిని చిత్ర పరిశ్రమకు కాంగ్రెస్ ముఖ్యమంత్రి కామరాజ్ నాడర్ కారణమని శ్రీదేవి తండ్రి అయ్యప్పరెడ్డి, వారి కుటుంబసభ్యులు కాంగ్రెస్ వాదులని, 1985లో శివకాశి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో రాజీవ్ గాంధీ కోర్కె ప్రకారం అయ్యప్పరెడ్డి పోటీ చేసినారని అప్పుడు శ్రీదేవి రాజీవ్ గాంధీని కలవటం జరిగిందని, దాదావు 10 రోజులు శివకాశినందు వీధి వీధుల్లో తిరిగి శ్రీదేవి వారి తండ్రి విజయం కొరకు పని చేయడం జరిగిందని, ఆ ఎన్నికల కొరకు ప్రచార ఇబ్బందులు పడుతుంటే మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు వద్దనున్న, ఆయన తయారు చేసిన ఇందిరా విజయ రథం ను వారితో పంపటం జరిగిందని, తెలుగువారు అధికంగాఉన్న ఆ ప్రాంతాల్లో శ్రీదేవి తమిళ్, తెలుగు భాషల్లో ఇందిర విజయ రథంపై ప్రచారం చేసిందని, అప్పుడు వారి తండ్రి దాదావు మూడు వేల ఓట్లతో పరాజయం పొందాడని, అప్పుడు నుంచి తరచు వారి కుటుంబసభ్యులను, వారి బావ హీరోయిన్ మహే శ్వరి తండ్రి మోహన్‌రెడ్డి తిరుపతికి చెందిన వారు, శ్రీదేవితోపాటు మహేశ్వరి తండ్రి కుటుంబ సభ్యు లందరూ ఒకే ఇంట్లో ఉండేవారని తరుచుగా మోహన్ రెడ్డిని కలుసు కొనుటకు శ్రీదేవి ఇంటికెళ్లే వారమని కలిసినవ్పుడు శ్రీదేవి ఇంట్లో ఉంటే మాత్రం నవ్వు తూ వచ్చి పలకరించే దన్నారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఆంక్షలు



ఖమ్మం–సూర్యబ్యూరో : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఆంక్షలపై విపక్షాలు, రైతు సంఘాలు భగ్గుమంటున్నాయి. పోలీస్ పర్మిషన్ లేకుండా మార్కెట్‌లోకి నో ఎంట్రీ అంటు కొత్త నిబంధనలు ఏ రైతుల మేలుకోసమే చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్య రైతులను నిలువున దోచుకునేందుకేననే విమర్శల దాడి పెరిగింది.కేవలం వ్యాపారులకు కొమ్ముకాచేందుకు ప్రభుత్వం పడరాని పాట్లు పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. చివరకు విలేకర్లను కూడా లోనకు వెళ్ళకుండా నిరోదించాలనే ప్రయత్నాలకు పోలీసులు పదును పెట్టారు. ప్రజల ముఖ్యంగా రైతల గొంతునొకేందుకు జరుగుతున్న చర్యలపై పెద్ద ఎత్తున ప్రతిఘటించేందుకు విపక్షాలు సిద్దమౌతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పెద్ద మార్కెట్లలో ఖమ్మం ఒకటి. ఖమ్మంకు ఖమ్మం జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల ఉన్న మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, జిల్లాల నుంచి పంట ఉత్పత్తులు వస్తాయి. సీజన్ బట్టి ఆయా పంటలు దండిగా రావటం జరుగుతుంది. గత సంవత్సరం కూడా మిర్చి మార్కెట్‌లో ధరల విషయంలో రైతులు భగ్గుమన్నారు. జెండాపాటకు మిగతా లాట్లకొనుగొలుకు పొంతన లేకపోవటంపై ఉగ్రరూపం దాల్చారు. మార్కెట్‌కార్యాలయంపై దాడి చేశారు. దీంతో దాడి చేసిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారికి బేడిలు వేసి ఖమ్మం నగర వీధుల్లో తీసుకొని పోయారు. ముఖ్యమంత్రి స్వయంగా వారు రైతులే కాదని తీవ్రవాదులు, సంఘ వ్యతిరేక శక్తులని సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. పైగా సత్తుపల్లి శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య దాడి చేయించారని కూడా చెప్పారు. ఈ సంవత్సరం కూడా ఖమ్మం మార్కెట్‌లో సెమ్ ఇదే సీన్ రీపీట్ అవుతుంది. మొన్నటి దాకా మార్కెట్‌కు కందులు వచ్చాయి. వాటి ధరను తగ్గించి కొనుగొలు చేయటంపై రైతుల్లో నిరసన వ్యక్తం అయింది. దీన్ని గమనించిన వ్యాపారులు కొంత పెంచి కొనుగొలు చేసినప్పటికి రైతులకు మాత్రం పెట్టబడి ఖర్చులు రావటమై గగనమై పోయింది. మూడు రోజుల క్రింతం ఖమ్మం వ్యవసాయమార్కెట్‌కు మిర్చి విఫరీతంగా వచ్చింది. ఒక్కరోజునే 65వేల బస్తా మిర్చి వచ్చిందని అంచనా. దీన్ని గమనించిన వ్యాపారులు సిండికేటుగా ఎర్పడి ధరను అమాంతం తగ్గించారు. దీంతో రైతులు వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారులు సిండికేట్ అయిన విషయాన్ని గమనించిన రైతులకు అండ గా ప్రతిపక్షాలకు చెందిన నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు వచ్చారు. విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు సైతం మార్కెట్‌కు చేరుకుని రైతలకు జరుగుతున్న అన్యాయంపై ఆరా తీశారు. రైతులు ఆగ్రహంగా ఉన్నారన్న విషయాన్ని గమనించిన మార్కెట్ అధికారులు పోలీసు అధికారులకు సమాచారం అందించారు. ఖమ్మం డిసిపి సురేష్‌కుమార్, ఖమ్మం రూరల్‌ఎసిపి ఎన్. నరేష్‌రెడ్డి హుటాహుటిన మార్కెట్‌కు చేరుకున్నారు. ఉదయం మార్కెట్‌లో మిర్చికి జెండా పాట నిర్వహించిన వ్యాపారులు కింటా మిర్చికి రు.. 9700గా రేటు నిర్ణయించారు. గత సంవత్సరం ఇదే సీజన్‌లో మిర్చి రేటు 10వేల నుంచి 21500 రూపాయాల వరకు పలికింది. ఈ సంత్సరం ఇదే సీజన్‌లో ఎందుకు తగ్గుతుందనే చర్చ అప్పటికే ప్రారంభమైంది. జెండా పాట తరువాత రేటు 6500రూపాయాలకు ఒక్కసారిగా పడిపోయింది. దీంతో రైతులు తె ల్లమొఖం వేశారు. తెచ్చిన మిర్చి తిరిగి తీసుకుని పోలేక అప్పుల భాద గుర్తుకు వచ్చి కక్కలేక మింగలేక ఉన్నారు. ఒకరికి ఒకరు రేటుపై జరుగుతున్న అన్యాయంపై గొంతు విప్పారు. ఇదేం న్యాయమని ప్రశ్నించారు. అందరు కలిసి మార్కెట్ ప్రధాన గేటుకు తాళం వేసి ఆంధోళనకు దిగారు. రైతుల ఆగ్రహన్ని గమనించిన వ్యాపారులు ఒక్కరుగా మార్కెట్ నుంచి నెమ్మదిగా జారుకున్నారు. ఇక ఆపై పోలీసుల రంగ ప్రవేశం యుద్దవాతావరణం , ప్రతిపక్షాలు , రైతుసంఘాలు అక్కడకు చేరుకున్నాయి. అధికారులు, పోలీసులు చేరుకోవటంతో ఏమి జరుగుతుందో ననే ఆందోళన మొదలైంది. చివరకు వ్యాపారలను పలిపించి రైతులకు న్యాయమైన ధర చెల్లించే విధంగా చర్చలు జరిపారు. ఒక సందర్భంలో క్వింటాల్‌కు 8900 రూపాయాలకు మించి ధర పెట్టలేమని వ్యాపారులు చెప్పారు.

రెవిన్యూ, పోలీసు అధికారుల మధ్యవర్తిత్వంతో చివరకు 9100 క్వింటాల్‌కు పెట్టేందుకు సమ్మతించటంతో కొనుగొలు మధ్నాహ్నం గాని ప్రారంభం కాలేదు. మార్కెట్‌లో జరుగుతున్న గొడవలకు రేటు విషయంలో జరుగుతున్న వ్యత్యాసం,వ్యాపారుల సిండికేట్ అని గుర్తించినప్పటికి ప్రతిపక్షాలు, రైతు సంఘాలు, మీడియాపై ఆంక్షాలు విధించేలనే యోచన చేయటం దుర్మార్గమైన చర్యగా ప్రతిపక్షా పార్టీలు పేర్కొంటున్నాయి. రైతులకు తాము అండగా ఉన్నప్పటికి వ్యాపారులు దోపిడికి పాల్పడుతున్నారని అసలు మార్కెట్‌లోకి వెళ్లకుండా ఆంక్షలు విధంచటం అంటే ప్రభుత్వం వ్యాపారులకు అండగా ఉండేందుకే నని వారు అంటున్నారు. పత్తి సీజన్‌లో కూడా ఇదే విధంగా వ్యాపారులు కుమ్మక్కైనా పంటించుకోని పోలీసు, రెవిన్యూ అధికారులు తమను మాత్రం వెళ్ల కుండా ఆంక్షలు విధంచటంపై భగ్గుమంటున్నారు.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి : రఘువీరా



విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ఎపి పునర్వ్య వస్థీకరణ చట్టం 2014 లోని అంశాల అమలులో కేంద్ర ప్రభు త్వం చేస్తున్న అన్యాయానికి నిరసనగా మార్చిలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు దూరంగా వుండి కేంద్రంపైన వత్తిడి పెంచాలని ఏపిసిసి అధ్యక్షులు ఎన్. రఘువీరా రెడ్డి అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అంద చేసిన వినతిపత్రంలో కోరినట్లు ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంపట్ల కేంద్రం చూవుతున్న నిర్లక్ష్యాన్ని, వివక్షను తీవ్రంగా నిరసిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రయో జనాల విషయంలో కేంద్రంతో రాజీలేకుండా పోరాడాలని మీ టీడీపీ చిత్తశుద్ధి గా భావిస్తుంటే మార్చిలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు దూరంగా వుండి కేంద్రంపైన వత్తిడి తీవ్రతరం చేయాలని రాష్ట్ర ప్రజల తరవున కోరుతున్నా మన్నారు.

జగన్మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నాయకులు

ఎపికి ప్రత్యేక హోదా, ఎపి పునర్వవస్థీకరణ చట్టం2014లోని అంశాల అమలులో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి నిరసనగా మార్చిలో జరగ నున్న రాజ్యసభ ఎన్నికలకు మీ పార్టీ దూరంగా వుండి కేంద్రంపైన వత్తిడి పెంచా లని ప్రతిపక్ష నాయకులు జగన్మోహన్‌రెడ్డికి ఏపిసిసి అధ్యక్షులు ఎన్. రఘువీరా రెడ్డి సోమవారం వినతిపత్రం అందజేసినట్లు ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో రాజీలేకుండా పోరాడాలని మీ పార్టీ చిత్తశుద్ధిగా భావిస్తుంటే మార్చిలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు దూరంగా వుండి కేంద్రంపైన వత్తిడి తీవ్రతరం చేయాలని రాష్ట్ర ప్రజల తరవున కోరుతున్నామన్నారు.

వికలాంగులకు ట్రైసైకిల్ అందచేత

ట్రై సైకిల్ కొరకు జనహితలో నమోదు చేసుకున్నా పెన్‌పహాడ్ మండలం గాజుల మల్కపురం గ్రామానికి చెందిన భూక్య సతీష్‌కి జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్ చేతుల మీదుగా స్త్రి శిశు సంక్షేమ అధికారి మున్నయ్య వికలాంగునికి ట్రై సైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ డి. సంజీవరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఇండ్రస్ట్రియల్ జీఎం బాబు రావు, పౌర సరఫరాల అధికారిని అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని, ఎస్సీ సంక్షేమ అధికారి దయానందరాణి, మార్కెటింగ్ అధికారి రాంపతి, సర్వే, లాండ్ రికార్డు శాఖ ఏడి శ్రీనివాసులు, మైనారిటి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఏఒ ప్రద్యుమ్న తదితర శాఖ అధికారులు తదితరులు పాల్గోన్నారు.

టిడిపి, బిజెపిలకు రాజకీయ పార్టీలుగా కొనసాగే అర్హత లేదు : ఏపిసిసి



విజయవాడ, సూర్య బ్యూరో : ఏపికి ప్రత్యేక తరగతి హోదా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్య క్షులు ఎన్. రఘు వీరారెడ్డి అధ్వర్యంలో కాగాడాల నిరసన ప్రద ర్శన, ర్యాలీ నిర్వహిం చారు. అనంత రం మనవహారం జరిగింది. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ప్రజల కోరిక మేరకు టిడిపి, బిజెపి పార్టీలను రద్దు చేయాలని ఎలక్షన్ కమిషన్‌కు ఢిల్లీలో ఫిర్యాదు చేయన్నట్లు తెలిపారు. పార్లమెంట్‌లో నాటి ప్రధాని ఇచ్చిన హామీని, అసెంబ్లీలో చేసిన తీర్మాణాలను ఎందుకు నాలుగు సంవత్సరాలు అమలు చేయలేదని ప్రశ్నించారు. హోదా విషయంలో ఈ రోజు రాష్ట్ర ప్రజలు అందరు ఒక్కటి అయ్యారు అని హెచ్చరించారు. ఏపికి ప్రత్యేక హోదాకు కావలసిన నిధులు, రాజధానికి కావలసిన నిధులు, లోటు బడ్జెట్‌కు కావలసిన నిధులు, రైల్వే జోన్, ఉక్కు కార్మగారం, ఓడరేవు, 12 సంస్థలకు సంభంధించి 12వేల కోట్లు రూపాయలు వీటికి అన్నిటికి సంభందించి సవరణలు జరగాలని డిమాండ్ చేశారు. ఏపికి ప్రత్యేక హోదా కోసం పోరా డేందుకు అందరు కలిసి రావాలని పిలువు నిచ్చారు. ఈ ర్యాలీలో ఏపిసిసి కార్యదర్శి పొనుగుపాటి నాంచరయ్య, మస్తాన్ వల్లీ మాజీ ఎమ్మెల్యే, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ వి.గురునాధం, ప్రధాన కార్యదర్శులు మీసాల రాజేశ్వరరావు, నరహార శెట్టి నరసింహారావు, రాజీవ్ రతన్, ఆకుల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ నిమ్మల జ్యోతికా, జిల్లా, నగర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ పాలన వికారాబాద్‌కు శాపంగా మారింది



వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్ః టీఆర్ఎస్ పాలన వికారాబాద్ కు శాపంగా మారిందని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్ కుమార్ అన్నారు.సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన "ప్రజా చైతన్య యాత్ర" సాయంత్రం 7:00 గంటలకు వికారాబాద్ కు చేరుకుంది.వికారాబాద్ జిల్లా కేంద్రంలోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు.ఈ సభకు వికారాబాద్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి దాదాపు 15 వేల మంది హాజరయ్యారు.కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ పట్టణం పూర్తిగా జనసంద్రంగా మారింది.ఈ సభలు పలువురు కాంగ్రెస్ పెద్దలు మాట్లాడారు.అనంతరం టిపి సిసి అధ్యక్షులు మాట్లాడుతూ టీఆర్ఎస్ 4 ఏళ్ల పాలన వికారాబాద్ కు శాపంగా మారిందన్నారు.గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా వికారాబాద్‌కు నీళ్లు వచ్చేవని,ప్రస్తుతం టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చక ప్రాజెక్టు డి జైన్ మార్చి నీళ్లు రాకుండా చేశా రని ఆయన ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టు కు 500 కోట్లు ఖర్చు చేసి పనులు చేస్తుంటే టీఆర్ఎస్ డిజైన్ మార్చి వికారాబాద్ కు అన్యాయం చేశారన్నారు.ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు డిజైన్ కాంగ్రెస్ చేపట్టిన విధంగా ఉంటే వికారాబాద్ నీళ్లు వచ్చేవని ఆయన తెలిపారు.ప్రస్తుతం టీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా వికారాబాద్‌కు నీళ్లు తెస్తామని మళ్లీ మోసం చేస్తుందని ఆయన చెప్పారు.టీఆర్ఎస్ ప్రభుత్వం చేప ట్టిన పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు ఇప్పటివరకు టెండర్లకు పిలవ లేదని, దాన్ని బట్టి చూస్తే అర్దం అవుతుందని,టీఆర్ఎస్ వికారాబాద్ ఏ విధంగా నీళ్లు తెస్తుందోనని అని తెలిపారు.వికారాబాద్ నీళ్ల విషయం పై ప్రజలు సీఎం,మంత్రిని,ఎమ్మెల్యేను,నాయకులను నీలదీయాలని ఆయన అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులు వికారాబాద్ ను మోసం చేస్తున్నా రన్నారు. అదే విధంగా ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి వికారాబాద్ టిబి శానిటోరియం ఆసుపత్రిని మెడికల్ కళాశాల గా మారుస్తూ ఫైలు పై సంతకం చేశారని,కాని మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మెడికల్ కళాశాల వెనక్కి వెళ్లిందని ఆయన తెలిపారు.అప్పుడు సీఎం సంతకం చేసిన ఫైలు ఎక్కడి వెళ్లిందో టీఆర్ఎస్ నాయకులు ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వికారాబాద్ మెడి కల్ కళాశాల మంజూరు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.అంతే కాకుండా వికారాబాద్ ఏ ప్రాజెక్టు ద్వారా తొందరగా నీళ్లు వస్తాయో ఆలోచించి ఆ ప్రాజెక్టు ద్వారా వికారాబాద్ కు నీళ్లు తెస్తామన్నారు. టీఆర్ఎస్ నాలుగేళ్ల పాలన లో ప్రజలకు చేసిందేమి లేదన్నారు.సీఎం కేసీఆర్ రైతులకు రుణామాఫీ పేరుతో తీవ్ర అన్యాయానికి గురిచేశారని ఆయన ఆరోపించారు. సీఎం కేసీఆర్ నాలుగుదఫాలుగా చేసిన రుణామాఫీ కేవలం వడ్డీలకే సరిపోయిందన్నారు.కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల్లో అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణామాఫీ చేస్తామని ఆయన ప్రకటించారు.అంతే కాకుండా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు.తాండూర్ ప్రాంతంలో కంది బోర్డు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.అదే విధంగా డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తామన్నారు. నిరుద్యోగులకు లక్షల ఉద్యోగాలు ప్రకటిస్తామని, ఉద్యో గాలు రానివారికి నిరుద్యోగ బృతి రూ.3వేలు చెల్లించేందుకు సిద్దంగా ఉన్నా మని ఉత్తమ్ తెలిపారు.2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయామాని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సభలో కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నేత కె.జానారెడ్డి,శాసనమండలి ప్రతిపక్ష నాయకులు షబ్బీర్ అలీ,టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ మల్లు బట్టి విక్కమార్క,మాజీ మంత్రలు దానం నాగేందర్,పోన్నాల లక్ష్మయ్య,ఏ.చంద్రశేఖర్,మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డి,కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పద్మ వతి, ఎమ్మెల్సీ రంగారెడ్డి, మాజీ ఎంపి పోన్నం ప్రభాకర్,చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గ ఇంచార్జ్ పి.కార్తీక్ రెడ్డి,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు క్యామ మల్లేష్, నాయకులు మల్‌రెడ్డి రంగారెడ్డి,దీపక్ ఝూన్,బెల్యా నాయక్, కాల్వ సుజాత, వికారాబాద్,తాండూర్ మున్సిపల్ ఛైర్మెన్లు వి.సత్య నారా యణ, సునీతా సంపత్‌కుమార్, వివిధ మండలాల అధ్యక్షులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్త లుతదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న సన్నిధిలో కేంద్ర మంత్రి



సింహాచలం, సూర్య ప్రతినిధి : ప్రముఖ పుణ్యక్షేత్ర మైన శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారిని కేంద్ర సురేశ్‌ప్రభు, రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం ప్రదక్షిణ అనంతరం ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదాన్ని అందించారు. అనంతరం మీడియాతో సురేశ్‌ప్రభు మాట్లాడుతూ విశాఖలో గత రెండు రోజులుగా జరుగుతున్న పెట్టుబడుల భాగ స్వాముల సదస్సులో పాల్గొ న్నానని, అందులో భాగంగా స్వామివారిని దర్శిం చుకున్నట్లు చెప్పారు. దేశంలో ఉన్న ప్రముఖ దేవాలయాల్లో సింహాచలం అప్పన్న స్వామి దేవాలయం రెండో దని, స్వామివారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అలాగే పద్మనాభ మండలం పాండ్రంగి గ్రామాన్ని దత్తత తీసుకోవడం తీసుకున్నానని, అక్కడ అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపనలు చేయనున్నట్లు తెలిపారు.

సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలి

కలెక్టర్ కె. సురేంద్రమోహన్



సూర్యాపేట ప్రతినిధి, మేజర్‌న్యూస్: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలను అధికారులు నిర్లక్ష్యం వహించరాదని, వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించే విదంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాలనుండి ప్రజలు వారి సమస్యలను తెలియజేసేందుకు కార్యలయానికి వస్తుంటారని ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను అధికారులు నిర్లక్షం చేయాకుండా పరిష్కరించాలని తెలిపారు.

హోదా లేకున్నా భారీగా పరిశ్రమలు : బిజెపి



విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్రంలో రూ.18 లక్షల కోట్లతో పరిశ్ర మలు ఏర్పాటుకానున్నాయనే ముఖ్యమంత్రి ప్రకటనతో ప్రత్యేకహోదా లేకున్నా పరిశ్రమలు ఏర్పాటవుతాయని తేటతెల్లమైందని భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కమిటి ఛైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు పేర్కొ న్నారు. రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేకహోదా లేకపోవడం వల్ల పరిశ్రమలు రావడంలేదనే ఆరోపణలో నిజం లేదన్నారు. ఇప్పటి వరకు మూడుసార్లు విశాలో నిర్వహించిన సన్‌రైజ్ భాగస్వామ్య సదస్సులో రూ.30 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఒప్పందాలు కుదిరాయని, వాటిలో 59 శాతం పెట్టుబడులు రావచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ప్రకటించిన విషయాన్ని యడ్లపాటి గుర్తుచేశారు. విభజన చట్టంలో ఉన్నవాటితో పాటు, లేనవి కూడా అమలుచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి బిజెపి ప్రత్యేక శ్రద్ధ చూవు తోందన్నారు. హోదా ఉన్న రాష్ట్రాలకు, లేని రాష్ట్రాలకు నిధుల పంపిణిలో తేడాలు ఉండరాదని, కొత్తగా ఏ రాష్ట్రానికి హోదా ఇవ్వరాదనే 14 వ ఆర్థిక సంఘం సూచనల మేరకు రాష్ట్రానికి హోదా ఇవ్వడం వీలుకాలేదని చెప్పారు. హోదాకు సమానమైన ఆర్థిక సహాయాన్ని ఇచ్చేందుకు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. రాయలసీమకు కొంత అన్యాయం జరిగిందని, ఇప్పటివరకు ఈ రాష్ట్రాన్ని పాలించిన రాయలసీమకు చెందిన ముఖ్యమంత్రులంతా ఈ విషయంలో తమను తాము ప్రశ్నించుకోవాలని కోరారు. కర్నూలులో హైకోర్టు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ల చేశారు. ఈ సమావేశంలో మీడియా రాష్ట్ర ఇన్‌ఛార్జి పి.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణల అమలు మరింత వేగవంతం


- అధికారుల ఇబ్బందులను గురించి ప్రధానంగా చర్చ
- ఉప ముఖ్యమంత్రి కె.ఇ. కృష్ణమూర్తి ప్రత్యేక దృష్టి



వెలగపూడి, సూర్య ప్రతినిధి : రెవెన్యూ శాఖ తీసుకొచ్చిన సంస్కరణల అమలు మరింత వేగవంతం చేసేందుకు ఉపముఖ్యమంత్రి (రెవెన్యూ) కే. ఈ. క్రిష్ణమూర్తి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించనున్నారు. సంస్కరణల అమలు, అధికారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గురించి ప్రధానంగా చర్చించనున్నారు. క్షేత్ర స్థాయిలో సంస్కరణల అమలులో ఎదురౌతున్న ఇబ్బందులకు సమావేశంలో పరిష్కారం కనుగొననున్నారు. విజయవాడ, ఇరిగేషన్ శాఖ కాన్ఫరెన్స్ హాల్‌లో ఫిబ్రవరి 27, 28 తేదీలలో సమావేశం జరగనుంది. సమావేశంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే శాఖల ఉన్నతాధికారులతోపాటు 13 జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జిల్లాల నుంచి ఎంపిక చేయబడిన 39 మంది తాహశీల్దార్లు మరియు 39 మంది సర్వేయర్లు సమావేశానికి హాజరుకానున్నారు.

మొదటి రోజు సమావేశంలో అనగా ఫిబ్రవరి 27న ఉదయం 9.30 నిమిషాలకు సమావేశం ప్రారంభం అవుతుంది. మధ్యాహ్నం 2 గంటల వరకు సర్వే సంబంధిత అంశాలపై జాయింట్ కలెక్టర్లు, తాహశీల్దార్లు మరియు సర్వే యర్లతో సమీక్ష నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటల నుండి రెవెన్యూ సంబంధిత అంశాలపై ఉప ముఖ్యమంత్రి జాయింట్ కలెక్టర్లతో చర్చిస్తారు. ఇందులో ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్న వారి స్థలాల క్రమబద్ధీకరణ, చుక్కల భూమి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలు తీరును గురించి అధికారులను అడిగి తెలుసు కుంటారు. అలాగే కేసులు పరిష్కారం, రాజకీయ బాధితులు, మాజీ సైనికో ద్యోగులు, స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చిన భూములను 22 రిజిస్ట్రేషన్ నిషేధిత భూముల జాబితా నుండి తొలగింపు వంటి అంశాలపై సమీక్షించ నున్నారు. రెండో రోజు ఫిబ్రవరి 28న రెవెన్యూ కార్యాలయాల్లో బయోమెట్రిక్ అటెండెన్స్ మరియు ఈ ఆఫీస్ అమలులో భాగంగా రెవెన్యూ కార్యాలయాల్లో టాయిలెట్ల నిర్మాణం, జిల్లాకి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలు పురోగతి గురించి జాయింట్ కలెక్టర్లతో ఉపముఖ్యమంత్రి చర్చిస్తారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా భూసేవ ప్రాజెక్టు అమలు, రిజిస్ట్రేషన్ నిషేధిత భూముల జాబితాను వెబ్ ల్యాండ్‌లో పొందుపర్చడం, వెబ్ ల్యాండ్ లోని భూరికార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయడం వంటి అంశాలపై ఉప ముఖ్యమంత్రి కే. ఈ. క్రిష్ణమూర్తి సమీక్షించనున్నారు.

చంద్రబాబుకు మంత్రులు, నేతల అభినందనలు



విశాఖపట్నం, సూర్య ప్రతినిధి : నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకు సోమవారం రాష్ట్ర మంత్రులు, సీనియర్ నేతలు అభినం దనలు తెలియజేశారు. సీఐఐ భాగ స్వామ్య సదస్సు ప్రాంగణంలో సీఎంను కలిసిన మంత్రులు అచ్చెన్నాయుడు, యనమల రామ కృష్ణుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, ప్రత్తిపాటి పుల్లారావు, కళా వెంకట్రావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదిత రులు పుష్పగుచ్ఛం అందించారు. రాజకీయగా ఆయన మరింత సుదీర్ఘ ప్రయా ణం చేయాలని ఆకాంక్షించారు. అటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు, విశాఖ (ఉత్తర) ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు ముఖ్యమంత్రికి శుభా కాంక్షలు తెలియ జేశారు. సదస్సు ప్రాంగణంలోనే అందుబాటులో ఉన్న మంత్రులతో చంద్రబాబు కాసేపు సమావేశమయ్యారు.

ఆ ఘనత చంద్రబాబుదే



శాసనమండలి చీఫ్ విప్ పయ్యావుల కేశవ్

అనంతపురం, సూర్య ప్రతినిధి : దశాబ్దాల తరబడి ఎండిపోయిన చెరువులకు వేసవి కాలంలో హంద్రీనీవా నీరు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కు తుందని శాసనమండలి చీఫ్ విప్ పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతవురం జిల్లా వజ్రక రూరు మండలం రాగులపాడు వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి లేదారు చెరువుకు నీటిని విడుదల చేశారు. దీనిద్వారా నాలుగు గ్రామాలు సస్యశ్యా మలం కానున్నాయి. అక్కడి నుంచి పామిడి మండలంలోని చెరువులకు నీరు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నీరు లేక ఎండిపోయిన చెరువులకు ఇప్పుడు నీరు విడుదల చేయడంతో రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం రైతులకిచ్చే ఉగాది కానుక ఇదేనన్నారు. దశల వారీగా అన్ని చెరువులకు నీరందించే ప్రణాళికలు పూర్తి చేసినట్లు కేశవ్ స్పష్టం చేశారు.

మంగళగిరిలో కదం తొక్కిన ఎర్రదండు



మంగళగిరి, సూర్య ప్రతినిధి : పోరాటాల పురిటిగడ్డ మంగళగిరిలో ఎర్రదండు కదం తొక్కింది. భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ జిల్లా 24 వ మహాసభల సందర్భంగా మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్ హీరా ఇస్లామిక్ పాఠశాల ఆవరణలో సోమవార బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో సీపీఐ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బంగ్లావద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ గౌతమ బుద్ధా రోడ్ మీదుగా అంబేద్కర్ సెంటర్, గాలి గోపురం, మెయిన్ బజార్, మిద్దె సెంటర్ మీదుగా పాత బస్టాండ్ సెంటర్‌లోని హీరా ఇస్లామిక్ పాఠశాల మైదానంలోని సభా ప్రాంగ ణానికి చేరుకుంది. సుమారు రెండు గంట పాటు జరిగిన ర్యాలీకి అడుగడు గునా ప్రజలు నీరాజనాలు పలికారు. దారి పొడవునా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు హోరెత్తాయి. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వర రావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, గుంటూరు నగర కార్య దర్శి మాల్యాద్రి, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్య దర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, బొర్రా మల్లిఖార్జునరావు, కుక్కమళ్ల నాగేశ్వరరావు, మునిసి పల్ వైస్ చైర్మన్ నందబ్రహ్మేశ్వరరావు, కౌన్సిలర్ ఉయ్యాల సత్యనారాయణ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పతేవరపు శివ తదితరులు ర్యాలీలో అగ్ర భాగాన నడువగా పెద్దసంఖ్యలో ఎర్రదండు వారిని అనుసరిస్తూ ర్యాలీలో భాగస్వాములయ్యారు. దాదాపు17 ఏళ్ళ తరువాత మంగళగిరిలో నిర్వహించిన జిల్లా సీపీఐ మహాసభల విజయవంతంలో భాగంగా నిర్వహించిన ర్యాలీతో నేతలు తమ సత్తాను చాటుకున్నారు.

ఎరుపెక్కిన మంగళగిరి

ఎర్ర చొక్కాలతో, రెడ్‌షర్ట్స్ వాలంటీర్ల తో నిర్వహించిన సీపీఐ ర్యాలీతో మంగళగిరి పట్టణం ఎరుపెక్కింది. కమ్యూనిస్టుల కంచుకోటకు మారుపేరుగా నిలుస్తున్న పట్టణం ఎరుపురంగుతో పులకరించింది. ఎర్రచీరలు ధరించిన మహిళలు ర్యాలీ నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. సుమారు రెండు గంటలపాటు ర్యాలీ కొనసాగింది. మహాసభ ఆరంభానికి ముందు ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన గీతాలు అందరినీ ఉత్తేజపరిచాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని మోడీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానా లపై పాడిన పాటలు ఆలోచింపజేశాయి. ఆద్యంతం ఆటాపాటలతో మహాసభ హోరెత్తింది.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ బి. ఉదయలక్ష్మి



విజయవాడ, సూర్య ప్రతినిధి : రాష్ట్రంలో ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు బోర్డు కమి షనర్ బి. ఉదయలక్ష్మి తెలిపారు. 13 జిల్లాల్లోని 1,423 కేంద్రాల్లో 10 లక్షల మంది విద్యార్థులు పరీక్ష లు రాస్తున్నట్టు తెలిపారు. ఈసారి సీసీ కెమెరాల పర్య వేక్షణలో పరీక్ష నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి 10 కేంద్రాలకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. జంబ్లింగ్ విధానంలో విద్యార్థులకు పరీక్షా కేంద్రాలు కేటాయించి నందున ఐపీఈ లొకేషన్ సెంటర్ పేరుతో యాప్ రూపొందించినట్టు పేర్కొన్నారు. నిర్దేశిత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రం లోకి అనుమతి ఉండదని చెప్పారు.

భూకబ్జాలకు అంతమెప్పుడు : సీపీఐ



విజయవాడ, సూర్య బ్యూరో : భూకబ్జాల పర్వం పరా కాష్టకు చేరుకున్న తరుణంలో ఆత్మరక్షణలో పడిపోయిన సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా దెయ్యాలు వేదాలు వల్లిస్తున్న చందంగా అపర హరిశ్చంద్రుడిలా మాట్లా డుతూ కబ్జాల బాగోతాన్ని కప్పివుచ్చుకునేందుకు యత్నిస్తున్నారని, తనకు తానే క్లీన్‌చిట్ ఇచ్చుకోవడాన్ని సిపిఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన నేడొక ప్రకటన చేస్తూ భూకబ్జాల వ్యవహారంలో తనకు కానీ, తన కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదని చెవ్పుకొస్తున్న ఉమా స్వాతంత్ర్య సమరయోధుని భూమి కబ్జా చేసిన ఘటనలో ఆయన సతీమణి బొండా సుజాతపై సిఐడి అధికారులు విచారణ అనంతరం ఎ8 ముద్దాయిగా కేసు నమోదు చేయడాన్ని మరిచారా? అని ప్రశ్నించారు. సిఐడి అధికారుల విచారణను తాత్కాలికంగా నిలువుదల చేయించేందుకు హైకోర్టు నుండి స్టే ఎందుకు తెచ్చుకున్నారని, ఈ ఉదంతంతోనే ఆయన ఎంత సచ్ఛీలుడో అర్థమౌతుందని పేర్కొన్నారు. ఘంట సాల సంగీత కళాశాలను రాజ కీయ అడ్డాగా మార్చుకోవాలని అనుకో వడం, కండ్రికలో రూ. 20 కోట్లు విలు వైన కార్పొరేషన్ స్థలాన్ని కాజే యాలని ప్రయ త్నించడం, బుడమేరు స్థలాలను యథేచ్ఛగా తెగనమ్ముకుం టున్న వారికి అండదండలందిం చడం నిజం కాదా? అన్నారు. పాయకావురం, సత్యనారా యణవురం కార్పొరేటర్లను బినామీలుగా చేసుకుని అవినీతి దందా సాగించడం లేదా అని ప్రశ్నించారు. కబ్జాల బాగోతం తారాస్థాయికి చేరుకున్న తరువాత ప్రభుత్వాధి నేతల మౌఖిక ఆదేశాలతో జిల్లా అధికార యంత్రాంగం దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టిం దని ఆరోపించారు. జాయింట్ కలెక్టర్ విజయ్‌కృష్ణన్ నిర్వహించిన విచారణలో ఎమ్మెల్యే అనుచరుల భూబాగోతాలు మరిన్ని వెలుగు లోకి వచ్చాయని పేర్కొన్నారు. తన అనుచరులు తప్పు చేస్తే తన కేమి సంబంధమని సెంట్రల్ ఎమ్మెల్యే చెప్పుకు రావడం విడ్డూరంగా ఉందని, తప్పు చేసే వారిని అనుచరులుగా ఎందుకు ఉంచుకున్నారని ప్రశ్నించారు. సెంట్రల్ ఎమ్మెల్యే అవినీతి, భూ దందాలపై లోకం కోడైకూస్తుంటే ఆయనేమో భూకబ్జాలు నిరూపణైతే రాజకీయ సన్యాసం చేస్తానని, తన జీవితం కడిగిన ముత్యమని చిలక పలు కులు పలకడం ఆశ్చ ర్యానికి గురి చేస్తుందని ఎద్దేవా చేశారు. తనకు తాను క్లీన్ చిట్ ఇచ్చుకుంటే సరిపోదని, భూకబ్జాలపై విచారణకు జిల్లా కలెక్టర్ నియమించిన త్రిసభ్య కమిటీచే క్లీన్‌చిట్ పొందాలని సూచించారు.

దత్తత గ్రామాన్ని సందర్శించిన సురేశ్ ప్రభు



విశాఖపట్నం, సూర్య ప్రతినిధి : స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు స్వగ్రామమైన విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి లో కేంద్ర మంత్రి సురేష్ ప్రభు సోమ వారం సతీసమేతంగా సందర్శించారు. రాష్ట్ర మంత్రులు కామినేని శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు, విశాఖ పార్ల మెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు, ఎమ్మెల్సీ మాధవ్, కోరమాండల్ ఫెర్టిలైజర్స్ ఉపాధ్యక్షులు జీవీ సుబ్బారెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు. సురేశ్ ప్రభు కేంద్ర రైల్వే శాఖా మంత్రిగా ఉన్న సమయంలో అల్లూరి స్వగ్రామం పాండ్రంగిని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. మొదటి సారిగా గ్రామానికి వచ్చిన మంత్రికి స్థానికులు పెద్దసంఖ్యలో స్వాగతం పలి కారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోరమాండల్ ఫెర్టిలైజర్స్ ఆర్థిక సహాయంతో నిర్మించిన ఉన్నత పాఠశాల, ఆర్ ఓ ప్లాంట్, డిజిటల్ తరగతి గదులను ప్రారంభించారు. అల్లూరి ఇంటిలో ఉన్న అల్లూరి సీతారామరాజు, అతని తల్లి విగ్రహాలను సందర్శిం చారు. గోస్తని నదిపై లో లెవెల్ బ్రిడ్జి నిర్మాణం, వివిధ పరిశ్రమలను సీఎస్ఆర్ నిధులతో చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. సురేశ్ ప్రభు ఆంగ్లంలో మాట్లాడగా ఎంపీ హరిబాబు ఆయన ప్రసంగాన్ని తెలుగులోకి అనువదించారు.

లోకేష్‌ను కలిసిన ఏపీ పీఆర్ ఉద్యోగ సంఘం నేతలు



గుంటూరు, సూర్య ప్రతినిధి : ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలు ప్రజలకు సకాలంలో అందే విధంగా మండల, జిల్లా పరిషత్ పాలనా వ్యవస్థను పటిష్ఠ పరచాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, మిని స్టీరి యల్ ఎంప్లాయిస్ అసోసి యేషన్ (ఏపీపీఆర్ఎంఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్ మంత్రి లోకేష్‌ను కోరారు. అసోసియేషన్ నేతలు ఉండవల్లి లోని క్యాంప్ ఆఫీస్‌లో మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందించారు. ప్రధానం గా మండల పరిషత్ కార్యాలయంలోని సూపరింటెండెంట్ పోస్టులను డిప్యూటీ ఎంపీడీవో పోస్టులుగా మార్పు చేసి గజిటెడ్ హోదా కల్పించాలన్నారు. ఎంపీ డీవో పోస్టుల్లో సూపరింటెండెంట్లకు 34 శాతం కోటా కచ్చితంగా అమలు చేయాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్‌లకు జూనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయాలని అసోసియేషన్ నాయకులు మంత్రిని కోరారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ డివిజన్, సబ్ డివిజన్‌లలోని నాన్ - టెక్నికల్ పోస్టులను జడ్పీ సీఈవోల పరిధిలో కొనసా గించాలన్నారు. అసోసియేషన్ నేతలు ఏపీజేఏసీ అధ్యక్షుడు అశోక్‌బాబుతో భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కూచిపూడి మోహనరావు, శామ్యూల్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం

తిరుపతి, సూర్య ప్రతినిధి : తిరుపతిలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో సోమవారం శ్రీ సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శ్రీరామచంద్రమూర్తి జన్మించిన వునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రతినెలా కల్యాణం నిర్వహిస్తారు. ఇందులోభాగంగా ఆలయంలోని కల్యాణమండపంలో ఉదయం 11.00 గంటలకు కల్యాణోత్సవ ఘట్టం ప్రారంభమైంది. అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న గృహస్తులకు ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేశారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు శ్రీసీత లక్ష్మణ సమేత శ్రీ కోదండరామ స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడ వీధుల్లో



ఊరేగింపు నిర్వహిస్తారు. అక్కడి నుంచి శ్రీరామచంద్ర వుష్కరిణికి తీసుకెళ్లి ఊంజల్‌సేవ చేపడతారు. ఈ కార్యక్రమంలో టిటిడి స్థానికాలయాల డిప్యూటీ ఈవో ఝాన్సీరాణి, సూపరింటెండెంట్ మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషారెడ్డి, ఆలయ అర్చకులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో విశేష ఉత్సవాలు...

శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మార్చిలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. మార్చి 3, 10, 17, 24వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీసీతారామ లక్ష్మణుల మూలవర్ల అభిషేకం, సాయంత్రం 6గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు, అనంతరం ఆలయంలో ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. భక్తులు రూ.20 చెల్లించి మూలవర్ల అభిషేకంలో పాల్గొనవచ్చు. మార్చి 2వ తేదీ పౌర్ణమి సందర్భంగా ఉదయం 9.00 గంటలకు ఆలయంలో అష్టోత్తర శతకలశాభిషేకం జరుగనుంది. భక్తులు రూ.50 చెల్లించి ఈ సేవలో పాల్గొనవచ్చు. ఈ సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీకోదండరామ స్వామివారి ఉత్సవమూర్తులను బంగారు తిరుచ్చిలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించి, శ్రీ రామచంద్ర పుష్కరిణిలో ఊంజలసేవ, ఆస్థానం నిర్వహిస్తారు. మార్చి 13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. మార్చి 16 నుండి 24 వరకు శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. మార్చి 18వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు ఉగాది ఆస్థానం, మార్చి 25 నుండి 26వ తేదీ శ్రీరామ నవమి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. మార్చి 28న రేపాకుల సుబ్బమ్మతోట ఉత్సవం నిర్వహించనున్నారు. మార్చి 29 నుండి 31వ తేదీ వరకు తెప్పోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

రహదారి పనులు అడ్డుకున్న తుళ్లూరు రైతులు




వెలగపూడి, సూర్య ప్రతినిధి : అమరావతిలోని సచివాలయం వద్ద సీఆర్‌డీఏ నిర్మిస్తున్న రహదారి పను లను అడ్డుకున్న గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెలగపూడి రైతులను పోలీసులు అరెస్టు చేశారు.

ఆదివారం అర్ధరాత్రి వెలగపూడి సచివాలయం సీఎం బ్లాకు వెనుక ఉన్న భూమిలో పరిహారం ఇవ్వ కుండా సీఆర్‌డీఏ రహదారి పనులు చేస్తోం దంటూ రైతు గద్దె మీరా ప్రసాద్ అడ్డుకున్నారు. ఆయనకు మద్దతుగా మరి కొంత మంది రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. సుమారు అరగంటకు పైగా ఆందోళన చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను తరలించే ప్రయత్నం చేశారు. దీంతో ఇరు పక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. తమ పొలంలో అన్యాయంగా రహదారి నిర్మిస్తే ఆత్మహత్య చేసుకుంటానని రైతు మీరా ప్రసాద్ హెచ్చరించారు. దీంతో పోలీసులు రైతులను బలవంతంగా పక్కకు తొలగించి పనులు కొనసాగించారు.

సంతపేట మార్కెట్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం

నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్



నెల్లూరు, సూర్య ప్రతినిధి ః నెల్లూరు కపాడిపాలెం ప్రాంతంలోని సంతపేట మార్కెట్టు అధునాతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు నగర మేయరు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. హరనాథపురంలోని ఆయన నివాసంలో స్మార్ట్ సిటీ కన్సల్టెన్సీ ప్రతినిధి శివ శరన్ మేయర్‌ను సోమవారం కలుసుకుని మార్కెట్టు నిర్మాణ ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా మేయరు మాట్లాడుతూ స్మార్టు సిటీ అభివృద్ధి నిధులు, కార్పొరేషన్ సాధారణ నిధులు సుమారు మూడు కోట్ల రూపాయలతో అన్ని సదుపాయాలున్న అధునాతన వాణిజ్య కేంద్రాన్ని నిర్మించనున్నట్లు వివరించారు. క్రింది అంతస్తుల్లో కూరగాయలూ, వస్త్రాలు, మాంసాహారం విభాగాలను విడివిడిగా నిర్మించి మిగిలిన వాటిని కార్యాలయాలూ, ఇతర వర్తక దుకాణాలకు కేటాయిస్తామని మేయరు తెలిపారు. చక్కటి నిర్మాణ ప్రణాళికతో మార్కెట్టుకు పార్కింగ్ సదుపా యం, పారిశుధ్య నిర్వహణ, సెక్యూరిటీ వ్యవస్థలను రూపొందిస్తున్నా మని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యుడు ప్రశాంత్ కిరణ్, కార్పొరేషన్ అధికారి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కోదండరామాలయానికి వెండి సింహాసనం


తిరుపతి, సూర్య ప్రతినిధి : తిరుపతిలోని శ్రీ కోదండరామాలయానికి వెండి సింహాసనాన్ని టిటిడి తయారుచేయించి సోమవారం అందజేసింది. టేకు కొయ్యతో రూపొందించిన ఆకృతిపై వెండి రేకులను అమర్చి సింహాసనాన్ని రూపొందించారు. ఇందుకోసం రూ.53 లక్షలు విలువైన 127.450 కిలోల వెండిని వినియోగించారు. తిరుపతిలోని పాత హుజుర్ ఆఫీసు ప్రాంగణంలో గల జ్యువెలరీ విభాగంలో తయారుచేసిన ఈ సింహాసనాన్ని సాయంత్రం ఆలయానికి తీసుకొచ్చి అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సీతారాముల కల్యాణం, శ్రీ రామ పట్టాభిషేకం ఉత్సవాల్లో ఈ సింహాసనాన్ని వినియోగిస్తారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోదండరామాలయ డిప్యూటీ ఈవో ఝాన్సీరాణి, జ్యువెలరీ విభాగం ఏఈవో రాజేంద్ర, ఆలయ సూపరింటెండెంట్ మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



టిటిడి పాఠశాలల్లో ముగిసిన సదాచారం తరగతులు

టిటిడి ఆధ్వర్యంలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ధార్మిక, నైతిక, మానవీయ విలువలను బోధించేందుకు ఉద్దేశించిన సదాచారం శిక్షణ తరగతులు ఈ విద్యాసంవత్సరానికి గాను సోమవారం ముగిశాయి. ఈ ఏడాది జనవరి నుండి ప్రతి సోమవారం అన్ని పాఠశాలల్లో ఈ తరగతులు నిర్వహిస్తున్నారు. శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా విద్యార్థులకు 'ఉగాది, శ్రీరామనవమి, శుభప్రద దీపిక, ధర్మపరిచయం పుస్తకాలను పంపిణీ చేశారు. తిరుపతిలోని ఎస్వీ హైస్కూల్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి ఎ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా, శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలో ఎపిక్ స్టడీస్ ప్రత్యేకాధికారి డాక్టర్ జి.దామోదరనాయుడు, కోదండరామస్వామి హైస్కూల్‌లో హెచ్‌డిపిపి కో-ఆర్డినేటర్ జి.చెన్నకేశవులునాయుడు, ఎస్వీ ఓరియంటల్ హైస్కూల్‌లో హెచ్‌డిపిపి ఏఈవో ఆర్. నాగేశ్వరరావు, తాటితోపు లోని ఎస్‌కె ఎస్ హైస్కూల్‌లో హెచ్‌డిపిపి సూపరింటెండెంట్ ఎం.ఆర్. గురునాథ్, తిరుమల లోని ఎస్వీ హైస్కూల్‌లో హెచ్‌డిపిపి కో-ఆర్డినేటర్ ఎం. మునికృష్ణయ్య పాల్గొన్నారు.

తెలంగాణ ఎంసెట్ షెడ్యూల్ విడుదల



తొలిసారి ఆన్‌లైన్‌లో ఎంసెట్
మే 2నుంచి 7వరకు పరీక్షలు
మార్చి 4నుంచి దరఖాస్తులు ప్రారంభం

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తెలంగాణ ఎంసెట్ షెడ్యూల్‌ను టీఎస్ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి, ఎంసెట్ కన్వీనర్ యాదయ్య సోమవారం విడు దల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మే నెలలో ఐదు రోజులపాటు ఎంసెట్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మే 2, 3 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ మెడికల్ (ఏఎం) పరీక్ష, మే 4, 5, 7 తేదీల్లో ఇంజనీరింగ్ పరీక్ష నిర్వహిస్తామని పాపిరెడ్డి తెలిపారు. తెలంగాణ ఎంసెట్ దరఖాస్తులకు ఏప్రిల్ 4 చివరి తేదీగా ప్రకటించారు. ఏప్రిల్ 6 నుంచి 9 వరకు తప్పుల సవరణలకు అవకాశం ఉంటుందని తెలిపారు. రూ.10వేల అపరాధ రుసుముతో ఏప్రిల్ 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు దరఖాస్తు రుసుం రూ.400, ఇతరులకు రూ.800లుగా నిర్ణయించారు. ఏప్రిల్ 20 నుంచి మే 1 వరకు హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సారి ఉర్దూలో కూడా ఎంసెట్ పరీక్ష నిర్వహిస్తామని, పరీక్ష ముగిసిన పది రోజులల్లో ఎంసెట్ ఫలితాలు విడుదల చేస్తామని పాపిరెడ్డి వెల్లడించారు.

మానసిక సమస్యలలోనూ మనమే ముందు




సరదాగా రోజులు గడిచిపోతున్నాయి, హా.. ఏముందిలే.. అనుకుంటాం, కానీ మనకు తెలియకుండానే మనం ఎంత సందిగ్ధంలో మునిగి తేలుతున్నాం అందుకే మనసుపై కేంద్రీకరణ, చేసే పనులపై ఏకాగ్రత, శారీరక వ్యాయామం, పోషకాహారం వంటివి సరైన సమయంలో, సరైన పద్ధతిలో అలవరుచుకోవాలి. అప్పుడే జీవన శైలి మారుతుంది. జీవితం బాగుంటుంది. మానసిక రుగ్మతలను నిర్లక్ష్యం చేస్తే మానసికంగా ఇబ్బందులు కలుగుతాయి. క్రమేణా అవి శారీరకంగా కూడా తీవ్ర రుగ్మతలు కలుగజేస్తాయి. అందులోనూ పరీక్షల కాలం కావటంతో విద్యార్థులపై ఇది ఎనలేని ప్రభావం చూపిస్తుంది. ఇప్పటికే తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉంచి చదువుతున్న విద్యార్థులు వత్తిళ్లకు లోనై కన్నవాళ్లకి కడుపుకోత మిగులుస్తున్నారు. అందుకే సరైన మార్పు తక్షణమే అవసరం. మేల్కోండి.

ప్రస్తుతం సమాజంలో మనుష్యులు మానసిక ఆరోగ్యం దెబ్బ తిని బాధపడుతున్నారు. దీనికి అనేక కారణాలున్నాయి. ఆధునిక సాంకేతిక పురోభివృద్ధి జరుగుతున్నా, అనేకానేక అవకాశాలు అందు బాటులోకి వస్తున్నా మనిష మాత్రం ఆనందంగా ఉండలేకపోతున్నాడు. మానసిక సమస్యలకు గురవుతున్నాడు. వీటన్నిటికీ ప్రధాన కారణం యాంత్రికమయమైపోయిన జీవనవిధానం. ప్రజలకు తమకు ఏమి కావాలనే అంశంపై స్పష్టమైన అవగాహన లేకపోవడం, అహం దెబ్బ తినడం, ఈర్ష్య, అసూయలు ఎక్కువ కావడం, లక్ష్యాలను సాధించలేకపోవడం, లైంగికపరమైన సమస్యలు, నిరాశానిస్పృహలకు గురి కావడం మొదలైన పలు అంశాలు మనిషి మానసికంగా కృంగిపోవడానికి, మానసిక సమస్యలకు గురి కావడానికి కారణమవుతున్నాయి. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రధా నంగా మానసిక ప్రశాంతతను పొందాలి. మానసిక ప్రశాంతత ద్వారా పలు మానసిక సమస్యలను నివారించుకోవచ్చు. తద్వారా శారీరక రుగ్మతలను కూడా నివారించు కోవచ్చు.

మానసిక సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ దేశంలో పెరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. మానసిక వ్యాధులకు గురవుతున్న వారిలో భారతీయులే అత్యధికంగా ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. భారత్లో ఐదు కోట్ల మంది వ్యాకులతతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. వ్యాకులత కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో అత్యధికులు భారతీయులేనని ఆ సంస్థ తెలిపింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2015లో వ్యాకులతకు గురైన వారి సంఖ్య 5 కోట్ల 66 లక్షల 75 వేల 969. ఇది దేశ జనాభాలో 4.5 శాతం. ఆందోళనాపర రుగ్మతలకు గురైన వారి సంఖ్య 3 కోట్ల 84 లక్షల 25 వేల, 93. ఇది దేశ జనాభాలో 3 శాతం. ప్రజలు అత్యధిక సంఖ్యలో మానసిక వ్యాధులకు గురి కావడం ఆందోళన కలిగించే అంశమని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది.

పై అంశాన్ని చదివితే ఒళ్లు గగుర్పాటుకు గురి కావటం ఖాయం. నిజమే ప్రపంచంలో కోట్లమంది మానసిక వ్యాధులతో బాధపడుతున్నారు. వీటివల్ల వాళ్ల కుటుబ సభ్యులు కూడా బాధ పడుతున్నారు. ప్రతీ నలుగురిలో ఒకరు జీవితలో ఎప్పుడో ఒకప్పుడు మానసిక వ్యాధితో బాధపడతారు. మానసిక వ్యాధుల్లో ఎక్కువమందిలో కనిపిచేది డిప్రెషన్ అయితే ఎక్కువగా ఇబ్బందిపెట్టే వ్యాధులు మాత్ర ంవేరే ఉన్నాయి. అవి స్కిటోస్ఫ్రెనియా, బైపోలార్ డిజార్డర్. ఈ మానసిక వ్యాధులతో చాలామవది బాధపడుతున్నా వాటిని బయటకు చెప్పడ ంలేదు, సరైన వైద్య సహాయ అందట్లేదని, పైగా వాళ్లను చులకనగా చూస్తున్నారని వెలుగులోకి తీసుకువచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ. మానసిక వ్యాధి తమకు ఉందని తెలిస్తే అందరిలోనూ అది అవమానకరమని చాలా మంది కనీసం వైద్య సహాయం తీసుకోవడానికి వెనకాడుతున్నారఅని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.

మానసిక వ్యాధులకు చికిత్స ఉన్నా గడిచిన సంవత్సరంలో అమెరికాలో ఆ వ్యాధులతో బాధపడుతున్న పెద్దవాళ్లలో దాదావు 60 శాతం, 8 నుడి 15 ఏళ్ల పిల్లల్లో 50 శాతం చికిత్స పొందలేదు అని నేషనల్ అలయన్స్ ఆన్ మెటల్ ఇల్నెస్ అనే సంస్థ చెప్పింది. అగ్రరాజ్యాలలోని పరిస్థితే అలా ఉంటే మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు..



సమస్యలే ఇలా....

మానసిక వ్యాధి అటే సరిగ్గా ఆలోచించలేక పోవడం, ప్రవర్తించలేకపోవడం; కోపం, సంతోషం, దుఃఖం లాటివి వచ్చినప్పుడు విపరీతగా ప్రవర్తించడం అని డాక్టర్లు చెబుతున్నారు. మానసిక వ్యాధి వల్ల ఎదుటి వాళ్లను అర్థ చేసుకోలేక పోవడం, అందరిలా ఉండలేకపోవడర, రోజువారీ పనుల్ని చేసుకోలేకపోవడ ం జరగవచ్చు.అయితే మనలో ఉండే బలహీనతల వల్ల మానసిక వ్యాధి రాదన్నది వైద్యుల ఉవాచ.

నిజానికి మనలో మానసిక వ్యాధి లక్షణాలు ఎంత కాలంగా ఉన్నాయి, ఎంత ఎక్కువగా ఉన్నాయి అనేది గమనించుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ సమస్య లక్షణాలు పరిస్థితిని బట్టి మారుతునే ఉంటాయి. ఆడామగ, చిన్నాపెద్ద, మత, ప్రాత, చదువు, ఆస్తి లాంటి వాటితో సంబధం లేకుండా ఎవరికైనా ఇవి రావచ్చు. మానసిక వ్యాధులు మనలో ఉండే బలహీనతల వల్ల రావు. సరెన వైద్య సహాయం తీసుకుటే వ్యాధి తగ్గిపోతుంది, అప్పుడు అందరిలాగే జీవిస్తారు, పనిచేస్తారు.



సాధారణంగా టీనేజీ వయసువాళ్లలో భావోద్వేగ మార్పులకు సంబధించిన కొన్ని లక్షణాలు కనిపిస్తుంటాయి. వీరిలో చాలా మంది లోలోన అనూహ్యంగా కృంగిపోయినప్పుడు అందరికీ దూరంగా ఉండేందుకు యత్నిస్తుంటారు. ఎక్కడికి రమ్మని ఎవరు ఆహ్వానించినా వెళ్లకుండా, తప్పించుకోవడానికి కారణాలు వెతుకుతారు. కనీసం తమ బాధను ఇంట్లోవాళ్లకు తెలియకుండా దాచిపెట్టగల సమర్థత వీరిలో ఉంటుంది. అయినప్పటికీ వారి ప్రవర్తలలో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నా నేను బాగానే ఉన్నానని అవసరమైతే ఎదుటి వాళ్లతో వాదనలకు దిగేవాళ్లు కూడా ఉంటారు.

సహజంగా చదువుకునే పిల్లల్లో కనిపించే డిప్రెషన్ లక్షణాలు కూడా కాస్త అలాగే ఉన్నట్లు కనిపిస్తా యి. కాకపోతే వాటితీవ్రత కొందరిలో కాస్త ఎక్కువగా ఉండవచ్చు, ఆ లక్షణాలు పదేపదే కనిపిస్తుం డవచ్చు. టీనేజికి రాకముందే ప్రతీ నలుగురిలో ఒక్కరు కొద్దిగా లేదా పూర్తిగా డిప్రెషన్తో బాధపడుతున్నారని ప్రపంచవ్యాప్తంగా జరిగిన పలు అధ్యయనాలు చెవ్తున్నాయి.

అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలు పరీక్షల ముందు డిప్రెషన్ వల్ల బాధపడుతున్నారో లేదో ఎలా తెలుసుకోగలగాలి ఇందు కు వారి మూడ్లో, ప్రవర్తనలో వస్తున్న మార్పులు గమనించాలి. వీరు అందరికి దూరంగా ఉండటం, పనుల మీద, చదువు మీద ఆసక్తి తగ్గిపోవడం, తినే అలవాట్లలో, పడుకునే విధానంలో గమనార్హమైన మార్పు రావడాన్ని గుర్తించాలి. వీరి మాటలలోనూ తాము విలువలేని వాళ్ల మనే భావనలు, ప్రతి విషయంలో అపరాధ భావాలు వ్యక్తమవుతుంటాయి. ఇలా కృంగిపోవడం వంటి లక్షణాలు గమనించాలి. బహుశా ప్రతీ ఒక్కరికి అప్పుడప్పుడూ ఈ తరహా లక్షణాలుబాగానే కన్పిస్తాయి. అయితే ఇలా రెండు వారాల కంటే ఎక్కువ మనలో ఆ లక్షణాలు ఉంటే, ఖచ్చితంగా డాక్టర్ని కలిసి పరీక్ష చేయిచుకోవడం మంచింది. అలా బాధపడేవాళ్లు చాలామంది చికిత్సలతో ఆ బాధ నుంచి తేరుకున్న విషయం గమనించండి. అయితే ఇది క్షణాలలో తగ్గిపోయే వ్యాధికాదు. పూర్తిగా తగ్గడానికి బహుశా చాలా సమయ పడుతుంది. అదికూడా మన ప్రయత్నం, ఇతర పనుల మీద మనసుని లగ్నం చేసి ముందుకు వెళ్లడంపైనే ఆధారపడి ఉంటుంది.

పిల్లల్లో డిప్రెషన్ మరీ ఎక్కువగా ఉందని, వారు తమతో చాలా కాలంగా ఇలానే ఉంటు న్నారని గుర్తించే అమ్మా నాన్నలు వారిని అనుయ నిస్తూ మాట్లాడండి. వారి సమస్యలనీ తెలుసుకుంటూ వాటి పరిష్కారాలను వెతికేందుకు తాము తోడున్నామన్న భరోసా వారిలో కలిగించండి, వారితో పంచుకోండి. అప్పటికీ వారి సమస్య తగ్గు ముఖం పట్టకుంటే వారిని తోడు తీసుకుని డాక్టరు దగ్గరికి వెళ్లడం మంచిది.

మానసిక వ్యాధులకు చికిత్స

చికిత్స ద్వారా డాక్టర్లు మానసిక వ్యాధులను పూర్తిగా తగ్గిస్తారు. ముందు చేయాల్సిన పనేంటటరే చికిత్స చేయడరలో అనుభవం ఉన్న డాక్టరుతో పూర్తిగా పరీక్ష చేయిచుకుని సమస్యను తెలుసుకోవాలి. కేవలం డాక్టరుకు చూపించుకుంటే సరిపోదు ఆయనిచ్చిన మందులు క్రమం తప్పకుండా వాడాలి, నిర్ధిష్టంగా ఇచ్చిన సలహాలను ఖచ్చితంగా పాటిచాలి. అంతకన్నా ముందు డాక్టరుకు సమస్య గురించి ఏమీ దాచిపెట్టకుండా చెప్పాలి. మీ వ్యాధి ఏటో, రోజూ మీకు ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో డాక్టరు, ఆయనతో పనిచేసే వాళ్లు చెబుతారు. అతేకాక వాళ్లు చికిత్స పూర్తయ్యేవరకు దాన్ని ఆపకూడదు అని కూడా చెబుతారు. చికిత్స కోసం వెళ్తున్నప్పుడు మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకుంటూ, మీకు ధైర్యం చెప్పే వాళ్లను తోడుగా తీసుకువెళ్లడం మంచిది.చాలామంది సమస్యను పూర్తిగా అర్థం చేసుకోవడ వల్ల, డాక్టరు చెప్పిన వైద్యాన్ని పాటించడంవల్ల వ్యాధిని తగ్గించుకున్నారు. వ్యాధివల్ల వచ్చే ఇబ్బందులను మెల్లమెల్లగా పరిష్కరించు కుంటూ పరిస్థితికి తగినట్లు ఎలా మారాలో నేర్చుకోవటంతో పాటు డాక్టర్లు, ఆయనతో పనిచేసేవాళ్లు, అన్నింటికీ మించి మన కుటుంబ సభ్యులు, స్నేహితుల సహాయం ఎంతగానో ఉపయోగపడుతుంది నిజమే... మనలో మానసిక వ్యాధి ఉందని తెలిసినప్పుడు, జైల్లో పడేసినట్లు అనిపించడం ఖాయం. నా వ్యాధి కారణంగా మనల్ని అనుయించే యత్నం కానీ, మన కోపాలను తగ్గించేలా ప్రతీది చేయలేరు. కానీ మనమే ఇందుకు తగినట్టు ప్రయత్నిస్తే కష్టంగా అనిపించే వాటిని కూడా ఇట్టే పరిష్కరిష్కార మార్గాలు లభిస్తాయి.

మానసిక వ్యాధులు ఉంటే

డాక్టర్లు ఇచ్చే వైద్యం తీసుకోండి, సలహాలు పాటించండి.ప్రతీరోజు పనుల్ని సమయానికి చేయడ ంఅలవాటు చేసుకోండి.వ్యాయామ (ఎక్సర్సైజ్) చేయండి.సరిపడినంత నిద్రపోండి.ప్రతీ రోజు కొంచె సమయం సరదాగా గడపండి.మంచి ఆహార ం తీసుకోండి.మద్యం తాగడ ం తగ్గించండి, డాక్టరు ఇవ్వని మందులు తీసుకోవద్దు.ఒంటరిగా ఉండకుండా మీకు ఇష్టమైన వాళ్లతో మిమ్మల్ని చూసుకునే వాళ్లతో ఉండండి. దేవుని మీద భక్తి పెంచుకోండి. ★



రక్త హీనత వేధిస్తోందా?



మీరు తరచుగా కష్టతరమైన శ్వాసను, ఆయాసమును మరియు అలసటను కలిగివున్నట్లయితే, మీ శరీరంలో ఐరన్ యొక్క స్థాయిని ఒకసారి తప్పకుండా పరీక్షించుకోండి. శరీరంలో సరిపోయినంత ఐరన్ లేకపోవటం వల్ల మహిళలు తరచుగా రక్తహీనతకు గురౌతారు. ఐరన్ అనేది మన శరీరంలో అతి ముఖ్యమైన అంశంగా చాలామంది పరిగణించకపోవచ్చు. కానీ మన శరీరంలో ఐరన్ కొరత ఏర్పడటం వల్ల చాలా ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది కాబట్టి మనము చాలా జాగ్రత్తగా వహించాలి. మీ శరీరంలో ఐరన్ సరైన స్థాయిలో లేదని సూచించే కొన్ని సంకేతాలు ఇక్కడ ఉన్నాయి. శరీరంలో హిమోగ్లోబిన్ను ఉత్పత్తి చేయటంలో ఐరన్ అనేది సహాయపడే చాలా ముఖ్యమైన అంశము. అలాగే శరీరం యొక్క అన్ని భాగాలకు ఆక్సిజన్ తరలించేలా ఎర్ర రక్తకణాల యొక్క స్థాయిని ప్రేరేపిస్తుంది. శరీరంలో తగినంత ఐరన్ లేనట్లయితే, నిర్ణీత స్థాయిలో ఎర్రరక్త కణాలను ఉత్పత్తి చేయడం విఫలమవుతుంది తద్వారా రక్తహీనత అనేది ఏర్పడుతుంది. అధికమైన రుతుస్రావం, ఐరన్ లోపించినా ఆహారాన్ని తీసుకోవడం, మరియు గర్భం ధరించిన మహిళలు, వారి యొక్క నూతన జీవనశైలిని సజావుగా కొనసాగించేందుకు కావలసిన స్థాయిలో ఐరన్ కోరుకుంటున్నారో – వారంతా ఈ ఐరన్ లోపంతోనే బాధపడుతున్నారు. ఈ ఐరన్ లోపం అనేది మహిళలు సాధారణంగా ఎదుర్కొనే ఒక ఆరోగ్య సమస్య. మీ శరీరంలో ఐరన్ కొరతను సూచించే 12 రకాల సంకేతాలు ఇక్కడ ఇవ్వబడ్డాయి. అవేమిటో మీరు ఒకసారి చూడండి.

అలసట : మీ శరీరంలో తగినంత ఐరన్ లేని కారణంగా మీరు అధికంగా అలసటను కలిగి, చాలా బలహీనంగా ఉంటారు. శరీరం అవసరమైనంత స్థాయిలో ఎర్ర రక్తకణాలు లేనందువలన – మీ శరీరం ఇతర భాగాలకు ఆక్సిజన్ సరిగా సరఫరా కాలేనప్పుడు, అధికమైన అలసటకులోనై, మీరు తరచుగా విశ్రాంతిని తీసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారు.

ఆందోళన ఒత్తిడి : శరీరంలో తగినంత స్థాయిలో ఐరన్ లేకపోవడం వలన మహిళలు ఆందోళనను మరియు ఒత్తిడిని అనుభవిస్తూ వుంటారు. మన యొక్క మానసిక–స్థితిని అలాగే నిద్రను నియంత్రించడంలో ఐరన్ ముఖ్య పాత్రను పోషిస్తుంది.

కంటి సమస్యలు : శరీరానికి కావలసినంత ఐరన్ లేకపోవడం వల్ల రక్తహీనతకు దారితీస్తుంది. రక్తహీనతతో బాధపడుతున్నప్పుడు సాధారణంగా మీ కళ్ళు లేత రంగులోకి పాలిపోతాయి. శరీరంలో అవసరమైనంత ఐరన్ లేకపోవడం వల్ల కంటిలో దురదలు కూడా ఏర్పడతాయి.

కాళ్ళు వణకడం : మీరు హఠాత్తుగా కూర్చునప్పుడు కూడా మీ కాళ్ళలో జలదరింపు (వణకడం) కలగడాన్ని బాగా అనుభూతి చెంది ఉంటారు. శరీరంలో ఐరన్ లోపం ఉన్నప్పుడు ఇది ఏర్పడుతుంది.

పగిలిన పెదాలు : మీ పెదవులు బాగా పగిలినట్లుగా మీరు గమనించిన సమయంలో, మీ నాలుకను ఉపయోగించి మీ పదవులను తడి చేసుకుంటున్నారా? అయితే మీరు ఐరన్ లోపంతో బాధపడుతున్నారానేందుకు ఇది ఒక స్పష్టమైన సంకేతమని చెప్పవచ్చు.

నాలుక వావు : మీరు ఆహారాన్ని నమిలే సమయంలో ఒక వావు లాంటి సమస్యను కలిగి ఉన్నట్లు మీరు గుర్తించారా? మీ నాలుక ఉబ్బినట్లు ఉంటే మీ శరీరంలో ఐరన్ కొరత ఉందని అర్థం

ఆహారేతరాలపై కోరిక : రంగులు, మట్టి వంటి ఇతర ఆహారేతర పదార్థాల కోసం మీరు తీవ్రమైన కోరికలను కలిగి ఉన్నట్లయితే, ఇది ఐరన్ లోపం కారణంగా అనేక అధ్యయనాలు గుర్తించాయి.

పెళుసుల వంటి గోర్లు : మీరు సాధారణమైన గోర్ల నిర్మాణాన్ని కలిగి ఉండవచ్చు. కానీ మీ శరీరంలో ఐరన్ లోపం ఉన్నప్పుడు మీ చేతి గోర్లు పెళుసుగా మారుతుండటాన్ని గమనించవచ్చు.

మూత్రం రంగు మారడం : మీరు మూత్రము రంగు ఎరువు (లేదా) కొద్దిగా నారింజ రంగులో ఉన్నట్లు గమనించినట్లయితే, ఇది మీ శరీరంలో ఐరన్ కొరత వల్ల ఏర్పడినది కావచ్చు.

తరచూ ఇన్ఫెక్షన్స్ రావడం : తరచుగా మీరు శ్వాస సంబంధమైన సమస్యలను గానీ, ఇన్ఫెక్షన్లను గానీ ఎదుర్కొంటున్నట్లయితే, మీ శరీరంలో ఐరన్ తగినంత స్థాయిలో లేదని తెలిపే ప్రధాన సంకేతమది.

కండరాలు బలహీనం: శరీరంలో ఐరన్ లోపించినప్పుడు మీ గొంతు వద్ద ఉన్న కండరాలు కూడా చాలా బలహీనంగా మారతాయి మరియు మీ గొంతు కండరాలకు మరిన్ని సమస్యలను తెచ్చే ప్రమాదాన్ని కూడా కలిగి ఉంటుంది.

శ్వాస అందకపోవడం : ఐరన్ అనేది హేమోగ్లోబిన్ యొక్క ఉత్పత్తిని పెంచే ముఖ్యమైన అంశాలలో ఒకటి, ఇది శరీరంలో ఉన్న అన్ని అవయవాలకు ఆక్సిజన్ను సరఫరా చేయడంలో సహాయపడుతుంది. ఈ విధంగా కొనసాగే ప్రక్రియలో అవాంతరాలు సంభవించినప్పుడు, మీరు శ్వాసను అందుకోలేని పరిస్థితికి చేరుకుంటారు.

దేశోద్ధారకుడు



ఎన్టీఆర్ త్రివిక్రమ్ సినిమా మర్చి మూడో వారం నుండి ప్రారంభం కానుంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ దేశం కోసం ప్రాణాలు సైతం అర్పించడానికి వెనుకాడని ఆర్మీ ఆఫీసర్‌గా నటించబోతున్నట్లు సమాచారం. ఎన్టీఆర్ ఈ సినిమా కోసం తన లుక్‌ను కొత్తగా, పూర్తిగా మార్చుకుంటున్నాడు. తమన్ సంగీతం అందించబోతున్న ఈ సినిమాకు వినోద్ సినిమాటోగ్రఫి అందిస్తున్నాడు.

ఈ సినిమాలో ముఖ్య పాత్రంలో నిన్నటి క్రేజీ హీరోయిన్ సిమ్రాన్ తోపాటు, లయ, మీనా వంటి మాజీ హీరోయిన్స్ నటించే అవకాశం ఉందని తెలుస్తోంది. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాను హారికా హాసిని బ్యానర్‌లో యస్.రాధాకృష్ణ(చినబాబు) నిర్మిస్తున్నారు. త్రివిక్రమ్ సినిమాల్లో ఇద్దరు హీరోయిన్స్ ఉంటారన్న విషయం తెలిసిందే. మరో హీరోయిన్ ఎవరన్నది త్వరలోనే తెలియనుంది!!

ఎన్నటికీ చెదరని చాందిని



డా.టి.సుబ్బిరామిరెడ్డి

శ్రీదేవి హఠాన్మరణం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. నమ్మలేకపోతున్నాను. దాదాపుగా నాలుగు దశాబ్దాలుగా మా కుటుంబానికి ఎంతో సన్నిహితురాలు, ఆప్తురాలు. ఎన్నో సినీ వేడుకలకు మా ఆహ్వానాన్ని మన్నించి వచ్చేవారు. ఆమె మరణం భారతీయ చలనచిత్ర రంగానికి తీరని లోటు. నిన్నగాక మొన్న 'మామ్'గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన శ్రీదేవి హఠాత్తుగా మరణించడం దేశవ్యాప్తంగా అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఏదన్నా సన్నివేశం ఇస్తే ఇలా చేయాలా? అలా చేయాలా? అని రిహార్సల్స్ చేసుకోకుండా అర్థం చేసుకుని ఎంతో సహజంగానే నటించేసేవారు శ్రీదేవి. అందుకే శ్రీదేవి స్థానాన్ని మరెవ్వరూ భర్తీ చేయాలేరని అంటుంటారు. 250కి పైగా చిత్రాల్లో నటించిన ఆమె హఠాత్తుగా ఈలోకాన్ని విడిచి వెల్లడం అభిమానులను తీవ్రంగా కలిచివేస్తోంది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సాను భూతిని తెలియ జేస్తున్నాను!!

అరుదైన వ్యక్తిత్వం ఆమె సొంతం

డా.కె.ఎల్.నారాయణ



భారతదేశం గర్వించదగ్గ గొప్ప నటి శ్రీదేవితో మా తొలి చిత్రం 'క్షణక్షణం' తీయడం, ఆ చిత్రానికి తొలిసారిగా ఆమె ఉత్తమ నటిగా నంది అవార్డుతోపాటూ ఫిలిం ఫేర్ అవార్డు కూడా అందుకోవడంతో చాలా సంతోషించాం. ఆ చిత్ర నిర్మాణ సమయంలో తానొక పెద్ద స్టార్ హీరోయిన్ అనే ఫీలింగ్ లేకుండా చాలా సింపుల్‌గా ఉంటూ ప్రతిక్షణం మాతో ఎంతో సహకరించేవారు. నిజానికి ఆ సమయంలో వాళ్ళ నాన్నగారు దూరమై, మానసికంగా డిప్రెస్ అయినా కూడా షెడ్యూల్స్‌కి ఎలాంటి ఆటంకం లేకుండా సినిమా అనుకున్న టైమ్‌కి పూర్తవడానికి ఎంతో తోడ్పడ్డారు. అలాంటి గొప్ప అంకితభావం ఉన్న నటి దూరమవడం చాలా దురదృష్టకరం!!

బాధాతప్త హృదయంతో భారతావని

ఓ దేవకన్యా..
నీ అంగులీకం
మళ్లీ పోకుండా
ఉంటుందా?

దానిని
వెతుక్కుంటూ
నువ్వు మళ్లీ
మా భువికి
రాకుండా
ఉంటావా??



కన్ను తెరిస్తే జననం.. కన్ను మూస్తే మరణం.. రెప్పపాటే ఈ ప్రయాణం...

అవును మన కనురెప్పల కదలికల మాటున ప్రపంచవ్యాప్తంగా అనేక మరణాలు, జననాలు సంభవిస్తుంటాయి. ప్రతి సెకనుకో మరణం, జననం జరుగుతూనే ఉంటాయి. జననాలెప్పుడూ సంచలనాలు కావు. అవి కొద్దిమందికి మాత్రమే సంతోషాన్ని నింపుతాయి. కొన్ని మరణాలు కూడా అంతే. అవి పంచే విషాదం కొంతమందికి మాత్రమే పరిమితమవుతాయి.

కానీ చాలా కొద్దిమంది మరణాలు మాత్రమే 'దిగ్భ్రాంతి'కి లోను చేస్తాయి. ఎవరైనా ప్రముఖులు మరణించినప్పుడు వారితో పరిచయమున్న మిగతా ప్రముఖులంతా 'దిగ్భ్రాంతి' వ్యక్తం చేస్తుంటారు. కానీ.. ప్రముఖులకే కాకుండా సామాన్యులకు కూడా 'దిగ్భ్రాంతి' కలిగించే మరణాలు చాలా అరుదుగా సంభవిస్తుంటాయి.

అలాంటి అరుదైన మరణం శ్రీదేవిది. ఆమె మరణవార్త విన్న మరుక్షణం దేశం యావత్తూ 'దిగ్భ్రాంతి'కి లోనయ్యింది. ఆరు పదులకు ఇంకా అయిదారేళ్ల దూరంలో ఉన్న శ్రీదేవి ఇలా సడెన్‌గా సెలవు తీసుకుంటుందని ఊహించకపోవడమే ఇందుకు కారణం.

శ్రీదేవి తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో నటించడమే కాదు.. ఈ భాషలను తన అందంతో, అబినయంతో అద్వితీయంగా, అనితరసాధ్యంగా పరిపాలించింది. అంతేకాదు.. అనంతరకాలంలో తన సామ్రాజ్యాన్ని ఉత్తరాదికి కూడా వ్యాపింపచేసుకుంది.

అందుకే శ్రీదేవి మరణం ప్రపంచవ్యాప్తంగా గల భారతీయులందరికీ తీరని విషాదాన్ని నింపింది. భారతదేశ ప్రథమ పౌరుడు, ప్రధానమంత్రి వంటి అత్యున్నత స్థాయి వ్యక్తులు మొదలుకొని.. అన్ని రంగాలకు చెందిన ప్రముఖులు సంతాప సందేశాలు పంపేలా చేసింది. ప్రభుత్వం అధికారికంగా సంతాపదినాలేమీ ప్రకటించలేదు కానీ.. సాధారణ ప్రజానీకం అనధికారికంగా సంతాపదినాలు ఇంకా పాటిస్తూనే ఉన్నాయి.

శ్రీదేవి ఫోటోలు, శ్రీదేవిపై రాసుకొన్న మాటలతో ఫేస్‌బుక్, వాట్సప్ వంటి మాధ్యమాలు ఇంకా ఉక్కిరిబిక్కిరి అవుతూనే ఉన్నాయి. బహుశా ఒక మరణం ఇంతటి అలజడి సృష్టించడం ఇటీవలకాలంలో ఎప్పుడూ జరిగి ఉండదు. సంతాప సందేశాలు ఇప్పటికీ వెల్లువెత్తుతూనే ఉన్నాయి.

తనని ఇంతగా అభిమానించేవాళ్లు ఇన్ని కోట్లమంది ఉన్నారని శ్రీదేవికి కూడా బహుశా తెలిసి ఉండదు. తెలిసి ఉంటే ఆమె తన మరణంతోనూ గట్టి పోరాటం చేసి, తనదైన శైలిలో విజయం సాధించి ఉండేది.

శ్రీదేవిని తన దగ్గరకు పిలిపించుకొంటే ఇన్ని కోట్ల హృదయాలు గాయపడతాయని ఆ సృష్టికర్త కూడా ఊహించి ఉండడు. అలా ఊహించి ఉంటే ఆమె నొసట రాసిన అర్ధాయుష్షును పూర్ణాయుష్షుగా మార్చి ఉండేవాడు.

శ్రీదేవి కంటే అందమైనవాళ్లు చాలామంది ఉండొచ్చు. శ్రీదేవి కంటే అందంగా అభినయించేవాళ్లు కూడా కొంతమంది ఉండొచ్చు. శ్రీదేవిలా అద్భుతంగా నాట్యం చేసేవాళ్లు కూడా ఉండొచ్చు. కానీ ఇవన్నీ ఒకే మనిషిలో రూపం దాల్చడమన్నది ఈ సృష్టిలో మొదటిసారి జరిగింది. ఇంకోసారి ఎప్పుడన్నా జరుగుతుందేమో బహుశా ఆ భగవంతుడికి కూడా తెలియదంటే అది అతిశయోక్తి కాదు!!

రామ్-అనుపమ రెండోసారి



ఉన్నది ఒకటే జిందగీ' సినిమా తరువాత రామ్, త్రినాధ్‌రావ్ దర్శకత్వంలో నటించబోతున్న విషయం తెలిసిందే. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమా షూటింగ్ మార్చి 8 నుండి మొదలుకానుందని సమాచారం. ఇద్దరు హీరోయిన్స్ యాక్ట్ చేస్తున్న ఈ చిత్రం కోసం మరో హీరోయిన్‌ని అన్వేషిస్తున్నారు. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించబోతున్న ఈ సినిమా రామ్ చేస్తోన్న 16వ చిత్రం కావడం విశేషం. త్రినాథ్‌రావ్‌కు దర్శకుడిగా క్రేజ్ తీసుకొచ్చిన 'సినిమా చూపిస్తా మావా' తరహాలో ఎంటర్టైన్మెంట్ ఈ సినిమాలో ఎక్కువగా ఉండబోతోందని సమాచారం. ప్రకాష్ రాజ్ ఈ సినిమాలో హీరోయిన్ తండ్రి పాత్రలో కనిపించబోతున్నాడు!!

అల్లరితో అనిల్ సుంకర నాలుగోసారి



అల్లరి నరేష్‌తో ఇంతకుముందు 'అహ నా పెళ్లంట, యాక్షన్ 3డి, జేమ్స్‌బాండ్' చిత్రాలు నిర్మించిన అనిల్ సుంకర నరేష్‌తో నాలుగో సినిమా తీసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. 'నందిని నర్సింగ్‌హోం'తో దర్శకుడిగా పరిచయమైన పి.వి.గిరి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే స్క్రిప్ట్ లాక్ చేసుకొన్న ఈ చిత్రం మార్చి మొదటివారంలో లాంఛనంగా ప్రారంభం జరుపుకోనుంది. ప్రస్తుతం హీరోయిన్‌తో పాటు ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపికలో దర్శకనిర్మాతలు గిరి, అనిల్ ఉన్నారు!!



నందికొండ వాగుల్లో నల్లా కొమ్మ చీకట్లో

బీచుపల్లి ఆంజనేయ ప్రొడక్షన్స్ పై సాయి వెంకట్ సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'నందికొండ వాగుల్లోన'. షఫీ, లక్కీ ఎకారి, సాయి కిరణ్, పూజశ్రీ, మేఘన మరియు జ్యోతిక యాదవ్ లీడ్ రోల్స్ ప్లే చేస్తున్న ఈ చిత్రానికి సత్యనారాయణ దర్శకుడు. నిర్మాత రఘు హెచ్. లహరి మ్యూజిక్ ద్వారా ఈ చిత్రం ఆడియో మరియు ట్రైలర్ ఫిల్మ్ ఛాంబర్ లో విడుదల చేశారు. ట్రైలర్‌ను శివారెడ్డి విడుదల చేయగా, ఆడియో బిగ్ సీడీని ఎర్రల్ల శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ వేడుకలో ఎమ్ ఎల్ ఎ శ్రీనివాస్ గౌడ్, ఎర్రల్ల శ్రీనివాస్, సాయి మధుసూదన చారి, గట్టు రామచంద్ర రావు, ఆర్ కె గౌడ్, సత్యానంద్, రాధా ప్రశాంత్, హనుమంతరావు, కమెడియన్ శివారెడ్డి, రష్మీ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. దర్శకుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. సాయి వెంకట్, ఆర్ కె గౌడ్ ఈ సినిమాను రిలీజ్ చేయడానికి ముందుకొచ్చారు. అందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నా' అన్నారు. సమర్పకుడు సాయి వెంకట్ మాట్లాడుతూ.. 'హీరో షిరాజ్‌తో ఉన్న స్నేహం కొద్దీ ఈ సినిమాకు సపోర్ట్ చేస్తున్నాను' అన్నారు!!

సింపుల్‌గా శివాజీరాజా పుట్టినరోజు వేడుక



మా అధ్యక్షుడు శివాజీరాజా పుట్టిన రోజు వేడుక 'మా' కార్యాలయంలో నిడారంబరంగా జరిగింది. 'మా' కార్యవర్గ సభ్యులు పలువురు ఆర్టిస్టులు కేక్ కట్ చేసి మా' కోసం పాటుపడుతోన్న శివాజీరాజా కృషిని కొనియాడారు. ఈ వేడుకలో ఎస్.వి.కృష్ణారెడ్డి, శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ బెనర్జీ, జనరల్ సెక్రటరీ నరేష్, జాయింట్ సెక్రటరీ ఏడిద శ్రీరామ్, కల్చరల్ కమిటీ చైర్మన్ సురేష్ కొండేటి తదితరులు పాల్గొన్నారు!!

దండుపాళ్యం-3 దండిగా వసూలు చేయాలి



దండుపాళ్యం' గ్యాంగ్‌కి కన్నడలో మంచి క్రేజ్ వుంది. ఆ క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు శ్రీనివాసరాజు రియలిస్టిక్ గా తెరకెక్కించారు. అలా చేసిన దండుపాళ్యం 1, దండుపాళ్యం 2 భారీ ఓపెనింగ్స్‌తో సూపర్ సక్సెస్ సాధించాయి. ఇప్పుడు ఈ ఫ్రాంచయిస్ లో చివరి పార్టు గా 'దండుపాళ్యం-3' తీసుకొస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో, సహజమైన సన్నివేశాలతో, భావోద్వేగమైన నటనతో 'దండుపాళ్యం' ద్వారా ఆ గ్యాంగ్ కి సపరేట్ క్రేజ్ సంపాదించుకున్నారు. శ్రీనివాసరాజు దర్శకత్వంలో రూపొందిన ఈ సెన్సేషనల్ చిత్రం మరోసారి తెలుగు ప్రేక్షకుల్ని థ్రిల్ చేయనుంది. ఈ చిత్రాన్ని శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ వారు తెలుగులో విడుదల చేస్తున్నారు. శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో.. సాయికృష్ణ ఫిల్మ్స్ సమర్పణలో... శ్రీవాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్స్ పై శ్రీనివాస్ మీసాల, సాయికృష్ణ పెండ్యాల సంయుక్తంగా తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రాన్ని అందిస్తున్నారు. బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆడియో ఫంక్షన్ ప్రసాద్ ల్యాబ్ గ్రౌండ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎక్కడికి పోతావు చిన్నవాడా దర్శకుడు వి.ఐ.ఆనంద్, నేను లోకల్ దర్శకుడు త్రినాథ్, ప్రముఖ రచయిత, దర్శకుడు, నటుడు పరుచూరి వెంకటేశ్వరావు, ప్రముఖ నిర్మాత మల్కాపురం శివకుమార్‌లతోపాటు ఈ చిత్రంలో నటించిన గ్యాంగ్ మొత్తం హాజరవ్వటం విశేషం.నిర్మాతలు శ్రీనివాస్ మీసాల-సాయికృష్ణ పెండ్యాల మాట్లాడుతూ.. 'మహానుభావుడు, ఆనందోబ్రహ్మ, ఒక్కక్షణం' చిత్రాల్ని పంపిణి చేసాము. ఈ సంవత్సరం 'దండుపాళ్యం3'తో నిర్మాతగా సినీరంగ ప్రవేశం చేస్తున్నాం. దండుపాళ్యం పార్ట్‌లన్నీ మంచి విజయాలు సాధించాయి. చివరి పార్టుగా వస్తున్న దండుపాళ్యం-3 మార్చిలో విడుదల కానుంది. మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం వుంది' అన్నారు!!



మాజీ కేబినెట్ కార్యదర్శి సుబ్రమణియన్ కన్నుమూత

న్యూఢిల్లీ: కేంద్ర మాజీ కేబినెట్ కార్యదర్శి టీఎస్ఆర్ సుబ్రమణియన్ అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. ఈ విషయాన్ని ఐఏఎస్‌ల సంఘం ట్విటర్ ద్వారా వెల్లడించింది. అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ కేబినెట్ సెక్రటరీ మరణించారు. దేశం మంచి ఐఏఎస్‌ను కోల్పోయింది. సుబ్రమణియన్ కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. ఆయన మార్గదర్శకాలను ఎల్లప్పుడూ తప్పకుండా పాటిస్తాం. అంటూ ట్వీట్ చేసింది. సుబ్రమణియన్ మరణవార్త తెలుసుకున్న రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ట్విటర్ ద్వారా స్పందించారు. మాజీ కేబినెట్ కార్యదర్శి ఇక లేరు. ఆయన వృత్తిపట్ల ఎంతో నిబద్ధత ఉన్న వ్యక్తి. టీవీ ఛానెళ్లలో చర్చాగోష్టిలో పాల్గొన్నప్పుడు ఆయన విలువైన ఆలోచనలను అందించేవారు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. అంటూ ట్వీట్ చేశారు. మరో వైపు ఆయన మృతిపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కూడా స్పందించారు. సుబ్రమణియన్ మృతి గురించి వినగానే షాక్‌కు గురయ్యాను. విధాన నిర్ణయాల్లో ఆయన సలహాలు బాగా ఉపయోగపడేవి. ఆయన కుటుంబానికి, శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి అంటూ ట్వీట్ చేశారు. సుబ్రమణియన్ వివిధ కమిటీలకు అధ్యక్షత వహించారు. దేశంలో నూతన విద్యావిధానాలను ప్రవేశపెట్టడానికి ఆయన ఎంతో కృషి చేశారు. కొంతకాలం పాటూ కేబినెట్ సెక్రటరీగా వ్యవహరించారు. సోమవారం సాయంత్రం 5:30 గంటలకు న్యూఢిల్లీలోని లోధీ రోడ్‌లోని శ్మశాన వాటికలో అంత్య క్రియలు జరగనున్నాయని అధికారులు తెలిపారు.

కేజ్రీవాల్ సంచలన నిర్ణయం

- ఢిల్లీ సీఎస్‌పై ఎమ్మెల్యేల దాడిపై సీరియస్
- సీసీటీవీ ఫుటేజ్ తారుమారు : పోలీసులు
- కేజ్రీవాల్ క్షమాపణ చెప్పాలి
- ఐఏఎస్ అధికారులు డిమాండ్

న్యూఢిల్లీ: ఢిల్లీ చీఫ్ సెక్రటరీ అన్షు ప్రకాశ్‌పై అధికార ఆమాద్మీ పార్టీ ఎమ్మెల్యేలు దాడి చేశారన్న ఆరోపణల నేపథ్యంలో కేజ్రీవాల్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఉన్నతాధికారులతో జరిగే సమావేశాలన్నీ ప్రత్యక్ష ప్రసారం చేయాలని యోచిస్తున్నట్లు ఢిల్లీ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ అంతర్గత వ్యవహారాలు, పనితీరులో పూర్తిస్థాయి పారదర్శకతను తీసుకొచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇకమీదట అధికారులు ప్రభుత్వంపై ఎలాంటి ఆరోపణలు చేయకుండా చెక్ పెట్టేందుకు ఇదే విరుగుడుగా కేజ్రీవాల్ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన అధికారిక వెబ్‌సైట్లో సమావేశాలన్నీ ప్రత్యక్ష ప్రసారం చేసే అవకాశాలున్నాయి. ముందు ముందు ప్రభుత్వానికి చెందిన అన్ని ఫైళ్లను కూడా ఆన్‌లైన్‌లో పెట్టనున్నట్లు చెబుతున్నారు. ఇకపై ప్రభుత్వ ఫైళ్లన్నటినీ ఆన్‌లైన్‌లో పెట్టాలని యోచిస్తున్నాం. తద్వారా ఆయా ఫైళ్లపై ఎవరు సంతకాలు చేశారు, ఎవరు చేయలేదు, తర్వాత సంతకం చేయాల్సిన వాళ్లు ఎవరు అన్నది ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసే అవకాశం ఉంటుంది. తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ఎవరు అభ్యంతరం చెప్పారు, ఎవరు సంతకాలు పెట్టారన్నది కూడా ప్రజలు తెలుసుకోగలుగుతారు... అని సదరు నేత పేర్కొన్నారు. వచ్చేనెలలో ఢిల్లీ ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఒకవేళ ప్రత్యక్ష ప్రసార నిర్ణయాన్ని కేబినెట్ ఆమోదిస్తే.. అందుకు కావాల్సిన నిధులను ఈ బడ్జెట్‌లోనే కేటాయించాల్సి ఉంటుంది. కాగా గత సోమవారం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో తనపై ఎమ్మెల్యేలు భౌతిక దాడికి దిగారంటూ ఢిల్లీ సీఎస్ అన్షు ప్రకాశ్ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆమాద్మీ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి బెయిల్ మంజూరు చేసేందుకు కూడా ఢిల్లీ కోర్టు తిరస్కరించింది. అయితే చీఫ్ సెక్రటరీపై దాడిచేశారన్న ఆరోపణలన్నీ అసత్యాలేనని సీఎం కార్యాలయం చెబుతోంది. ఎమ్మెల్యేలు ఎవరూ ఆయనపై చేయిచేసుకోలేదని స్పష్టం చేసింది. మరోవైపు సీఎస్ అన్షు ప్రకాశ్‌పై భౌతిక దాడి జరిగిన సూచనలు కనిపించాయని ఢిల్లీ ప్రభుత్వ ఆస్పత్రి తన వైద్య నివేదికలో పేర్కొంది. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్‌పై అధికార పార్టీ ఎమ్మెల్యేల దాడి కేసు భారీ మలుపు తిరిగింది. ఈ నెల 19-20 తేదీల మధ్య రాత్రి సీఎం కేజ్రీవాల్ నివాసంలో జరిగిన సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలు అమానతుల్లా ఖాన్, ప్రకాశ్ జైర్వాల్ దాడి చేసినట్లు అన్షు ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు కేజ్రీవాల్ నివాసంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను స్వాధీనం చేసుకున్నారు.



అయితే ఈ ఫుటేజ్ ట్యాంపరింగ్ అయిందని పోలీసులు కోర్టుకు చెప్పారు. ఈ ఫుటేజ్‌ను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపించి పరీక్షలు చేయిస్తామని తెలిపారు. అదనపు డీసీపీ హరీంద్ర సింగ్ సోమవారం కోర్టుకు హాజరయ్యారు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్, ఆప్ ఎమ్మెల్యేల సమావేశం క్యాంప్ ఆఫీసులో జరగలేదని, సీఎం నివాసంలో ఆయన డ్రాయింగ్ రూమ్‌లో జరిగిందని కోర్టుకు చెప్పారు. సీసీటీవీ టైమింగ్స్ వేరేగా ఉన్నాయన్నారు. ఈ ఫుటేజ్ తారుమారైందని, మార్పులకు గురైందని తెలిపారు. ఢిల్లీ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్ పై దాడి కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పాలని ఐఏఎస్ అధికారులు డిమాండ్ చేశారు. ఐఏఎస్ జాయింట్ ఫోరం అధ్యక్షురాలు పూజా జోషి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా లిఖితపూర్వంగా క్షమాపణలు చెప్పాలి. అప్పటిదాకా నల్ల బ్యాడ్జీలు ధరించి మా ఆందోళన కొనసాగిస్తాం. ముఖ్యమంత్రి ఇంట్లోని సీసీటీవీ దృశ్యాలను టాంపరింగ్ చేశారు. కుట్రతోనే సీఎస్‌పై దాడి చేసినట్లు మాకు అనిపిస్తోంది.అని అన్నారు. అయితే దీనిపై అదనపు డీసీపీ హరేంద్ర సింగ్ మాట్లాడుతూ... దాడి జరిగిన రోజు సమావేశం క్యాంపు కార్యాలయంలో జరగలేదు.

సీఎం నివాసంలోని సమావేశ మందిరంలో జరిగింది. అక్కడ పోలీసులు తీసుకున్న సీసీటీవీ దృశ్యాల్లోని సమయానికి, ఘటన జరిగిన సమయానికి పొంతన లేదు. దృశ్యాలను ట్యాంపరింగ్ చేశారుఅని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈనెల 20న దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తన నివాసంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. దీనిలో కొందరు ఆప్ ఎమ్మెల్యేలు, సీఎస్ అన్షు ప్రకాశ్ పాల్గొన్నారు. అయితే ఈ సమావేశంలో తనపై ఆప్ ఎమ్మెల్యేలు అమనతుల్లా ఖాన్, ప్రకాశ్ జర్వాల్ దాడి చేశారని సీఎస్ ఆరోపించారు. దీంతో వారిద్దరినీ అరెస్టు చేశారు. వారిని న్యాయస్థానం 16రోజుల జ్యుడిషియల్ కస్టడీలో ఉంచింది.

అయోధ్యలో రామమందిరం తప్పదు



బరబంకి : అయోధ్యలో శ్రీ రాముడు కొలువుదీరిన చోటే మళ్లీ రామమందిరం వెలుస్తుందని రాజ్య సభ సభ్యుడు వినయ్ కటియార్ అన్నారు. ప్రస్తుతం ఈ కేసు సుప్రీం కోర్టు విచారణలో ఉన్నం దున తుది తీర్పు వచ్చే వరకు వేచి చూడాల్సిన అవసరముందన్నారు. ఉత్తర్రప్రదేశ్‌లోని బరబంకి జిల్లాలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. రామమందిర నిర్మాణానికి ఎంత కాలం పడుతుందన్న విషయంపై మాట్లాడలేను. కచ్చితంగా ఏదో ఒక రోజున అయోధ్యలో రామ మందిరం మళ్లీ వెలుస్తుంది. అంటూ సమాధానమిచ్చారు. గత కొన్నేళ్లుగా అయోధ్యలో రామమందిర నిర్మాణంపై సందిగ్ధత నెలకొన్న సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ, యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ రాష్ట్ర అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తున్నారని కితాబిచ్చారు. యోగి ప్రభుత్వ హయాంలో నేరగాళ్లు స్వయంగా లొంగిపోతున్నారని కొనియాడారు.

బీజేపీకి చెక్ పెట్టేందుకు రాహుల్ ప్రణాళిక



బెంగళూరు : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కర్ణాటక శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తరచూ ఆ రాష్ట్రంలో పర్యటిస్తూ, ఓటర్లను ఆకట్టుకునేందుకు మహనీయులు చెప్పిన సూక్తులను ప్రస్తావిస్తున్నారు. ముంబై-కర్ణాటక ప్రాంతంలో మూడు రోజుల పర్యటనను శనివారం నుంచి ప్రారంభించిన రాహుల్ లింగాయత్‌లను ఆకర్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. లింగాయత్‌లకు బసవన్న మూల పురుషుడు కావడంతో ఆయన చెప్పిన సూక్తులను సందర్భాన్నిబట్టి ఉపయోగిస్తున్నారు. అయితే ఆయన ఇంగ్లిష్‌లో రాసుకుని వీటిని ఉచ్చరిస్తూ ఉండటంతో కొందరు నవ్వుకుంటున్నారు, మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయన కాస్త తేలికగా ఉన్న సూక్తులను ఎంపిక చేసుకుంటున్నారు. ముంబై-కర్ణాటక ప్రాంతంలో లింగాయత్‌లు అధికంగా ఉంటారు. శనివారం నుంచి సోమవారం వరకు ఆయన ఇక్కడ పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభల్లో బసవన్న సూక్తులను ప్రస్తావిస్తున్నారు. శనివారం ఆయన చాలా ప్రముఖమైన బసవన్న సూక్తిని ఉచ్చరించారు. అతను ఎవరు? అని అడగవద్దు. మనలో ఒకడని చెప్పు, అతను మనలో ఒకడు అనే సూక్తిని చెప్పారు. మోదీ విభజన రాజకీయాలను ఎండగట్టేందుకు రాహుల్ ఈ సూక్తిని ఎంచుకున్నారు. ఆది, సోమవారాల్లో బీజాపుర, బాగల్‌కోట్, బెల్గాం, ధార్వాడ్ జిల్లాల్లో జరిగిన బహిరంగ సభల్లో మాట్లాడుతూ చెప్పేది చేయాలి, పనియే దైవం వంటి సూక్తులను చెప్తూ మోదీని దుయ్యబట్టారు. 2014 ఎన్నికల ప్రచారంలో మోదీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ చెప్పేది చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంపై బీజేపీకి మంచి పట్టు ఉంది. ఇక్కడ బసవన్న పేరును ఉపయోగించుకోవడం వల్ల సత్ఫలితాలు ఉంటాయని రాహుల్ గాంధీ భావిస్తున్నారు. మరోవైపు శక్తిమంతమైన లింగాయత్‌లకు దగ్గర కావచ్చునని అనుకుంటున్నారు.

ఢిల్లీలో రాష్ట్రపతి పాలన?

- కేజ్రివాల్ ప్రభుత్వంలో సంక్షోభ పరిస్థితులు
- కేజ్రివాల్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్
- స్పందించని కేంద్ర ప్రభుత్వం
- వివాదాస్పదంగా ముఖ్యమంత్రి ఇంట్లో సోదాలు

న్యూఢిల్లీ : ఢిల్లీకి చెందిన సీనియర్ అధికారిపై చేయి చేసుకున్నారన్న కారణంగా ఇద్దరు ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడంతో ఢిల్లీలోని అరవింద్ కేజ్రివాల్ ప్రభుత్వంలో సంక్షోభ పరిస్థితులు ఏర్పడిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోని కేజ్రివాల్ ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధిస్తుందన్న వదంతులు వ్యాపించాయి. కేజ్రివాల్ ప్రభుత్వాన్ని రద్దు చేయాల్సిందేనంటూ బీజేపీ ఢిల్లీ శాఖ ఓ పక్క బలంగా డిమాండ్ చేస్తుండడం, ఢిల్లీలో ప్రభుత్వం కుప్పకూలి పోయిందంటూ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ఆఫీసర్స్ ప్రకటన విడుదల చేయడం ఈ వదంతులకు మరింత బలం చేకూరుస్తోంది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంగానీ, బీజేపీ కేంద్ర నాయకులుగానీ ఇంతవరకు నోరు విప్పలేదు. చర్చల ద్వారానే ఈ సంక్షోభాన్ని పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ సూచిస్తోంది. కేజ్రివాల్ అధికార నివాసంలో ఫిబ్రవరి 19వ తేదీ సాయంత్రం ఆప్ ఎమ్మెల్యేలు అమానతుల్లా ఖాన్, ప్రకాశ్ జార్వల్‌లు తనపై చేయి చేసుకున్నారంటూ ఆ మరుసటి రోజు ఢిల్లీ చీఫ్ సెక్రటరీ అంషు ప్రకాష్ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను కలుసుకొని ఫిర్యాదు చేయడం, ఆ తర్వాత పోలీసు స్టేషన్లో కేసు పెట్టడం, ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్ట్ చేయడం, జుడీషియల్ కస్టడీకి పంపించడం తదితర పరిణామాలు తెల్సినవే. ఫిబ్రవరి 23వ తేదీన ఢిల్లీ పోలీసులు అనూహ్యంగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ అధికార నివాసంలో సోదాలు నిర్వహించి, సీసీటీవీ కెమేరాల ఫుటేజ్ పట్టుకెళ్లడం సంక్షోభం ముదురుతున్న సంకేతాలనిచ్చింది. ఇది రాష్ట్రపతి పాలన విధిస్తారన్న వదంతులకు దారితీసింది. ఓ రాష్ట్రంలో రాజ్యాంగ యంత్రాంగం విఫలమైందంటూ సంబంధిత రాష్ట్ర గవర్నర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాజ్యాంగంలోని 356వ అధికరణ కింద ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంది. అవసరమైతే కేంద్రమే రాష్ట్ర గవర్నర్ నుంచి అడిగిన నివేదిక తెప్పించుకోవచ్చు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉందా ? అని ఢిల్లీ బీజేపీ



యూనిట్‌ను ప్రశ్నించగా, ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించడం ఒక మార్గం మాత్రమేనని, తాము మాత్రం ఇప్పుడు రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేయడం లేదని ఢిల్లీ బీజేపీ అధికార ప్రతినిధి ప్రవీణ్ శంకర్ కపూర్ తెలిపారు. రాజీనామా చేయాల్సిందిగా మాత్రమే డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. కేజ్రివాల్ ఓ అరాచక వాదని, ఆయన నాయకత్వంలోని ప్రభుత్వం రాజ్యాంగ సంక్షోభంలో పడిపోయిందని ఢిల్లీ పార్టీ వ్యవహారాలు చూస్తున్న బీజేపీ ఉపాధ్యక్షుడు శ్యామ్ జాజు వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై ఓ ఇద్దరు ఎమ్మెల్యేలు చేయి చేసుకున్నంత మాత్రాన ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించాల్సిన అవసరం లేదు. కానీ దీన్ని రాజ్యాంగ సంక్షోభంగా బీజేపీ పరిగణించడం, ఇలాంటి సందర్భాల్లో కేంద్రం నిర్ణయమే చెల్లుబాటు అవుతుంది కనుక రాష్ట్రపతి పాలన గురించి వినిపిస్తోంది.

అన్ని సినిమాల్లో ఎలా నటించారు?

- శ్రీదేవిని ప్రశ్నించిన ప్రముఖ హాలీవుడ్ నటుడు
- శ్రీదేవిని గుర్తు చేసుకున్న స్మృతి ఇరానీ
- శ్రీదేవికి మద్యం సేవించే అలవాటు లేదు
- వెల్లడించిన ఎంపీ అమర్ సింగ్

ముంబయి: అలనాటి నటి శ్రీదేవికి టాలీవుడ్ నుంచి మాలీవుడ్ వరకు అభిమానులు ఉన్నారు. ఆమె హాలీవుడ్ చిత్రాల్లో నటించలేదు కాబట్టి అక్కడి వారికి శ్రీదేవి గురించి పెద్దగా తెలీకపోవచ్చు. కానీ ఆమె దాదాపు 300లకు పైగా చిత్రాల్లో నటించారని తెలిసి ఓ హాలీవుడ్ నటుడు ఆమెకు అభిమాని అయిపోయారు. అతనే ఓర్లాండో బ్లూమ్. 2015లో ఓర్లాండో.. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత శీతల్ తల్వార్‌తో కలిసి ఉత్తర్‌ప్రదేశ్ పర్యటనకు వచ్చాడు. ఆ సమయంలో ఎస్పీ నేత అమర్ సింగ్ తన నివాసంలో అందరికీ విందు ఏర్పాటుచేశారు. ఈ విందు కార్యక్రమానికి అమర్.. శ్రీదేవి కుటుంబంతో పాటు ఓర్లాండోను కూడా ఆహ్వానించారు. ఓర్లాండో శ్రీదేవిని కలవడం అదే తొలిసారి. అప్పుడు శ్రీదేవి గురించి శీతల్ తల్వార్ ఓర్లాండోకు చెప్తూ..ఆమె 300లకు పైగా సినిమాల్లో నటించారు. అన్నారు. అది విని ఓర్లాండో ఒక్కసారిగా షాకయ్యారట. ఆ తర్వాత శ్రీదేవిని పలకరిస్తూ..మీరు నిజంగానే 300 సినిమాల్లో నటించారా? అన్ని సినిమాలు ఎలా చేయగలిగారు? అని ఆశ్చర్యంగా ప్రశ్నించారు. ఇందుకు శ్రీదేవి సమాధానంగా చిరునవ్వు చిందించారు. ఆ తరువాత ఓర్లాండో ఆమెతో కాసేపు ముచ్చటించారు. ఇన్ని సినిమాలు ఎలా చేయగలిగారు? ఒక్కో సినిమా చేయడానికి ఎంత సమయం పడుతుంది? అంటూ చిన్నపిల్లాడిలా ఆమెను ప్రశ్నిస్తూ ఉండిపోయారు. ఇందుకు శ్రీదేవి సమాధానం చెబుతూ..సినిమాను బట్టి ఉంటుంది అన్నారు.




ఓర్లాండో శ్రీదేవిని కలిసినప్పుడు అతను హాలీవుడ్‌లో 28 సినిమాలు చేశారు. అయితే శ్రీదేవి ఈ లోకంలో లేరన్న విషయమై ఓర్లాండో స్పందించాల్సి ఉంది. దివంగత నటి శ్రీదేవిని గుర్తుచేసుకుంటూ కేంద్రమంత్రి స్మృతి ఇరానీ భావోద్వేగపు లేఖను రాశారు. రాజకీయాల్లోకి రాకముందు స్మృతి బుల్లితెర నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. శ్రీదేవి ఓ నటిగా తనను ఎంతగా ప్రభావితం చేసిందో వివరిస్తూ రాసిన లేఖ ఇది. నటిగా ఎదిగారు. ఆమె ఎక్కడుంటే అక్కడ ఆ ప్రాంతమంతా సందడిగా, అందంగా ఉంటుంది. గతేడాది నవంబర్‌లో గోవాలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవ కార్యక్రమంలో శ్రీదేవిని కలిశాను. ఆమెను కలవడం అదే ఆఖరిసారి. సినీ రంగానికి శ్రీదేవి చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ ధన్యవాదాలు చెప్పాను. అప్పుడు ఇక్కడ కాకపోతే ఇంకెక్కడ ఉంటాను అని శ్రీదేవి నాతో అన్నారు. ఆ మాటలు ఇప్పటికీ నా చెవుల్లో మారుమోగుతున్నాయి. అందం ఉంది కానీ అహంభావం లేని మనిషి. ఆమెకు నేను వీరాభిమానిని. వివిధ కార్యక్రమాల్లో శ్రీదేవిని కలిసే అవకాశం దక్కేది. కలిసిన ప్రతీసారి ఆ మహానటి గురించి మరిన్ని విషయాలు తెలుసుకుంటుండేదాన్ని. జీవితంలో ఎన్ని ఆటంకాలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోగల సత్తా ఆమెకు ఉంది. శ్రీదేవి నటించిన చాల్‌బాజ్, చాందిని, సద్మా, లమ్హే చిత్రాల్లో ఆమె నటన నన్ను ప్రభావితం చేసింది. తన నటనతో శ్రీదేవి ఎంతటి స్టార్‌డమ్ సంపాదించుకుందంటే.. హీరోలు ఆమె ద్వారానే బాక్సాఫీస్ వద్ద విజయాలు అందుకునేవారు అని లేఖలో పేర్కొన్నారు. ప్రముఖ సినీనటి శ్రీదేవి మృతిపై రాజ్యసభ ఎంపీ అమర్ సింగ్ అనుమానం వ్యక్తం చేశారు. శ్రీదేవికి మద్యం సేవించే అలవాటు లేదని ఆయన తెలిపారు. అయితే కొన్ని సందర్భాల్లో ఆమె వైన్ మాత్రం తీసుకునేవారని అమర్ సింగ్ పేర్కొన్నారు. అలాంటప్పుడు శ్రీదేవి రక్త నమునాల్లో మద్యం అవశేషాలు ఎలా ఉంటాయని ఆయన ప్రశ్నించారు. ఆమె మృతిపై లోతైన విచారణ చేపట్టాలన్నారు. శ్రీదేవి మృతి ఘటనపై అబుదాబి యువరాజు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్తో తాను మాట్లాడినట్లు అమర్ సింగ్ తెలిపారు. అన్ని ఫార్మాలిటీలు పూర్తి చేసి, శ్రీదేవి మృతదేహాన్ని భారత్‌కు పంపిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆమె భౌతికకాయం సోమవారం రాత్రికి ముంబై చేరే అవకాశం ఉన్నట్లు అమర్ సింగ్ పేర్కొన్నారు. కాగా శ్రీదేవీ మృతిపై వస్తున్న అనుమానాలను నివృత్తి చేస్తూ యూఏఈ ఆరోగ్యశాఖ సోమవారం ఫోరెన్సిక్ నివేదికను విడుదల చేసింది. ఆ నివేదికలో ప్రమాదవశాత్తు ఆమె కాలు జారి నీటి టబ్‌లో పడిపోవడం వల్లే మృతి చెందినట్టు పేర్కొంది. అయితే శ్రీదేవి శరీరంలో ఆల్కహాల్‌ను గుర్తించినట్టు యూఏఈ రిపోర్టు పేర్కొంది. అయితే ఆమెకు గుండెపోటు వచ్చిందనే విషయాన్ని ఫోరెన్సిక్ నివేదికలో ప్రస్తావించలేదు. మరోవైపు శ్రీదేవి భర్త బోనీకపూర్‌ను దుబాయ్ పోలీసులు సుమారు మూడున్నర గంటల పాటు ప్రశ్నించారు.

చంద్రుడిపై ఇళ్ల నిర్మాణానికి సిద్ధం



బెంగళూరు: చంద్రుడిపై ఇళ్లు కట్టేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. చంద్రుడిపై ఇగ్లూ తరహాలో నిర్మించనున్న ఈ కట్టడాలను లూనార్ హెబిటేట్స్‌గా పిలవనున్నారు. ఇగ్లూలను నిర్మించేందుకు రోబోలు, త్రీడీ ప్రింటర్లను చంద్రుడిపైకి పంపనున్నారు. ఇవి చంద్రుడిపై మట్టి, ఇతర ముడి పదార్థాలను అక్కడే సేకరించి ఇగ్లూలను నిర్మిస్తాయి. ఈ ప్రాజెక్టు కోసం ఇస్రో ఇప్పటికే ఐదు ఇగ్లూ నమూనాలను సిద్ధం చేసింది. చంద్రుడిపై ఇస్రో నిర్మించనున్న ఇగ్లూలు గడ్డకట్టే అంటార్కిటికాలోని భారత అవుట్‌పోస్టును పోలి ఉంటాయని ఇస్రో శాటిలైట్ సెంటర్ (ఇసాక్) డైరెక్టర్ ఎం.అన్నాదురై తెలిపారు. చంద్రుడిపై శాశ్వత నిర్మాణాలు చేపట్టడం ద్వా రా చాలా దేశాలు స్పేస్ స్టేషన్‌కు స్వస్తి చెప్పేందుకు సిద్ధమవుతున్నట్టు ఆయన తెలిపారు. ఇస్రో కూడా అందులో భాగస్వామ్యం కానుందని వివరించారు. చంద్రుడిపైకి వెళ్లే వ్యోమగాములు కొన్ని గంటలపాటు ఇగ్లూల్లో గడుపుతారని, వారు క్షేమంగా ఉండే బాధ్యతను ఇస్రో చూసుకుంటుందని అన్నాదురై పేర్కొన్నారు.

కర్నాటక ప్రజలకు అమిత్ షా మహా వాగ్దానం



బెంగళూరు : త్వరలో జరిగే కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే కరవు పీడిత జిల్లాలకు మహాదయి జలాలను రప్పిస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా గట్టి హామీ ఇచ్చారు. మహాదయి జలాల సమస్యపై గోవాతో చర్చించి, తగిన పరిష్కారాన్ని కనుగొంటామని తెలిపారు. ఆయన సోమవారం కలబురగిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ - కర్ణాటక ప్రాంతంలో ఆయన రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం వచ్చిన సంగతి తెలిసిందే. ఏప్రిల్-మేలలో జరిగే శాసనసభ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే, అధికారాన్ని చేపట్టిన వెంటనే గోవాతో చర్చించి, మహాదయి జలాల సమస్యను పరిష్కరిస్తామన్నారు. సిద్ధరామయ్య ప్రభుత్వం చొరవ చూపించి, గోవా, మహారాష్ట్రలతో చర్చలు జరిపి ఉంటే ఇప్పటికే ఈ సమస్య పరిష్కారమైపోయి ఉండేదన్నారు. సిద్ధరామయ్య ప్రభుత్వం ఐదేళ్ళ నుంచి శాంతిభద్రతలతో సహా అన్ని రంగాల్లోనూ విఫలమైందన్నారు. అవినీతికి పర్యాయపదంగా ఆయన ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు.

పాడ్‌మాన్ స్ఫూర్తిని చాటిన ఒడిశా పాఠశాల



భువనేశ్వర్ : అక్షయ్‌కుమార్ పాడ్‌మన్ మూవీ పలువురిని కదిలిస్తోంది. ఒడిశా ప్రభుత్వం ఖుషీ పేరుతో స్కూల్ విద్యార్థినులకు ఉచిత శానిటీరీ ప్యాడ్స్ పంపిణీ పథకాన్ని చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి విద్యార్థినులందరికీ ఉచితంగా శానిటరీ నాప్కిన్‌లను అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రారంభించారు. రాష్ట్రంలో 17 లక్షల మంది స్కూల్ విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్‌లను ఉచితంగా అందించే పథకం ప్రవేశపెడుతున్నామని, సబ్సిడీ ధరలకు ఇతర మహిళలు, విద్యార్థినులకు వీటిని పంపిణీ చేసే ఉద్దేశం ఉందని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో స్కూల్ విద్యార్థినుల్లో పరిశుభ్రత, ఆరోగ్యం మెరుగై మహిళా సాధికారత దిశగా అడుగులుపడతాయని చెప్పుకొచ్చారు. పాఠశాల విద్యార్థినులు విద్యను కొనసాగించేందుకూ ఈ నిర్ణయం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గవర్నర్‌కు కోపమొచ్చింది



ముంబయి : మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావుకు కోపం వచ్చింది. తన ప్రసంగానికి మరాఠీ అనువాదం మిస్సయిందని ఆయన అటు శాసన మండలి చైర్మన్‌పై, శాసనసభ స్పీకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి చేష్టలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం మహారాష్ట్ర అసెంబ్లీ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. అయితే, ఆ ప్రసంగానికి సంబంధించి మరాఠీ అనువాదం చేసేందుకు ఎవరు ప్రయత్నించనట్లు తాను గుర్తించానంటూ ఇలా ఎందుకు జరిగిందని ప్రశ్నిస్తూ ఆయన మహారాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్ రామ్‌రాజేనాయక్ నిమ్‌బకార్‌కు, అసెంబ్లీ స్పీకర్ హరిభౌ బగదేకు లేఖ రాశారు. ఈ రోజు ఉదయం ఉభయ సభలను ఉద్దేశించి నేను ప్రసంగిస్తున్న సమయంలో నా ప్రసంగాన్ని మరాఠీలోకి అనువాదం చేయలేదు. ఇలాంటిది సీరియస్‌గా తీసుకోవాలనది నా ఉద్దేశం. దీనికి కారణమైనవారిపై కచ్చితంగా సీరియస్ యాక్షన్ తీసుకోవాలి. అలాగే ఏం చర్యలు తీసుకున్నారో నాకు తెలియజేయాలి అని విద్యాసాగర్ రావు లేఖలో పేర్కొన్నారు.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్



రాంచీ : జార్ఖండ్‌లోని పలము జిల్లాలో సోమవారం తెల్లవారుజాము సీఆర్పీఎఫ్ బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఈ క్రమంలో కూంబింగ్ నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ బలగాలకు మావోయిస్టులు తారసపడగా.. ఇరు వర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందినట్టు బలగాలు గుర్తించాయి. మరికొందరు మావోయిస్టులు ఉన్నట్టు పోలీసులు భావిస్తున్నారు. వారి ఆచూకీ కోసం కూంబింగ్ కొనసాగుతోంది.

మళ్లీ ఆసుపత్రిలో చేరిన గోవా సీఎం

పనాజీ : అనారోగ్యంతో బాధపడుతున్న గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారీకర్ మరోసారి ఆసుపత్రిలో చేరారు. డీహైడ్రేషన్, రక్తపోటు (బీపీ) పడిపోవడంతో ఆయన ఆదివారం రాత్రి గోవా మెడికల్ కాలేజీలో చేరారు. కొంతకాలంగా అ స్వస్థతతో ఉన్న పారీకర్ (62)ను అమెరికా తరలించి చికిత్స అందించే అవకాశ ముందని కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఈ కథనాలను పారీకర్ ను చికిత్స అందిస్తున్న ఆస్పత్రి తోసిపుచ్చింది. ప్రస్తుతం సీఎం కోలుకుంటున్నా రని తెలిపింది. డీహైడ్రేషన్ కారణంగా సీఎం వైద్యుల సలహా మేరకు ఆస్పత్రిలో చేరారు. ఆయన త్వరితగతిన కోలుకుంటున్నారు అని గోవా సీఎంవో ఒక ప్రక టనలో తెలిపింది. స్పెషలిస్ట్ డాక్టర్లు సీఎం ఆరోగ్యపరిస్థితిని నిరంతరం పర్యవేక్షి స్తున్నారని గోవా ఆరోగ్యశాఖ మంత్రి విశ్వజిత్ రాణే మీడియాకు తెలిపారు. వీల్‌చైర్ మీద సీఎం పారీకర్‌ను ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ సమయంలో ఆయన వెంట కుటుంబసభ్యులు కూడా ఉన్నారు. ఫిబ్రవరి 15న అనారోగ్యం కారణంగా ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో పారీకర్ చేరిన సంగతి తెలిసిందే. పాన్‌క్రియాటిస్ (క్లోమ సంబంధ) అస్వస్థతో బాధపడుతున్న ఆయన ఫిబ్రవరి 22న ఆస్పత్రి నుంచి డిశార్జ్ అయి.. గోవా అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్నారు.

దరువేస్తూ చిందేసిన సీఎం



బెంగళూరు : జాతీయ పార్టీల అధ్యక్షుల రాకతో కర్ణాటక కళకళ లాడుతోంది. ఇప్పటికే బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కర్ణాటకలో అడుగుపెట్టి కాంగ్రెస్‌పై, సీఎం సిద్దరామయ్యపై తీవ్ర విమర్శలు చేస్తుండగా తాజగా, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ రంగంలోకి దిగారు. సోమవారం కర్ణాటక వచ్చిన ఆయన గోడచిలోని వీరభద్ర ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బెలగావిలోని సౌందట్టి ప్రాంతంలో యల్లమ్మ ఆలయం సందర్శించారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ, సీఎం సిద్ద రామయ్య సాంప్రదాయ డప్పులపై దరువులు వేశారు. దరువు వేసే క్రమంలో తన ఊపును ఆపుకోలేక సిద్ద రామయ్య చిందేశారు.

సూర్య
హైదరాబాద్
మంగళవారం 27 ఫిబ్రవరి 2018

తొలి భారత బాక్సర్‌గా వికాస్ క్రిషన్ ఘనత

సోఫియా: స్ట్రాండ్‌జా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్ వికాస్ క్రిషన్ చరిత్ర సృష్టించాడు. ఈ టోర్నమెంట్‌లో స్వర్ణం గెలిచిన తర్వాత బెస్ట్ బాక్సర్ అవార్డును వికాస్ సొంతం చేసుకున్నాడు. తద్వారా ఈ బాక్సింగ్ టోర్నమెంట్‌లో బెస్ట్ బాక్సర్ అవార్డును గెలుచుకున్న మొదటి భారత బాక్సర్‌గా వికాస్ నిలిచాడు. సోఫియా వేదికగా 75 కేజీల మిడిల్ వెయిట్ విభాగంలో జరిగిన తుది పోరులో వికాస్ విజయ సాధించి పసిడిని సొంతం చేసుకున్నాడు. అదే సమయంలో ఈ టోర్నమెంట్‌లో అత్యుత్తమ బాక్సర్ అవార్డును సైతం సొంతం చేసుకుని కొత్త అధ్యాయాన్ని లిఖించాడు. ఫైనల్ పోరులో వరల్డ్ చాంపియన్స్ కాంస్య పతక విజేత ట్రో ఇస్లే(అమెరికా)పై గెలిచి స్వర్ణాన్ని సొంతం చేసుకున్నాడు. ఫలితంగా గతేడాది ఆసియా చాంపియన్‌షిప్స్‌లో కాంస్య పతకం సాధించిన తర్వాత తొలి పతకాన్ని అందుకున్నాడు. మరొకవైపు మరో భారత బాక్సర్ అమిత్ పంగల్ కూడా పసిడిని ఒడిసి పట్టుకున్నాడు. 49 కేజీల విభాగంలో అమిత్ స్వర్ణాన్ని సాధించాడు. ఇక మహిళల తుది పోరులో మేరీకోమ్ రజతంతో సరిపెట్టుకుంది. దాంతో ఇక్కడ వరుసగా మూడో స్వర్ణ పతకాన్ని సాధించాలనుకున్న మేరీకోమ్‌కు నిరాశే ఎదురైంది. 48 కేజీల విభాగంలో బల్గేరియాకు చెందిన సెవదా అసెనోవా చేతిలో మేరీకోమ్ ఓటమి పాలై రజత పతకానికే పరిమితమయ్యారు. స్ట్రాండ్‌జా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత జట్టు 11 పతకాలతో పోరును ముగించింది. ఇందులో ఐదు పతకాలు పురుషులు సాధించగా, ఆరు పతకాల్ని మహిళలు సొంతం చేసుకున్నారు. ఇక్కడ రెండు స్వర్ణ పతకాలు, మూడు రజత పతకాలు, ఆరు కాంస్య పతకాలు భారత్ ఖాతాలో చేరడం విశేషం.

విరాట్ కోహ్లీ చర్యలు ఆసక్తికరం

- సహచర ఆటగాళ్లకు కూల్‌డ్రింక్స్
- తాజాగా ధావన్‌కు హెడ్ మసాజ్
- రాహుల్ ద్రవిడ్ - గంగూలీ రికార్డును సమం చేసిన కోహ్లి-ధావన్
- అద్భుతంగా రాణించడం వల్లే అగ్రస్థానం : కోహ్లీ



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా సిరీస్‌లో అత్యద్భుతంగా రాణించాడు జట్టు సారథి విరాట్ కోహ్లి. ఆపద సమయాల్లో ఆదుకుంటూనే వీలు చిక్కినప్పుడల్లా పరుగుల వరద పారించాడు. అయితే వెన్ను నొప్పి కారణంగా చివరి టీ20 మ్యాచ్ నుంచి విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితిలో ఏ ఆటగాడైనా డ్రస్సింగ్ రూమ్‌కు పరిమితమై చక్కగా విశ్రాంతి తీసుకుంటాడు. కానీ, విరాట్ అందుకు భిన్నం. టెస్టు మ్యాచ్‌ల సందర్భంగా సహచర ఆటగాళ్లకు కూల్‌డ్రింక్స్ ఇవ్వడం, సూచనలు ఇవ్వడం చేస్తుంటాడు. అయితే ఈ సారి మూడో టీ20 సందర్భంగా ధావన్‌కు హెడ్ మసాజ్ చేస్తూ కనిపించాడు. ప్రస్తుతం ఈ ఫొటో సామాజిక మాధ్యమాల వేదికగా చక్కర్లు కొడుతోంది. ఇలాంటి ఫ్రెండ్ ఒకడు కావాలి, విరాట్ తన నైపుణ్యాన్ని ధావన్‌కు బదిలీ చేస్తున్నాడు అంటూ కామెంట్స్ పెడుతున్నారు. మైదానం బయట కోహ్లి-ధావన్‌లు మంచి స్నేహితులు. ఎక్కడికి వెళ్లినా, దాదాపు కలిసి వెళ్తుంటారు. ఇరు ఫ్యామిలీలతో సెల్ఫీలు దిగుతూ అభిమానులతో పంచుకుంటారు. అంతేకాదు మైదానంలో కూడా ఈ జోడీ కీలక భాగస్వామ్యాలను నెలకొల్పింది. జొహనెస్‌బర్గ్ వేదికగా జరిగిన నాలుగో వన్డేలో ఇరువురు కలిసి రెండో వికెట్‌కు 158 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించి, రాహుల్ ద్రవిడ్-గంగూలీ రికార్డును సమం చేశారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఎనిమిదిసార్లు 100 అంతకన్నా ఎక్కువ పరుగుల భాగస్వామ్యాలను నెలకొల్పారు. ఐసీసీ టెస్టు ఛాంపియన్ షిప్ గద వరుసగా రెండో సారి అందుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. భారత జట్టులో ఉన్న ప్రతి ఒక్కరికీ ఇది ఎంతో ప్రత్యేకమైన అనుభూతి. భారత్ క్రికెట్ సిబ్బందికి కూడా ధన్యవాదాలు. ఇక ప్రపంచ వ్యాప్తంగా పెద్ద పెద్ద జట్లతో ఆడుతున్నప్పుడు దగ్గరుండి మమల్ని ప్రోత్సహించిన భారత క్రికెట్ అభిమానులందరికీ కృతజ్ఞతలు. కఠిన సమయాల్లో కూడా మా వెంటే ఉండి నిత్యం ప్రోత్సహించారు. ఇదే ప్రదర్శనను కొనసాగిస్తూ భారత క్రికెట్‌ను ఉన్నత శిఖరాల్లో నిలబెడతామని మీకు మాటిస్తున్నాను. ఇదంతా అభిమానులు, జట్టు సమష్టి విజయం. రానున్న 12-18 నెలల్లో విదేశాలలో కఠినమైన సిరీస్‌లు ఆడనున్నాం. ఇదే ప్రోత్సాహాన్ని అప్పుడు కూడా మీ నుంచి పొందుతామని ఆశిస్తున్నా ఐసీసీ టెస్టు ఛాంపియన్‌షిప్ గదను అందుకున్న అనంతరం భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి అన్న మాటలివి. గత కొన్ని సంవత్సరాలుగా టెస్టులలో నిలకడగా ఆడుతూ అద్భుతంగా రాణించడం వల్లే అగ్రస్థానాన్ని పదిలం చేసుకోగలిగామని కోహ్లి అన్నాడు. టెస్టులలో అగ్రస్థానంలో కొనసాగుతున్న భారత్‌కు ఐసీసీ శనివారం రాత్ర టెస్టు ఛాంపియన్‌షిప్ గదను అందించింది. కేప్‌టౌన్‌లో ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమర్స్ సునీల్ గవాస్కర్, గ్రేమ్ పొలాక్ చేతుల మీదుగా భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఈ గదను అందుకున్నాడు. గదతో పాటు 1 మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీ సైతం ఐసీసీ టీంఇండియాకు అందజేసింది. టెస్టుల్లో అగ్రస్థానంలో ఉన్న భారత్‌కు దరిదాపుల్లో కూడా ఏ జట్టు లేకపోవడంతో ఐసీసీ టెస్ట్ ఛాంపియన్ షిప్ గదను అందించింది. టీంఇండియా 2016 అక్టోబర్ నుంచి టెస్టుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. కోహ్లి కంటే ముందు ఈ గదను అందుకున్న ఘనత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని పేరున ఉంది. ధోని నేతృత్వంలో టీంఇండియా 2009 నవంబర్ నుంచి 2011 ఆగస్టు వరకు అగ్రస్థానంలో కొనసాగింది.

ఐపీఎల్ నన్ను పూర్తిగా మార్చేసింది : భువనేశ్వర్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పర్యటనలో భారత బౌలర్లు అద్భుతంగా రాణించారనటంలో ఎలాంటి సందేహం లేదు. టెస్ట్‌లలో సీమర్లు తమ ప్రతాపం చూపించగా, పరిమిత ఓవర్ల మ్యాచ్‌లలో స్పిన్నర్లు తమ మణికట్టుతో మాయ చేసేశారు. ఫాస్ట్ బౌలింగ్‌కు మాత్రమే అనుకూలించే దక్షిణాఫ్రికా వంటి కఠిన మైన పిచ్‌లపై భారత స్పిన్నర్లు కూడా అసాధ్యాన్ని సుసాధ్యం చేసి ఔరా అనుపించుకున్నారు. ఇక భారత పేస్ దళానికి నేతృత్వం వహించిన సీమర్ భువనేశ్వర్ కుమార్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వన్డేల్లో వికెట్లు పడగొట్టడానికి ఇబ్బంది పడినా, టెస్ట్‌లు, టీ20లలో మాత్రం భువీ విశేషంగా రాణించాడు. ఇక టీ20 సిరీస్‌లో ఏడు వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ చేజిక్కించుకున్న భువీ, దక్షిణాఫ్రికా టూర్‌లో విజయవంతంగా రాణించడానికి ఐపీఎలే ప్రధాన కారణమని అంటున్నాడు. లీగ్ ద్వారా వచ్చిన అనుభవమే తనను ఆలోచనాత్మక బౌలర్‌గా మర్చిందని భువనేశ్వర్ అన్నాడు. టీ20 ఫార్మెట్ అంటేనే తక్కువ సమయంలో పూర్తవుతుంది. ఒక బౌలర్‌గా నిరూపించుకోవడానికి మన చేతిలో కేవలం నాలుగు ఓవర్లే ఉంటాయి. ఒకవేళ దురదృష్టవశాత్తు ఓవర్‌లో వరుసగా మూడు చెత్త బంతులు పడితే ఇక అంతే సంగతులు. అది పూర్తిగా మ్యాచ్ మీదున్న విశ్లేషణనే దెబ్బతీస్తుంది. దీంతో జట్టు విజయానికి కూడా దూరమయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఇందులో ప్రతి ఒక్క బంతి కీలకమే. అదే ఒక బౌలర్‌ను ఆలోచనాత్మక బౌలర్‌గా మారుస్తుంది. అప్పుడే విజయం ప్రణాళిక ప్రకారం వస్తుందనిభువనేశ్వర్ అన్నాడు. ఈ సిరీస్‌లో కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ బంతులు విసరడం వలన బ్యాట్స్‌మెన్‌ను ప్రలోభపెట్టే అవకాశం దొరికింది. దాని కారణంగానే నేను పవర్‌ప్లేలో విజయవంతంగా రాణించగలిగినట్లు భువీ చెప్పాడు. ఈ విషయంలో బుమ్రా తనకు నచ్చినట్లు ఆడుతుంటాడు. టీం అనుకున్న ప్రణాళికకు విరుద్ధంగా ఆడినా, చివరికి మాత్రం విజయాన్ని సాధించగలుగుతాడని భువీ తెలిపాడు. పవర్‌ప్లేలో బౌలింగ్ కట్టుదిట్టంగా చేయడం, మరోవైపు హిట్టింగ్ బ్యాట్స్‌మెన్ నుంచి కీలక ఇన్నింగ్స్ రావడం వలనే ఇటీవల భారత్‌కు నిలకడగా విజయాలు సాధ్యపడుతున్నాయని ఈ మీడియం పేస్ బౌలర్ అభిప్రాయపడుతున్నాడు. ఇక దక్షిణాఫ్రికా పర్యటన ద్వారా వచ్చిన గెలుపు జట్టు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచిందని, ఇదే ఉత్సహాన్ని రానున్న ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా పర్యటనలోనూ కొనసాగించే ప్రయత్నం చేస్తామని భువనేశ్వర్ తెలిపాడు. భువనేశ్వర్ కుమార్



ఈ దక్షిణాఫ్రికా పర్యటనలో అన్ని ఫార్మెట్‌లలో మొత్తం 21వికెట్లు పడగొట్టాడు. మరో వైపు టీ20 సిరీస్‌లోనూ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ట్రోఫీని అందుకున్నాడు.

ద్రవిడ్ మాటకు బీసీసీఐ స్పందన



న్యూఢిల్లీ: అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు శిక్షక బృందంలో ఉన్న సహాయ సిబ్బందికి తనతో పోలిస్తే తక్కువ నజరానాలివ్వడంపై కోచ్ రాహుల్ ద్రవిడ్ లేవనెత్తిన అభ్యంతరాలపై బీసీసీఐ స్పందించింది. అందరికీ సమానంగా నజరానాలు ఇవ్వడానికి బోర్డు అంగీకరించింది. మొదట బోర్డు ద్రవిడ్‌కు రూ.50 లక్షలు, మిగతా సహాయ సిబ్బందిలో ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున నజరానాలు ప్రకటించింది. ఇది భావ్యం కాదని, తనకు ప్రకటించిన మొత్తాన్ని తగ్గించి అందరికీ సమానంగా బహుమతి అందించాలని ద్రవిడ్ కోరినట్లుగా వార్తలొచ్చాయి. ఇందుకు అంగీకరించిన బోర్డు.. ద్రవిడ్‌తో పాటు అందరికీ ఒకే రకంగా రూ.25 లక్షల చొప్పున నజరానా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రపంచకప్ జట్టులో సభ్యులు ఒక్కొక్కరికి రూ.30 లక్షల చొప్పున బీసీసీఐ నజరానా ప్రకటించిన సంగతి తెలిసిందే.

రిటైర్మెంట్ ప్రకటించిన ప్రముఖ క్రికెటర్



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ మోర్నీ మోర్కెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్నాడు. త్వరలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే సిరీసే తనకు ఆఖరి దని, ఆ తరువాత అన్ని ఫార్మాట్లకు గుడ్‌బై చెబుతున్నట్లు మోర్కెల్ ప్రకటించాడు. బిజీ షెడ్యూల్ కారణంగా కుటుంబం కోసం సమయాన్ని కేటాయించలేకపోతున్నానని.. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించాడు. ఇది నాకు కచ్చితంగా కఠిన నిర్ణయమే.. కానీ, కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ఇదే సరైన సమయం అన్పించింది. తీరికలేని షెడ్యూల్‌తో మాపై ఒత్తిడి పడుతోంది. కుటుంబంతో కలిసి గడిపేందుకు ఇకపై నాకు సమయం దొరుకుతుంది. అని మోర్కెల్ చెప్పాడు. ఇన్నాళ్లూ తనకు అండగా నిలిచిన క్రికెట్ సహచరులు, కుటుంబసభ్యులకు మోర్కెల్ కృతజ్ఞతలు తెలిపాడు. 2006లో భారత్‌తో జరిగిన బాక్సింగ్ డే టెస్ట్‌తో మోర్కెల్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఆరంగేట్రం చేశాడు. కెరీర్‌లో 83 టెస్ట్‌లు, 117 వన్డేలు, 44 టీ20, 70 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన మోర్కెల్.. టెస్టుల్లో 294, వన్డేల్లో 188, టీ20ల్లో 47, ఐపీఎల్‌లో 77 వికెట్లు తీశాడు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044